అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సోమవారం 20-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 319 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50



ఆసీస్ సిక్సర్

ఐసీసీ ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా

- ఆసీస్ గూటికి రికార్డు ఆరో టైటిల్
- టైటిల్ పోరులో ఆతిథ్య భారత్ ఓటమి
- ఛేదనలో ట్రావిశ్ హెడ్ మెరుపు శతకం

ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ విరాట్ కోహ్లి

నవతెలంగాణ-అహ్మదాబాద్ :
అజేయ జైత్రయాత్రకు అనుకోని ముగింపు. 12 ఏండ్ల విరామానికి తెరదించుతూ ప్రపంచకప్ సాధించాలనే కల ఇటు ఆటగాళ్లు, అటు అభిమానులకు కన్నీరు మిగిల్చింది. ఆదివారం అహ్మదాబాద్‌లోని మొతెరా మైదానంలో ఐసీసీ 2023 ప్రపంచకప్ ఫైనల్లో హాట్ ఫేవరేట్‌గా బరిలో నిలిచిన టీమ్ ఇండియా.. 6 వికెట్ల తేడాతో పరాజయం చవిచూసింది. కెఎల్ రాహుల్ (66), విరాట్ కోహ్లి (54), రోహిత్ శర్మ (47) రాణించటంతో తొలుత భారత్ 50 ఓవర్లలో 240 పరుగులు చేసింది. ఛేదనలో ఆస్ట్రేలియాను ఆరంభంలో 47/3తో ఒత్తిడిలోకి నెట్టినా.. ట్రావిశ్ హెడ్ (137), మార్నస్ లబుషేన్ (58 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆతిథ్య జట్టు ఆశలను ఆవిరి చేశారు. స్లో పిచ్, ఆపై మంచు ప్రభావంతో బంతిపై పట్టు చిక్కక భారత బౌలర్లు ఇబ్బంది పడగా.. ట్రావిశ్ హెడ్, లబుషేన్ నాల్గో వికెట్‌కు 192 పరుగులు జోడించి ఆస్ట్రేలియాను విజేతగా నిలబెట్టారు. 43 ఓవర్లలోనే 241/4తో భారత్‌పై గెలుపొంది ప్రపంచకప్ విజేతగా నిలిచిన ఆస్ట్రేలియాకు ఇది ఆరో ఐసీసీ వరల్డ్‌కప్ టైటిల్ కావటం విశేషం.

2003 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడిన భారత్.. 20 ఏండ్ల తర్వాత సైతం కంగారూలకు కప్పు కోల్పోయింది. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డుతో అభిమానులకు ఊరట దక్కించాడు.

వివరాలు ఆటలులో..

అధికారమిస్తే అభివృద్ధి చూపిస్తాం



జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం

- తెలంగాణ ఇచ్చినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు
- పెద్ద కంపెనీల దోస్తానీతో బీజేపీ దేశాన్ని నాశనం చేస్తోంది :

ఖానాపూర్, ఆసిఫాబాద్ సభల్లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి
పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా దోచుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన లక్ష్యం.. ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. పెద్ద కంపెనీలతో దోస్తానీ చేస్తూ బీజేపీ దేశాన్ని నాశనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్రంలో బీజేపీ నేతలు పెద్దలకు రుణమాఫీ చేస్తారు తప్ప రైతులు, కార్మికులకు రుణాలు మాఫీ చేయబోరని అన్నారు. దేశంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రజల రక్తం తాగుతున్నారని ఘాటుగా విమర్శించారు. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించాలని.. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని అన్నారు. అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్, కుమురంభీం ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభల్లో ప్రియాంక గాంధీ పాల్గొని మాట్లాడారు. ఖానాపూర్, నిర్మల్, ఆసిఫాబాద్, సిర్పూర్ కాంగ్రెస్ అభ్యర్థులు వెడ్మ బొజ్జు, శ్రీహరిరావు, శ్యాంనాయక్, రావి శ్రీనివాస్‌లను ...7లో

110 స్థానాల్లో బీజేపీకి డిపాజిట్ గల్లంతు

- ఓడిపోయే పార్టీ బీసీ సీఎం అంటే నమ్మేదెవరు?
- దమ్ముంటే పార్లమెంటులో వర్గీకరణ బిల్లు పెట్టండి... కమిటీ ఎందుకు? : రేవంత్ రెడ్డి



వివరాలు 8లో



అందరికి అండ..ఎర్రజెండా

- ఓటుతో ప్రజాస్వామ్యాన్ని గెలిపించండి
- ధనస్వామ్యాన్ని తిరస్కరించండి: రాఘవులు, మధు, తమ్మినేని
- ఉధృతంగా సీపీఐ(ఎం) అభ్యర్థుల ప్రచారం
- జననేతలకు ప్రజల నీరాజనం

సీపీఐ(ఎం) అభ్యర్థుల ఎన్నికల ప్రచార జోరు హుషారుగా సాగుతోంది. లింగ, వయో భేదం లేకుండా ప్రజలు వారికి బ్రహ్మరథం పడుతున్నారు. ఇన్నాళ్లు మాకోసం మీరు కొట్లాడారు...ఇప్పుడు మీకు తోడుగా మేం ఉంటాం అంటూ ఓటర్లే కార్యకర్తలుగా మారి ప్రచారం చేస్తున్నారు. ఎర్రజెండా ఒంటరిపోరును మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ, మద్దతిస్తున్నారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ మాజీ కార్యదర్శి పీ మధు, తెలంగాణ శాఖ కార్యదర్శి, పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం సహా పార్టీ శ్రేణులంతా సత్తా చాటేందుకు చెమటోడుస్తున్నారు. ఆదివారం వీరంతా వివిధ ప్రాంతాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల బూర్జువా విధానాలను ఎక్కడికక్కడ ఎండగడుతూ...అవన్నీ ఒకే తానులో ముక్కలని ప్రజలకు అర్థం అయ్యేలా చెప్తున్నారు. విధానాల మార్పు లేకుండా సమసమాజ స్థాపన సాధ్యం కాదనే వాస్తవాలను వివరించి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు ఆసక్తిగా నిజానిజాలను నిర్ధారించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఎర్రజెండాలతో కదులుతున్న ఎర్రదండుకు ఘనస్వాగతం పలుకుతున్నారు.



దేశానికి పట్టిన శని బీజేపీ ప్రభుత్వం

- కేసీఆర్ కుటుంబానికి కాలం చెల్లింది
- ఊసరవెల్లి కోమటిరెడ్డి
- పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థులను ఆదరించాలి : చౌటుప్పల్ రోడ్‌షోలో మాజీ ఎంపీ పి. మధు

5లో..



మా వల్లే అడవిబిడ్డలకు 'పోడు' పత్రాలు

- ప్రభుత్వాల మెడలొంచి ప్రజా చట్టాలు తెచ్చింది సీపీఐ(ఎం)
- డబ్బు రాజకీయాలను ఓడించాలి..ప్రజల కోసం పనిచేసే వారిని గెలిపించాలి : సీపీఐ(ఎం) పాలేరు అభ్యర్థి తమ్మినేని

5లో..



కమ్యూనిస్టులకు వేసే ప్రతి ఓటూ ఓ తూటా

- బయట పోట్లాడుతాం.. సభలో మాట్లాడుతాం
- సీపీఐ(ఎం) గెలిస్తేనే పేదలు, కార్మికులకు లాభం : అమీన్‌పూర్ సభలో బీవీ రాఘవులు

వివరాలు 5లో



అడుగడుగునా అన్యాయమే..

ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు దుస్థితి

- రెండు నదులు ఉన్నా అందని సాగునీరు
- నడిగడ్డ ప్రాంతాన్ని చూస్తే కండ్లకు నీరు వచ్చేది
- పాలమూరు గోస చూసి ఉద్యమం మొదలుపెట్టాం
- మరోసారి కాంగ్రెస్‌కు ఓటు వేసి పొరపాటు చేయొద్దు : ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

నవ తెలంగాణ - మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి
"నేను తెలంగాణ ఏర్పాటు కోసం ఉద్యమం ప్రారంభించిన మొదటి దశలో అలంపూర్ వచ్చాను. ఇక్కడ కూతవేటు దూరంలో కృష్ణా, తుంగభద్ర నదులు ఉన్నా సాగునీరు లేక భూములు బీళ్లుగా మారాయి. ఉపాధి లేక దుబాయి, ముంబయి వంటి ప్రాంతాలకు వలస పోయేవారు. ఆరిగోసల విముక్తికి ఏకైక మార్గం ప్రత్యేక రాష్ట్రమేనని తలంచి జోగులాంబ నుంచి ఆర్డీఎస్ వరకు పాదయాత్ర చేశాను. ఈ ప్రాంతానికి తెలంగాణ రాష్ట్రం ద్వారానే సాగునీరు అందుతుందని ఆనాడే చెప్పానని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. ఆదివారం అలంపూర్, కొల్లాపూర్, నాగర్ కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ...7లో

చేస్తాం..తగ్గిస్తాం..వాదిస్తాం..

బీజేపీ మ్యానిఫెస్టోలో కనిపించని స్పష్టత



- ఇక్కడ రైతుకు 'మద్దతు'...కేంద్రంలో నో కామెంట్
- కమిటీకే పరిమితమైన ఎస్సీ వర్గీకరణ
- జల వివాదాల పరిష్కారంపై 'నీటిమూటల' హామీ
- కేంద్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి.. ఇక్కడ తగ్గిస్తామని హామీ
- సాయుధ రైతాంగ పోరాటాన్ని రజాకార్ల చుట్టూ తిప్పే యత్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
బీజేపీ ప్రకటించిన మ్యానిఫెస్టోలో స్పష్టత కొరవడింది. ఎప్పటిలాగానే ప్రజల్ని విభజించు పాలించు అనే రీతిలో భావోద్వేగపరమైన అంశాల చుట్టూ తిరిగింది. శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విడుదల చేసిన బీజేపీ ఎన్నికల ప్రణాళిక ఈ విషయాలనే ధ్రువీకరించింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అమలు చేయని హామీలను ఇక్కడ ఎలా అమలు చేస్తారనే చర్చా నడుస్తున్నది. సంక్షేమం గురించి పెద్ద పట్టించుకోలేదనే విమర్శా ఉంది. ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో 700 మంది రైతులు ప్రాణ త్యాగాలు చేసిన తర్వాత నల్లచట్టాలను తాత్కాలికంగా ఉపసంహరించుకున్నా.. మద్దతు ధర హామీ చట్టంపై నేటికీ స్పష్టత ఇవ్వలేదు. కానీ, తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో వరి ధాన్యానికి మద్దతు ధర రూ.3,100 ఇస్తామని మ్యానిఫెస్టోలో చెప్పుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వమే ఎమ్ఎస్‌పీని నిర్ణయిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం బోనస్ మాత్రమే ఇస్తుంది. బీజేపీకి రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే దేశవ్యాప్తంగా ఎమ్ఎస్‌పీ గ్యారంటీ చట్టాన్ని తీసుకొచ్చేది. అలా చేయకపోవడాన్ని చూస్తే ఇది కేవలం ఎన్నికల జిమ్మిక్కు అనే చర్చ నడుస్తున్నది. గత ప్రభుత్వాల మాదిరిగానే ఎస్సీ వర్గీకరణను 'కమిటీకే పరిమితం చేసి..దాన్ని మరికొంత కాలం నానబెట్టే ప్రయత్నం చేసింది. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రకు రజాకార్ల దుష్కృత్యాల సంస్మరణ పేరుతో మతం రంగు పులిమే ప్రయత్నం చేసింది. ఒక మహత్తర ప్రజా పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నాల్లో భాగమే ఇది అనే విమర్శ బలంగా వినిపిస్తున్నది. ఉజ్వల లబ్దిదారులకు ఏడాదికి నాలుగు సిలిండర్లు ఇస్తామని చెప్పిందేగానీ..పేదలందరికీ ఇస్తామని ప్రకటించలేదు. గ్యాస్‌సిలిండర్ల ధర నేడు వెయ్యిరూపాయల దాకా ఉండటానికి కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే. అయినా, బీజేపీ హామీ ద్వారా కొందరికే తప్ప పేదలందరికీ ప్రయోజనం చేకూరే అవకాశమే లేదు.

అంతర్ రాష్ట్రాల మధ్య ఉన్న కృష్ణా, గోదావరి జలాల వివాదం పరిష్కారం విషయంలో కేంద్రం పట్టించుకోలేదు. కృష్ణా జలాల వాటా విషయంలో ట్రిబ్యునల్ వద్ద బలమైన వాదనలు వినిపిస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొందే తప్ప సమస్యను పరిష్కరిస్తామని చెప్పలేదు. జలవివాదాల పరిష్కారంపై నీటిమూటల హామీకే పరిమితమైంది. పెట్రోల్, డీజిల్ ధరలపై నియంత్రణ ఎత్తేయడంతో ...7లో


బీజేపీ మ్యానిఫెస్టో ఎన్నికల జిమ్మిక్కు..

- సంక్షేమ పథకాలకు కోత
- ప్రజల్లో చీలికతెచ్చే కుట్ర : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 7లో

కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎం

- బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా
- చేవెళ్లలో ప్రజా సంకల్ప సభ



నవతెలంగాణ-చేవెళ్ల
తెలంగాణలో అవినీతి పాలన రాజ్యమేలుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ఆరోపించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని కేపీఆర్ గ్రౌండ్‌లో బీజేపీ సకలజనుల సంకల్ప సభ నిర్వహించింది. ఈ సమావేశానికి నడ్డా హాజరై మాట్లాడారు. ఈ తొమ్మిదేండ్లలో మోడీ ప్రభుత్వం తెలంగాణలో రూ.5 లక్షల కోట్ల నిధులు ఖర్చు పెట్టిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ గెలిస్తే ఉజ్వల వినియోగదారులకు ఉచితంగా నాలుగు సిలిండర్లు ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంతమందికి రెండు పడక గదులు ఇచ్చిందో చెప్పాలన్నారు. తెలంగాణ చరిత్రలో తొలిసారి బీసీ వ్యక్తిని సీఎంగా చేస్తామని ప్రటించినట్టు తెలిపారు. తమను గెలిపిస్తే వరికి ...7లో

జబాలియా శరణార్థి శిబిరంపై దాడి

200 మంది మృతి




గాజా సిటీ: గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ వరుసగా మూడు రోజులపాటు జరిపిన బాంబు దాడుల్లో 200 మంది చనిపోయారు. శనివారం ఒక్కరోజే రెండు దాడుల్లో 80 మంది చనిపోయారు. వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారు. మృతి చెందిన వారిలో 19 మంది చిన్నారులు సహా ఒకే కుటుంబానికి చెందిన 32 మంది ఉన్నారు. ఆరు వారాల యుద్ధంలో 16 లక్షల మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులైన గాజాలోని అతిపెద్ద శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ దాడి చేస్తూనే ఉంది. గాజాలోని అల్-ఫఖురా పాఠశాలపై జరిగిన దాడిలో కనీసం 50 మంది మరణించారు. ఇది యుద్ధం ప్రారంభమైనప్పుడు శరణార్థుల కేంద్రంగా మార్చబడిన పాఠశాల. శనివారం తెల్లవారుజామున ఈ దాడి జరిగింది. అదే సమయంలో, ఇజ్రాయెల్ సైన్యం స్వాధీనం చేసుకున్న అల్ షిఫా ...7లో

పౌరుల కోసం ఆటలు

మొబైల్, వెబ్ ఆధారిత గేమ్స్‌కు కేంద్రం యోచన

- ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆహ్వానం
- జాతీయభావం, కేంద్ర పథకాలు, కార్యక్రమాలే అంశాలు
- ఇదంతా రాజకీయ ప్రయోజనం కోసమే : విశ్లేషకులు





న్యూఢిల్లీ : పౌరుల కోసం కొత్త రకమైన మొబైల్, వెబ్ ఆధారిత గేమ్‌లను తీసుకురావటానికి కేంద్రం యోచిస్తున్నది. పౌరుల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడా నికీ, ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి, సమస్య-పరిష్కార, నిర్ణయం తీసుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయటం కోసం ఈ ప్రయత్నమని కేంద్రం చెప్తున్నది. ఈ మేరకు జాతీయభావం, కేంద్ర ప్రభుత్వ, కార్యక్రమాలను స్ఫురించేలా ...7లో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జాతీయత అనే భావోద్వేగ, సున్నితమైన అంశాన్ని మోడీ సర్కారు మరో విధంగా ఉపయోగించుకోవాలనుకుంటున్నదనీ, అందుకే ఈ వేదికను ఉపయోగించుకుంటున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. "ఇలాంటి గేమ్స్ స్వీయ-ప్రేరేపిత వ్యవస్థలు. గత కొన్ని సంవత్సరాలుగా, గేమ్ డిజైనర్లు భావోద్వేగాలను సష్టించేందుకు, వాటి ద్వారా లాభాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాంటి మార్గాన్ని కేంద్రం అనుసరించాలనుకుంటున్నది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఇలాంటి మొబైల్, వెబ్ ఆధారిత గేమ్స్‌ను తీసుకురావాలనుకుంటున్నది. ప్రజలు ఈ విషయంలో జాగరూకతతో వ్యవహరించాలి" అని విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

2019లో సార్వత్రిక ఎన్నికలకు ముందు చోటు చేసుకున్న 'పుల్వామా ఉగ్రదాడి' అంశాన్ని మోడీ సర్కారు రాజకీయంగా ఉపయోగించుకొని ఎన్నికల్లో లబ్ది పొందిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అదే దారిలో ఈ వీడియోగేమ్స్ ద్వారా ప్రయోజనం పొందాలన మోడీ సర్కారు యోచిస్తున్నదనీ, ఈ విషయం పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు.

నిలిచిన సొరంగం పనులు

ఉత్తరకాశీలో ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్న అధికారులు

- సొరంగం పైనుంచి నిలువుగా డ్రిల్లింగ్ చేయాలని నిర్ణయం
- బతుకు మీద ఆశలు వదులుకుంటున్న కార్మికులు

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో కుప్పకూలిన సిల్క్యారా సొరంగంలో చిక్కుబడిపోయిన వారిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఓ కొలిక్కి రావడం లేదు. అమెరికాకు చెందిన ఆగర్ డ్రిల్లింగ్ యంత్రం శుక్రవారం ఐదో పైపును అమరుస్తున్న సమయంలో భారీ పగుళ్లు ఏర్పడ్డాయి. పెద్ద శబ్దం కూడా విన్పించింది. యంత్రం ప్రకంపనల కారణంగా సొరంగం పైభాగం నుండి శిథిలాలు పడి ఉంటాయన్న అనుమానంతో పనులు నిలిపేశారు. చివరికి కొండ పై భాగం నుండి కార్మికులు ఉన్న చోటుకు నిలువుగా డ్రిల్లింగ్ చేయాలని నిర్ణయించారు.

డెహ్రాడూన్ : ముందుగా కొండ పైభాగంలో రంధ్రాన్ని చేస్తారు. దాని ద్వారా బాధితులకు ఆహారం, ఇతర అవసరాలు పంపుతారు. ఆ తర్వాత మూడు అడుగుల రంధ్రం చేసి, కార్మికులను బయటికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తారు. అయితే కొండ పైకి డ్రిల్లింగ్ యంత్రాన్ని చేర్చడానికి కొంత సమయం పడుతుంది. అందుకోసం రోడ్డును నిర్మించాల్సి ఉంటుంది. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుండి బోయింగ్ రవాణా విమానం ద్వారా మరో డ్రిల్లింగ్ యంత్రాన్ని తీసుకొచ్చి, విడిభాగాలను కలిపే పనిలో ఉన్నారు. ప్రధాని కార్యాలయ అధికారులు, నిపుణులు సొరంగం వద్దనే ఉంటూ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

ఇక సొరంగంలో కార్మికులు చిక్కుకుపోయి 170 గంటలు దాటిపోయింది. డ్రిల్లింగ్ యంత్రం సరిగా పనిచేస్తే మరో రెండున్నర రోజుల్లో కార్మికులను చేరుకుంటామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంఘటనా స్థలం వద్ద చెప్పారు. లోపల ఉన్న వారికి ప్రమాదమేమీ లేదని ఓ అధికారి తెలిపారు. 'టన్నెల్‌లో కార్మికులు ఉన్న ప్రదేశంలో నీరు, విద్యుత్ ఉన్నాయి. నాలుగు అంగుళాల పైపు ద్వారా వారికి డ్రై ఫ్రూట్స్ అందిస్తున్నాం. కొన్ని మందులు...ముఖ్యంగా ఒత్తిడిని అధిగమించే మందులు పంపుతున్నాం' అని రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ చెప్పారు.

అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఫలించకపోవడంతో అటు సొరంగంలో చిక్కుకున్న కార్మికుల్లో, ఇటు వారి కోసం ఎదురు చూస్తున్న బంధువుల్లో ఆందోళన పెరిగిపోతోంది. సొరంగంలో చిక్కుబడిన కార్మికుడి సోదరుడు హరిద్వార్ శర్మ బీహార్ నుండి ఘటనా స్థలానికి వచ్చారు. కార్మికులు భయాందోళనలతో ఉన్నారని, ప్రభుత్వం మాత్రం వారిలో ఆశలు రేపుతోందని చెప్పారు. 'నేను నా సోదరుడితో పైపు ద్వారా మాట్లాడాను. కార్మికులు ఆశలు వదులుకుంటున్నారని ఆయన నాతో చెప్పారు. కార్మికులు సొరంగంలోనే మరణించకతప్పదని ప్రకటించాల్సిందిగా ప్రభుత్వ అధికారులకు చెప్పమన్నాడు. అసలు మేము బయటికి వస్తామా రామా అని నన్ను అడిగాడు. నేనేమీ చెప్పలేదు' అని అన్నారు. ప్రస్తుతానికి ఓ చిన్న పైపు ద్వారా కార్మికులకు ఆహారం పంపుతున్నామని, పెద్ద రంధ్రాన్ని చేసి పైపు ద్వారా మరింత ఆహారాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నామని సహాయ సిబ్బంది చెప్పారు.

సొరంగంలో ఉన్న కార్మికుల మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా క్షీణిస్తూ ఉండవచ్చునని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. లోపల ఉన్న వారి మాటలు చాలా బలహీనంగా, పేలవంగా ఉంటున్నాయని అక్కడికి చేరిన వారు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి నుండి సహాయక చర్యలేవీ జరగడం లేదని ఓ కార్మికుడి తండ్రి సుఖ్‌రామ్ తెలిపారు. 'నేను గురువారం రాత్రి నుండి ఇక్కడే ఉన్నాను. శుక్రవారం రాత్రి పది గంటలకు యంత్రాలన్నీ ఆగిపోయాయి. అప్పటి నుండి సహాయ సిబ్బంది ఖాళీగానే కూర్చున్నారు' అని ఆయన అన్నారు.





రహదారులు కావు...మృత్యు మార్గాలు

గత ఏడాది దేశంలో 4.61 లక్షల రోడ్డు ప్రమాదాలు

- ప్రాణాలు కోల్పోయిన 1.68 లక్షల మంది
- మితిమీరిన వేగమే ప్రధాన కారణం
- ద్విచక్ర వాహనదారులకే ఎక్కువ ప్రమాదాలు

న్యూఢిల్లీ:దేశంలోని రహదారులు ప్రాణాంతకంగా మారాయి. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. గత సంవత్సరం 4,61,312 రోడ్డు ప్రమాదాలు సంభవించాయని ఈ నెల ప్రారంభంలో రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు తెలియజేశాయి. అంటే ఈ సంఖ్య తొలిసారిగా కోవిడ్‌కు ముందున్న స్థాయికి చేరుకుంది. గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1,68,491 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో నాలుగో వంతు మంది 25-35 సంవత్సరాల మధ్య వయస్కులే. మితిమీరిన వేగమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం. ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదానికి గురవుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలతో పోలిస్తే మృతుల సంఖ్య మరింత అధికంగా ఉంటుందని అంచనా. ఎందుకంటే ప్రభుత్వానికి అందిన సమాచారం మేరకే ప్రమాదాలు, మృతుల సంఖ్యను లెక్కించారు. ప్రభుత్వానికి తెలియకుండా జరిగిన ప్రమాదాలు ఎన్నో ఉంటాయి. 2015తో పోలిస్తే దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య తక్కువగానే ఉంది. 2015లో ఐదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 2018-22 మధ్యకాలంలో 21.7 లక్షల రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. అంతకుముందు ఐదు సంవత్సరాల కాలంతో పోలిస్తే ప్రమాదాల సంఖ్య 11% తగ్గింది. వాహనాల్లో సామర్థ్యానికి మించి ఎక్కువ మంది ప్రయాణం చేయడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.



మోటారు వాహనాల చట్టానికి 2019లో సవరణలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధించారు. ఎందుకంటే నిబంధనల ఉల్లంఘన కారణంగానే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దేశంలోని రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలు, మరణాల్లో 70%కి పైగా ఉదంతాలకు మితిమీరిన వేగమే కారణమవుతోంది. రోడ్డు ప్రమాద మృతుల్లో మూడో వంతు మంది హెల్మెట్ ధరించడం లేదు. 2022లో జరిగిన ప్రమాదాల్లో చనిపోయిన వారిలో 45% మంది ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసిన వారే. పాదచారులను ఢీకొన్న ప్రమాదాల్లో 20% మంది ప్రాణాలు కోల్పోయారు. ద్విచక్ర వాహనం మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడం వల్ల జరిగిన ప్రమాదాల్లో 16.4% మంది చనిపోయారు.

గత సంవత్సరం గోవా, లఢక్, కేరళలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కోటి మంది కంటే అధిక జనాభా ఉన్న రాష్ట్రాలకు సంబంధించి బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో తక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ప్రపంచంలో జరిగిన ప్రమాదాల్లో చూస్తే మన దేశం పదో స్థానంలో ఉంది. వెనిజులియాలో ప్రతి లక్ష మంది జనాభాకు 39.4 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోగా ఇరాన్‌లో 17.4, దక్షిణాఫ్రికాలో 16.8 మంది ప్రాణాలు కోల్పోయారు.

జనం పక్షాన నిలిచే వారిని

గెలిపించండి

తారానగర్‌లో బృందా కరత్

రాజస్థాన్‌లో సీపీఐ(ఎం) అభ్యర్థుల ప్రచారం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అభ్యర్థుల గుణగణాలను పరిశీలించి. జనం పక్షాన నిలిచే అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ కోరారు.రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సీపీఐ(ఎం) అభ్యర్థుల ప్రచారం విస్తృతంగా జరుగుతుంది. చురు జిల్లాలోని తారానగర్ లో విజయవంతమైన బీమా క్లెయిమ్ కిసాన్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిర్మల్ కుమార్‌కు మద్దతుగా బృందా కరత్ ప్రచారం చేశారు. వివిధ సభల్లో పాల్గొని ప్రచారం చేశారు. నిర్మల్ కుమార్‌కు లభిస్తున్న బలమైన మద్దతును తగ్గించడానికి ఈ నియోజకవర్గంలో భారీగా డబ్బు ఖర్చు చేస్తూ ప్రయివేట్ బీమా కంపెనీ అనుకూల, కులతత్వ శక్తులు ముఠాగా ఉన్నాయని విమర్శించారు. బహిరంగ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

వట్టే జానయ్య యాదవ్‌పై

బీఆర్ఎస్ నాయకులు దాడి

- తృటిలో తప్పిన ప్రమాదం
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపణ
- గట్టికల్‌లో ఉద్రిక్తత

నవ తెలంగాణ-సూర్యాపేట.

సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు యస్ మండలం గట్టికల్లు గ్రామంలో ఆదివారం రాత్రి బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్‌పై దాడి జరిగింది. ఎన్నికల ప్రచారం చేస్తుండగా ప్రత్యర్థులు దాడి చేశారు. దీంతో జానయ్య తృటిలో తప్పించుకోగా ఆయన అనుచరుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.



సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి అదుపు తప్పకుండా చూశారు. బీఆర్ఎస్ నాయకులు గొడ్డళ్ల, కత్తులతో దాడి చేసినా వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని జానయ్య ఆరోపించారు. దీనిపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

వాహనం వేగంగా నడిపాడనీ..

దళిత యువకులపై దూషణ

- బాధితుడి ఛాతిపై అంబేద్కర్ పచ్చబొట్టు చూసి ఆగ్రహం
- బీరు సీసాలు, రాళ్లతో దాడి చేసిన నిందితులు

తమిళనాడులోని వేలూరులో ఘటన


చెన్నై : తమిళనాడులోని వేలూరు జిల్లాలో ఇద్దరు ఎస్సీ వ్యక్తులపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 14న సతుమదురై రైల్వే గేటు దగ్గర ద్విచక్రవాహనాన్ని వేగవంతం చేయడంతో కనియంబాడికి చెందిన తులసీరామన్ కుమారుడు దివాకర్ (26)ను ఇద్దరు వ్యక్తులు అసభ్యపదజాలంతో దూషించారు. వారిని అనుసరించిన దివాకర్ మాటల దూషణపై వివరణ కోరారు. దీంతో దూషించిన వ్యక్తులు దివాకర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆ ఇద్దరు వ్యక్తులు మరో ఇద్దరు మిత్రులతో కలిసి దివాకర్‌పై దాడి చేశారు. దీంతో దివాకర్ తలకు గాయాలయ్యాయి. గొడవను చూసిన దివాకర్ ఇంటి దగ్గరి వ్యక్తి శరవణన్ అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. అయితే ఆయనపై కూడా బీరు సీసాలు, రాళ్లతో దాడి చేశారు. దాడిలో శరవణన్ బట్టలు చిరిగిపోయాయి. అతని ఛాతీపై అంబేద్కర్ పచ్చబొట్టు కనిపించింది. అది చూసిన నిందితుడు.. శరవణన్ ఎస్సీ వర్గానికి చెందినవాడని గ్రహించి ఆగ్రహంతో ఆయనపై, దివాకర్‌పై తీవ్రంగా దాడి చేశారు.



శరవణన్ స్పృహ కోల్పోవడంతో నలుగురు దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. చుట్టుపక్కల ప్రజలు బాధితులిద్దరినీ వేలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాధితులు పోలీస్ స్టేషన్‌లో నలుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

శరవణన్ తలకు 13 కుట్లు పడ్డాయి. ఆయన మాట్లాడుతూ.. "నా ఛాతీపై పచ్చబొట్టును గమనించి వారు నాపై తీవ్రంగా దాడి చేశారు. వారు మమ్మల్ని కులం పేరుతో తిట్టారు. నాలాంటి వారిపై దాడి చేయడం సమంజసమని అన్నారు. నేను ఇప్పుడు నడవలేకపోతున్నాను. దివాకర్‌కి ఏడు కుట్లు పడ్డాయి" అని తెలిపారు. ఈ ఘటనపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. నిందితులను ఆకాష్, విజయ్, సతీష్‌కుమార్, తమిళ్‌సెల్వన్‌గా పోలీసులు గుర్తించారు. తమిళ్‌సెల్వన్ కోసం గాలిస్తున్నామనీ, ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.





రాజస్థాన్‌లో అణగారిన కులాలపై దాడులు ఆందోళనకరంగా మారుతున్నాయి. పెత్తందారీ కులాల దూషణలు, దాడులు వారిని బాధితులుగా మిగిలిస్తున్నాయి. దీంతో అత్యంత దారుణమైన పరిస్థితుల్లో అణగారిన వర్గాల వారు జీవించాల్సిన పరిస్థితులు రాజస్థాన్‌లో ఉన్నాయి. ఇక్కడ కుల నేరాలకు సంబంధించిన దాడులు గత ఐదేండ్లలో 56 వేలకు పైగానే నమోదయ్యాయి. అక్కడి యంత్రాంగాలు, ప్రభుత్వాలు సైతం ఆశించిన రీతిలో పని చేయటం లేదు. దీంతో కుల నేరాలకు సంబంధించిన ఆరోపణలు తగ్గిపోతున్నాయి. నాసిరకమైన నివేదికలు బాధితులను తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. నేరస్థులకు ఇవి మద్దతుగా నిలుస్తున్నాయని సామాజికవేత్తలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న కుల నేరాలు

• ఐదేండ్లలో 56 వేలకు పైగానే.. • తగ్గుతున్న నేరారోపణలు

నామ్‌కే వాస్తే గా నివేదికలు

- రాజస్థాన్‌లో ఇదీ పరిస్థితి
- దళిత, ఆదివాసీ సంఘాల ఆందోళన

జైపూర్ : గతేడాది ఆగస్టు 13న రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాలోని సైలా తహసీల్‌లోని సురానా గ్రామంలో తొమ్మిదేళ్ల దళిత బాలుడు చనిపోయాడు. నీటి కుండను తాకడంతో ఇంద్ర మేఘ్వాల్ అతని పాఠశాల ఉపాధ్యాయుడు అతనిపై దాడికి పాల్పడ్డాడని అతని కుటుంబం తెలిపింది.

ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలకు దారి తీసింది. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చింది. దిగ్భ్రాంతి, ఆగ్రహావేశాలు, నిరసనలు, ప్రదర్శనలు జరిగాయి. దీంతో ఉపాధ్యాయుడి అరెస్టు జరిగింది.

రాజస్థాన్ పోలీసుల డేటా ప్రకారం.. 2017 నుంచి 2023 మధ్య 56,879 కేసులు ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీల నిరోధక) చట్టం కింద నమోదయ్యాయి. దళితులు, ఆదివాసీలపై జరిగిన నేరాలు 2018 నుంచి2022 వరకు సగటున 22 శాతం పెరిగాయి. 2020లో 27.49 శాతంగా ఉండగా.. 2022లో నేరారోపణలు 22.38 శాతంగా ఉన్నాయి. 56,879 కుల నేరాల కేసుల్లో పోలీసులు 26,801 కేసుల్లో మాత్రమే తుది నివేదికలు నమోదు చేశారు. అంటే ఇది దాదాపు 47 శాతంతో సమానం. కేవలం 25,762 కేసుల్లో కోర్టులకు చార్జిషీట్లు సమర్పించటం గమనార్హం. అయితే, ఈ కేసులు అధికారిక సమాచారం కంటే ఎక్కువగా ఉంటాయనీ, ఎందుకంటే అనేక కేసులు కూడా నివేదించడవని సామాజికవేత్తలు, మేధావులు తెలిపారు.

రాష్ట్రంలోని దళితులు, ఆదివాసీలపై దాడులు క్రమంగా పెరగటంపై దళిత, గిరిజన సంఘాలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా.. తమకు భద్రత కల్పించే అంశం అనేది ప్రశ్నార్థకంగా మారిందని వారు అంటున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 36 ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. జూన్ 2023 నాటికి ఈ కోర్టుల ముందు 20,492 కేసులు జాబితాలో (ఇందు కొన్ని విచారణలో) ఉన్నాయి. వీటిలో 16,020 ఎస్సీలు, 4,472 ఎస్టీలకు సంబంధించినవి కావటం గమనార్హం.

ఈ కోర్టులలో 2020లో 27.49 శాతం, 2021లో 22.26 శాతం, 2022లో 22.38 శాతంగా ఉన్నాయి. బరన్, సవాయి మాధోపూర్, జోధ్‌పూర్, జైపూర్, సికర్, రాజ్‌సమంద్, చిత్తోర్‌ఘర్, చురు, జలోర్‌లలోని న్యాయస్థానాలలో సాధారణ రాష్ట్ర న్యాయవాదులు ఉన్నారు. ఇతర 27 కోర్టులు రాష్ట్ర న్యాయ శాఖ నుంచి నామినేట్ చేయబడిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను కలిగి ఉన్నాయి.

రాజస్థాన్‌లో 2015లో ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశించినప్పటికీ.. 13 సంవత్సరాలలో మొదటిసారిగా 2023 ఆగస్టులో సీఎం అశోక్ గెహ్లాట్ నేతృత్వంలో కమిటీ సమావేశం జరిగింది. మరోపక్క, జిల్లా,బ్లాక్ స్థాయి కమిటీలు నిష్క్రియంగా ఉండటం గమనార్హం. జాలోర్‌లోని దళిత సామాజిక కార్యకర్త భగవానా రామ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కువ ఉద్యోగాలు పర్యాటకం, మైనింగ్‌పై ఆధారపడి ఉన్నాయని అన్నారు. "సాంప్రదాయ వృత్తులు సామాజిక సమీకరణాల ద్వారా కఠినంగా ఉంటాయి. రాజస్థాన్ కూడా తక్కువ మెట్రోపాలిటన్ ప్రాంతాలను కలిగి ఉండి, అధిక రవాణా ఖర్చులను కలిగి ఉన్నది. దీని వలన ప్రజలు తమ సాంప్రదాయ గృహాలను వదిలి వెళ్ళడం కష్టం" అని అన్నారు.

మోడీ హామీల వెనుక !

నిన్న ఉచిత రేషన్ పొడిగింపు

- నేడు సబ్సిడీపై పప్పు, గోధుమ పిండి విక్రయాలు
- నెల రోజుల్లో రెండుసార్లు గ్యాస్ సబ్సిడీ పెంపు
- ఉపాధి పనులకు అత్యవసర కేటాయింపులు





న్యూఢిల్లీ : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోడీ నోటి వెంట అనేక హామీలు విన్పిస్తున్నాయి. ఆయన భాషలో చెప్పాలంటే అవి 'మోడీ గ్యారంటీలు'. ఇటీవల మోడీ ప్రకటించిన ఉచిత రేషన్ పథకం పొడిగింపు అందులో ఒకటి. ప్రస్తుతం దేశంలోని 80 కోట్ల మంది పేదలకు వర్తింపజేస్తున్న పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకాన్ని మరో ఐదు సంవత్సరాల పాటు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. దేశంలో 80 కోట్ల మంది ప్రజలు ఇంకా ఆకలితో అలమటిస్తున్నారని పరోక్షంగా అంగీకరించడం ద్వారా ఆయన ఆర్థిక వ్యవస్థ బలహీనతను ఒప్పుకున్నారు. ప్రధాని ప్రకటన ఇంకా క్యాబినెట్ ఆమోదం పొందలేదన్నది వేరే విషయం.

గత కొన్ని నెలలుగా మోడీ ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలను ప్రకటించేస్తోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ఇదంతా చేస్తోందని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకాన్ని కొనసాగిస్తామని అంటున్న మోడీ, జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఇస్తున్న రేషన్‌ను నిలిపివేస్తారా లేక దానికి రేటు వసూలు చేస్తారా అన్నది చెప్పడం లేదు. వాస్తవానికి ఈ ఏడాది జనవరి 1న ప్రారంభించిన ఈ పథకం గడువు డిసెంబర్‌తో ముగుస్తుంది. ఇప్పుడు దీనిని మరో ఐదు సంవత్సరాలు పొడిగించారు. ఇదిలావుంటే మోడీ ఇటీవల మరో పథకాన్ని ప్రకటించారు. అదే భారత్ దాల్, భారత్ ఆటా. ఈ పేరుతో ప్రభుత్వం పప్పు, గోధుమ పిండిని ప్రజలకు సబ్సిడీ రేటుకు విక్రయిస్తుంది.

వ్యాపారం చేయడం ప్రభుత్వం పని కాదని మోడీ స్పష్టంగా చెబుతారు. మరి ఇప్పుడు చేస్తోంది ఏమిటి? పప్పులు, గోధుమ పిండి వంటి ఆహార వస్తువుల్ని అమ్మడం వ్యాపారం కాదా? వీటిని కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత పేదలకు ఉంటుందా అన్నదే ఇక్కడ ప్రశ్న. అయినప్పటికీ ప్రభుత్వం ఇదేమీ ఆలోచించడం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఓట్లను రాబట్టేందుకు ఏదో ఒకటి చేయాలి. అంతే... ప్రభుత్వం ఇంతటితో ఆగలేదు. కేవలం నెల రోజుల వ్యవధిలో ఎల్‌పీజీ సబ్సిడీని రెండుసార్లు పెంచింది. తొలుత సిలిండర్‌కు రూ.200 సబ్సిడీ పెంచింది. పీఎం ఉజ్వల యోజన పథకం కింద లబ్ది పొందుతున్న పేద కుటుంబాలే కాకుండా వినియోగదారులందరికీ దీనిని వర్తింపజేశారు. ఆ తర్వాత అక్టోబరులో పథకం లబ్దిదారులకు మరో వంద రూపాయల సబ్సిడీ పెంచారు. ఎరువుల సబ్సిడీపై అయ్యే వ్యయం పెరుగుతోందని ప్రభుత్వం మేలో ప్రకటించింది. 2023-24 బడ్జెట్ కేటాయింపు కంటే ఈ వ్యయం 30% పెరిగిందని తెలిపింది. మరోవైపు గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులకు డిమాండ్ పెరగడంతో ప్రభుత్వం ఈ పథకానికి అత్యవసరంగా పది వేల కోట్ల రూపాయలు కేటాయించింది. బలహీనంగా ఉన్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇదో ఉదాహరణ.

మోడీ ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకాలు, కార్యక్రమాలు, రాయితీలు ప్రజలకు ఉపయోగపడేవే అయినప్పటికీ దీని వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను గమనించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు, వచ్చే సంవత్సరం ప్రథమార్థంలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందేందుకే ప్రజలపై హామీల వరద పారిస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానించారు.

తమ్మినేనిని అసెంబ్లీకి పంపించండి..



- దేశంలో కేరళ తరహా పాలన అందిస్తాం : తెల్దారుపల్లి సభలో విజయరాఘవన్

నవతెలంగాణ-ఖమ్మం రూరల్


భవిష్యత్తు కమ్యూనిస్టులదేనని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్ అన్నారు. పాలేరు సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడు, పొన్నెకల్లు, మద్దులపల్లి, తెల్దారుపల్లి గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్దారుపల్లి గ్రామ ప్రజలు తమ్మినేనికి భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. తమ్మినేని వెంకట్రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో విజయ రాఘవన్ మాట్లాడుతూ.. తెల్దారుపల్లిని చూస్తుంటే నాకు మరో కేరళను చూస్తున్నట్టు ఉందన్నారు. దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీకి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనని తెలిపారు. నిజాయితీపరుడైన తమ్మినేనిని గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ప్రజలను కోరారు. గతంలో తమ్మినేని, తాను పార్లమెంట్‌లో పని చేశామని, పార్లమెంట్‌లో అతని వాక్చాతుర్యానికి చాలామంది మంత్రముగ్దులయ్యారని తెలిపారు. తాము అధికారంలో కొస్తే కేరళ మోడల్‌ను దేశమంతా అమలు చేస్తామన్నారు. సీపీఐ(ఎం) నాయకులు అసెంబ్లీలో, పార్లమెంట్‌లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని మలయాళంలో హర్షధ్వానాల మధ్య తెలిపారు.సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని మాట్లాడుతూ.. తెలంగాణ కమ్యూనిస్టుల కంచుకోట అని, అలాంటి రాష్ట్ర అసెంబ్లీలో కమ్యూనిస్టు అభ్యర్థులు ఉండాల్సి అవసరం ఎంతో ఉందన్నారు. తెల్దారుపల్లి గ్రామం రజాకారులను తరిమికొట్టిన గడ్డని, అటువంటి గడ్డలో మరో పార్టీకి అవకాశం ఇవ్వొద్దని ప్రజలంతా సోదరభావంతో మెలగాలని, చిన్నచిన్న లోపాలు ఉంటే సరి చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. మహాజన పాదయాత్ర పేరుతో 4200 కిలోమీటర్లు రాష్ట్రం మొత్తం తిరిగి చరిత్ర సృష్టించినట్టు గుర్తుచేశారు. సీపీఐ(ఎం)కి కొంతకాలంగా దూరంగా ఉంటున్న వ్యక్తులు మడిపల్లి వెంకన్న, పగిడిపల్లి ఉపేందర్, చాట్ల రాము, పాము వెంకన్న, పాము బాబు, టేకుమట్ల సీతమ్మ, గజ్జి భారతమ్మ పలువురు తమ్మినేని సమక్షంలో ఎర్రజెండా కప్పుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు యం.సాయిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో

హైదరాబాద్‌ను మరింత సురక్షితంగా మారుస్తాం : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మరోసారి రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేననీ, వచ్చే ఐదేండ్లలో మహిళల కోసం ఏం చేస్తామనే అంశాలతో డిసెంబర్‌లో ప్రత్యేక మ్యానిఫెస్టో విడుదల చేస్తామని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. మహిళలు హైదరాబాద్‌ను సురక్షిత నగరంగా భావిస్తున్నారనీ, ఈ నగరాన్ని మరింత సురక్షితంగా మార్చేందుకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ ఫార్వర్డ్ తెలంగాణలో భాగంగా ఉమెన్ ఆస్క్ కేటీఆర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.



ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. మహిళల కోసం ప్రత్యేక నాలుగు ఇండస్ట్రియల్ పార్కులు తెచ్చామని గుర్తుచేశారు. తన జీవితంలో సానియా మీర్జా, సైనా వంటి ఎంతో మంది శక్తివంతులైన మహిళలను చూశానన్నారు. ఉమ్మడి కుటుంబాల్లో మహిళల పాత్ర కీలకమనీ, తాను ఉమ్మడి కుటుంబంలో పెరిగినట్టు చెప్పారు. మహిళల కోసం వడ్డీ లేని రుణాలు, ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కులు, వి-హబ్‌తో పాటు మ్యానిఫెస్టోలో లేకున్నా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను ప్రత్యేకంగా మహిళల కోసం ప్రారంభించినట్టు కేటీఆర్ వివరించారు. ప్రత్యేక సౌకర్యాల కల్పనతో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసూతీలు పెరిగాయనీ, మైనార్టీ బాలికలను విద్యలో ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి చిన్నారిపై రూ.10 వేలకు పైగా ఖర్చు చేస్తున్నామన్నారు.



భగీరథ ఉద్యమం

- ఒక్కో జిల్లాకు ఒక్కో విధానంపై ప్రశ్నించిన యూనియన్
- భారీగా కదిలిన కార్మికులు
- దిగొచ్చిన సర్కారు, కంపెనీలు
- 17 వేల మందికి ప్రయోజనం

పోరాటవిజయాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మిషన్ భగీరథ..బీఆర్ఎస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు. రూ.45 వేల కోట్ల ఈ ప్రాజెక్టు ద్వారా ఊరూరా పైపులైన్, ఇంటింటికి తాగునీరు అందించడం దీని లక్ష్యం. ఇదంతా ఒక పార్శ్వం. మరోపార్శ్వం అందులో పనిచేస్తున్న కార్మికుల బతుకులు అవి దుర్భరం. జిల్లాకో విధానం, కంపెనీకో రూల్ అంటూ ఇష్టా రాజ్యంగా సాగింది. కనీస వేతనాలు కరువ య్యాయి. వేతనాల పెంపు కోసం నెలలతర బడి ఆందోళన చేయాల్సి వచ్చింది. ఇందుకు సీఐటీయూ ఆధ్వర్యంలోని 'తెలంగాణ మిషన్ భగీరథ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్' భగీరథ ప్రయత్నమే చేసింది. ఈ పోరాటం సాధించిన విజయం ద్వారా ద్వారా 17 వేల మందికి ప్రయోజనం కలి గింది. పెరిగిన వేతనం కొంచమే అయినా ఐక్య పోరాటంతోనే ఈ వేతనాల పెంపు సాధ్యమైంది.

2016లో...

2016 ఆగస్టులో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 26 సెగ్మెంట్లల్లో ప్రధాన పనులు, ఇంట్రా నెట్‌వర్క్ పనులు చేపట్టింది. ఇన్‌టేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంట్లు (డబ్ల్యూటీపీ) ఓహెచ్‌బీఆర్‌లు,జీఎల్‌బీఆర్‌లు మెయిన్ పైపులైనింగ్ తదితర నిర్మాణాలు చేసింది. ప్రధాన పనులన్నీ పెద్దపెద్ద కంపెనీలకు గ్లోబల్ టెండర్ల ద్వారా ఇచ్చింది. ఇంట్రా నెట్‌వర్క్ పనులను బీఆర్ఎస్ కార్యకర్తలు, ఆర్థికంగా పెట్టుబడి పెట్టగలిగిన వారికి కట్టబెట్టింది. దీంతో ఒక్కో జిల్లాలో ఒక్కో కంపెనీ పనులు చేపట్టింది.

రిక్రూట్‌మెంట్

ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే ఆయా పనుల కోసం అవసరమైన సాంకేతిక నిపుణులు, సాధారణ కార్మికులను నేరుగా ప్రభుత్వం ద్వారా కాకుండా కంపెనీల ద్వారా నియమించారు. సాధారణంగా ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులతో పనులు చేయిస్తుంది. ఈసారీ అలా కాకుండా పనులు దక్కించుకున్న కంపెనీలకే ఆ బాధ్యతను అప్పగించింది. తద్వారా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసింది. దీంతో ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్న పంపు అపరేటర్లు, లైన్‌మెన్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ తదితర కార్మికులకు అన్యాయం జరిగింది. సంవత్సరాల తరబడి వేతనాల పెంపు జరగలేదు.

అందుకే సంఘం

భగీరథ ప్రాజెక్టులో చేసే ఆయా పనులకు వేలాది మంది అవసరమయ్యారు. ఆమేరకు ఆయా కంపెనీలు వీరిని సమకూర్చుకుని పనులు చేయించుకున్నారు. నేరుగా కార్మికు లకే వేతనాలు ఇవ్వాల్సి ఉండగా, అలా కాకు ండా ప్రభుత్వం కంపెనీలకే చెల్లించింది. ప్రభుత్వం ఒక్కో కార్మికునికి ఆయా కంపె నీలకు రూ.18,400 చెల్లిస్తే, సదరు కంపెనీ లు ఆయా కార్మికులకు రూ. 9 నుంచి 10 వేలు మాత్రమే ఇచ్చాయి. దాదాపు 50 శాతం వేతనం కంపెనీల చేతుల్లోనే ఉండిపోయింది. 2022లో జారీ చేసిన జీవో 11 ప్రకారం వేత నాల చెల్లింపులు చేయలేదు. సర్కారు కనీస వేతనాల అమలును నిర్లక్ష్యం చేసింది. తెలంగాణ భగీరథ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకత్వంలో కార్మికులు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.



ఉద్యమం..ఇద్దరి బలిదానం

సర్కారు, కంపెనీ విధానం మూలంగా నష్టపోయిన కార్మికులు సీఐటీయూ ఆధ్వ ర్యంలోని మిషన్ భగీరథ ఎంప్లాయిఎస్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు రోడ ెక్కారు. ఒకే రకమైన వేతన పద్ధతిని నిరసించారు. ఒక్కో కంపెనీ ఒక్కో రకంగా ఇవ్వడాన్ని తప్పుబట్టారు. కనీసం వేతనం రూ.26 వేలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, సెలవులను చట ్రప్రకారం ఇవ్వాలని పోరాటం ద్వారా పట్టుబట్టారు. జిల్లాల వారీగా ధర్నాలకు దిగారు. రిలే నిరాహార దీక్షలకు పూను కున్నారు. పలు ఆందో ళన కార్యక్రమాలు నెల ల తరబడి చేశారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, మెదక్, సంగారెడ్డి తదితర జిల్లాల్లో భారీ పోరాటాలే జరిగాయి. నెలల తరబడి ఆందో ళనలు కొనసాగాయి. ఈ పో రాటంలో నల్ల గొండ, వనపర్తి జిల్లాల్లో ఇద్దరు కార్మికులు బల య్యారు. ఇందులో ఒక మహిళ కూడా ఉండటం గమనార్హం. ఈనేపథ్యంలో ప్రభుత్వంతోపాటు ప్రయివేటు కంపెనీల్లో కదలిక వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులందరికీ రూ 500 నుంచి రూ. 1500 వేతనాలు పెంచి ంది. సీఐటీయూ నేతృ త్వరలో మిషన్ భగీరథ ఎంప్లాయిస్, వర్కర్ల సాధించిన విజయమిది

పోరాటాల ఫలితమే వేతనాల పెంపు

మిషన్ భగీరథ ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం రూ. 500 నుంచి రూ. 1500 వేతనాలు పెంచింది. నల్లగొండలో నెల రోజులు, సంగారెడ్డిలో రెండు వారాలు, మహబూబ్‌నగర్‌లో 12 రోజులు ఆందోళన నడిచింది. దీంతో సర్కారు, కంపెనీలు దిగొచ్చాయి. కానీ పెంపు సరిపోదు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి. చట్టం ప్రకారం చెల్లించాలి. విధుల నిర్వహణలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. వారికి రక్షణ చర్యలు ఉండాలి.

వంగూరి రాములు
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ మిషన్ భగీరథ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్

కార్నర్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్!



నడవాలి కదా
నడక ఆగేదాక అన్నట్లు
పొద్దు గూకే వేళలో
అపారమైన అనుభవ పాదాలు
పార్కులను వెతుక్కుంటూ వస్తాయి!
బుడి బుడి అడుగులతో
అనేక పాదాలు ఒక మూల సమావేశమవుతాయి
వన్నె తరగని ముచ్చట్లను విప్పుతాయి
మణికొండ మహాత్మ గాంధీ పార్కులో
ఏ తారతమ్యం లేని తరమొకటి రోజు
ఆ మూలలో జ్ఞాపకాలను ఆరబోసుకుంటది!
మసక మసక వెలుతుర్లో
అందరి కళ్ల గోళీ కాయల్లా మెరుస్తుంటాయి!
ఆ పాదలను చూడలంటే నాకు భయమేస్తది
మట్టిని చీల్చుకుని ఎదిగిన
మొక్కల్లాంటి పాదాలు
ధైర్యం కూడదీసుకుని నడిచొచ్చినట్లుంటాయి
తిండి తిప్పలకు కొదవ లేదు కాని
పూట గడవడమే అగ్ని పరీక్ష
రెండు గుడ్డి దీపాలు విశాలమైన ఇల్లంతా
వెలుతురు పంచలేని తండ్లాట
పిల్లలు సప్త సముద్రాల ఆవల
రాజ్యమేలుతున్నారనే భ్రమ
బతకనిస్తున్నట్లుంటది!
అనుభవించిన హోదాలు అనుభవాలు
కాసేపు మారిన కాల పరిస్థితులు రాజకీయాలు
దేశం ఏమైపోతుందోనన్న
అమాయకపు దిగులు..
పొద్దు గూకంగానే ఇంటి దీపాలు గుర్తొస్తాయి
సమూహాలన్నీ చేతులూపుకుంటూ
తలో వైపు రేపు కలుద్దామన్నట్లు
జేబులో మందుల చీటీని
తడుముకుంటూకదలిపోతాయి
నిత్యం గమనిస్తున్న ఆ పార్కూ నేనూ
రేపటి సాయంత్రం కోసం
ఆ అనుభవ పాదాల దర్శనం కోసం
ఎదురు చూస్తూనే ఉంటాం!!

– కోట్ల వెంకటేశ్వర రెడ్డి,
9440233261

భావి పరిశోధకులకు మార్గదర్శి 'సారాంశం'

> "పరిశోధన ఒక జాతి అభివృద్ధి పరిణామానికి, వికాస దశకు సూచిక. వ్యక్తి, సమూహం, సమాజం, తరం తమ మూలాల వైపు, పరంపర వైపు దృష్టిసారించి వెలికి తీసేది పరిశోధన"
>
> – డా. నందిని సిధారెడ్డి


దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల తెలుగుశాఖల నుంచి ప్రతి సంవత్సరం కొన్ని వందల పిహెచ్.డి. థీసిస్‌లు రాయబడి అవార్డు పొందుతున్నాయి. వాటిలో ఎన్ని నాణ్యమైనవి, ఎన్ని కాలానికి నిలిచేవి, ఎన్ని భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవి, ఎన్ని సమాజాన్ని మార్చేవి అనేది కాలమే నిర్ణయించాలి. ఏదో ఒక విషయికంగా ఎక్కువ సమాచారాన్ని ప్రోది చేసుకున్నవి, ఉత్తమ పరిశోధనా ప్రమాణాలను పాటించినవి, ప్రజల జీవితాలను ప్రభావితం చేసేవి పాఠకుల చేత, పరిశోధకుల చేత, పర్యవేక్షకుల చేత, విమర్శకుల చేత ఉత్తమ పరిశోధనా గ్రంథాలుగా గుర్తింపు పొందుతున్నాయి. వాటిని మాత్రమే విభిన్న పాఠకులు పదేపదే చదువుతున్నారు. సంప్రదిస్తున్నారు. రానురాను పరిశోధనా నాణ్యతా ప్రమాణాలు పడిపోతున్న సందర్భంలో, సోమరి పరిశోధకులే ఎక్కువున్న కాలంలో కొన్ని వందల పుటల పరిశోధనా గ్రంథాలను తెరిచి చదివేవారు చాలా తక్కువ. నిజానికి ఒక వ్యాసం రాయాలంటే మన ముందు తరాల వాళ్లు రాసిన వ్యాసాలు కనీసం వంద చదవాలి. అలాగే ఒక పరిశోధన చేయాలంటే ఉత్తమ పరిశోధనా గ్రంథాలనదగ్గవి కనీసం వంద థీసిస్‌లను సంప్రదించాలి. అప్పుడే ఒక సిద్ధాంత వ్యాసాన్ని రాసే భాషాపాటవం, శైలీశిల్పాలు, పరిశోధనా విధానం, సిద్ధాంత ప్రతిపాదన, అనుసరించాల్సిన మెథాడాలజీతో పాటు ఎన్నో సూక్ష్మ విషయాలు బోధపడుతాయి. తద్వారా ఒక ఉత్తమ పరిశోధనా గ్రంథం రూపొందుతుంది. కానీ ఇదంతా పరిశోధకుడు పరిశోధన పట్ల సానుకూల దృక్పథం కలిగియున్నప్పుడు మాత్రమే సంభవించే విషయం. ఇప్పటి డిజిటల్ తరం, అన్నీ స్మార్ట్‌గా అయిపోవాలని ఉబలాటపడే నవీన పరిశోధకులలో అంత ఓపిక, నేర్చుకునే వైఖరి సన్నగిల్లుతుంది. అలాంటి వారి కోసమే డా. అట్టెం దత్తయ్య తెలుగులో ఇప్పటిదాకా వెలువడిన కొన్ని ఉత్తమ పరిశోధనా గ్రంథాల సారాంశాన్ని అందించాలనే తలంపుతో 'సారాంశం' పేర రెండు సంపుటాలు వెలువరించాడు. పూర్తి సిద్ధాంత వ్యాసాలను చదవలేని, అందుబాటులో లేని పాఠకులు కనీసం వాటి 'సారాంశం' అయినా తెలుసుకోవాలి అని చేసిందే ఈ ప్రయత్నం

ఈ 'సారాంశ' వ్యాసాలు చక్కని అమరికతో, ఏకరూపతతో వెలువడడానికి కారణం సంపాదకుడు వ్యాసకర్తలకు కొన్ని విలువైన సూచనలు చేసి వాటిని అతిక్రమించకుండా రాయించడమేనని చెప్పాలి. ఈ రెండు సంపుటాలలో కలిపి 110 వ్యాసాలున్నాయి. ఇవన్నీ భావి పరిశోధకులకు ఎంతో కొంత పరిశోధనా ప్రణాళికా రచనలో మార్గదర్శనం చేసేవే కావడం గమనార్హం. వీటి ద్వారా నూతన పరిశోధకులు జ్ఞానాన్ని, చైతన్యాన్ని, కొత్త ఆలోచనా విధానాన్ని అలవర్చుకొని స్ఫూర్తి పొందుతారని భావించవచ్చు.

తెలుగు పరిశోధక విద్యార్థులు ఇవాళ చౌరస్తాలో నిలబడ్డారని చెప్పాలి. పరిశోధనకు ఏ విషయాన్ని ఎన్నుకోవాలో తెలియదు. ఇప్పటిదాకా ఏయే విషయాల మీద పరిశోధనలు జరిగాయో తెలియదు. (ఆచార్య వెలుదండ నిత్యానందరావు వెలువరించిన 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' 1930 -2013 వరకు జరిగిన పరిశోధనలను గురించిన సమాచారం ఇచ్చినప్పటికీ) సిద్ధాంత వ్యాస రచనకు నియమిత శైలీపత్రం ఇప్పటికీ లేదు. ఇలాంటి సంక్షోభ సందర్భంలో ఈ సారాంశ వ్యాసాలు పరిశోధక విద్యార్థులకు కొంత ఉపయోగపడుతాయని చెప్పవచ్చు. పరిశోధన అంశ ఎన్నికలో, అధ్యాయాల విభజనలో, పాటించాల్సిన ప్రామాణికతలో, సిద్ధాంత వ్యాస రచనా విధానంలో ఈ వ్యాసాలు కొత్త చూపును, ప్రేరణను ప్రసాదిస్తాయి.

తెలుగులో ఉత్తమ ప్రామాణిక పరిశోధన గ్రంథాలనదగ్గ వాటిని ఎన్నుకొని ఎంతో శ్రమించి ఈ వ్యాసాలను రాయించడం ద్వారా సంపాదకుడు ఆశించిన లక్ష్యం నెరవేరినట్లయింది. పరిశోధన గ్రంథాన్ని స్థాయి తగ్గకుండా ఎలా రాయాలో ఈ గ్రంథాలు తెలియజేస్తాయి.

వివిధ ప్రక్రియలపై మన పూర్వ పరిశోధకులు చేసిన గ్రంథాలపై ఇందులో విలువైన వ్యాసాలున్నాయి. ఇవి తదుపరి పరిశోధనలను ఎంతో ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయం 1968లో మహాభారత 'సంశోధిత ముద్రణ'ను వెలువరించి భారతం మీద విశిష్టమైన పరిశోధలను చేయించింది. ఆ వ్యాసాలు కూడా ఇందులో ఉన్నాయి. ఇక కావ్యాల మీద సాధికారికంగా చేసిన పరిశోధనలకు సంబంధించిన వ్యాసాలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం. రచయితల సాహిత్య మంచి చెడులను విడమరిచి చెప్పే విమర్శ గురించిన పరిశోధనల మీద రెండు వ్యాసాలున్నాయి. ఇవి విమర్శ ఆంతర్యాన్ని ఆవిష్కృతం చేశాయి. కవిత్వం లోతుపాతులను చర్చించిన 'ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు', 'తెలుగులో కవిత్వాదర్శాలు – పరిణామాలు', 'ఆధునిక తెలుగు కవిత్వం – వాస్తవికత, అధివాస్తవికత' అనే పరిశోధనల మీద రాయబడిన



వ్యాసాలు నమూనా వ్యాసాలనదగ్గవి. ఆయా కవుల సాహిత్య సేవను పరిశీలిస్తూ చేసిన పరిశోధనల మీద కూడా కొన్ని వ్యాసాలున్నాయి. అవి కూడా ఆయా కవుల సాహిత్యపు వెలుగును, అవి సమాజం మీద చూపిన ప్రభావాన్ని ఎత్తి చూపాయి. మానవుని తొలి వ్యక్తీకరణ అయిన పాట మీద కూడా కొన్ని ఎన్నిక చేసిన పరిశోధన గ్రంథాల మీద వ్యాసాలున్నాయి. ఇవి పాట గురించిన లోతైన అవగాహనను కల్పిస్తాయి. పాట మీద పరిశోధన చేయాలనుకునే విద్యార్థులకు ఇవి మార్గదర్శకాలు. భాష, ఛందస్సు, వ్యాకరణం, అలంకారం మీద కూడా వచ్చిన వేరువేరు పరిశోధనలను పరిచయం చేస్తూ రాసిన వ్యాసాలు ఎన్నో నూతన అంశాలను చెప్తున్నాయి. నవల, కవిసమయములు, పేరడీ, యాత్రా చరిత్రల పైన వచ్చిన పిహెచ్. డి. గ్రంథాలను పరిచయం చేయడం ద్వారా పాఠకులకు ఎన్నో కొత్త విషయాలు తెలియపరుస్తాయి.

ఈ నూటపది వ్యాసాలు తెలుగు సాహిత్య పరిశోధనా క్రమవికాసాన్ని, పరిశోధనలో అవలంభించాల్సిన రీతులను, కఠోర పరిశ్రమను తెలుపుతాయి. తద్వారా పాఠకులకు కొంత నూతన ఆలోచనా ధోరణి, విస్తృతి, పరిణతి కలుగుతాయి. ముఖ్యంగా ఇప్పటి పరిశోధక విద్యార్థులకు పరిశోధనాంశ ఎన్నికకు, ఉన్నత ప్రమాణాలతో సిద్ధాంత గ్రంథాన్ని ఎలా రూపొందించాలో, శాస్త్రీయ ప్రమాణాలకు కట్టుబడుతూ విషయ నిరూపణ ఎలా చేయాలో, ప్రతిపాదనలను ఎలా స్థిరీకరించాలో ఈ రెండు గ్రంథాలు బోధపరుస్తాయి. పరిశోధనపట్ల ఆసక్తి, సత్యశోధన, విషయ విశ్లేషణ, సప్రమాణ నిరూపణ ఈ నాలుగు గుణాలు ఉత్తమ పరిశోధనకు మరింత సారాన్ని అందిస్తాయి. శ్రద్ధ, సహనం, పరిశోధనా గ్రంథాన్ని ఉత్తమంగా రాసే సామర్థ్యం లేకపోతే పేలవమైన సిద్ధాంత గ్రంథమే బయటకు వస్తుంది. ఈ ప్రమాదాన్ని దాటడానికి ఉపయోగపడే ఉత్తమ వ్యాసాల సంకలనమే ఈ 'సారాంశం'.

తెలుగులో ఉత్తమ ప్రామాణిక పరిశోధన గ్రంథాలనదగ్గ వాటిని ఎన్నుకొని ఎంతో శ్రమించి ఈ వ్యాసాలను రాయించడం ద్వారా సంపాదకుడు ఆశించిన లక్ష్యం నెరవేరినట్లయింది. పరిశోధన గ్రంథాన్ని స్థాయి తగ్గకుండా ఎలా రాయాలో ఈ గ్రంథాలు తెలియజేస్తాయి. 'మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన' అయినట్లు కాలక్రమంలో పరిశోధకులు పెరిగిపోవడం వలన నీరసమైన, నాణ్యతలేని పరిశోధనా గ్రంథాలే ఎక్కువ వెలువడుతున్నాయి. పరిశోధన స్థాయిని మెరుగుపరుచుకోవడానికి, రాసే విధానం తెలుసుకోవడానికి ఈ వ్యాసాలు ఎంతో మేలు చేస్తాయి.

సాహిత్య కృషిలో ఎంతో లబ్ధప్రతిష్ఠులైన వారు, కీర్తిగడించిన వారు కూడా పరిశోధన రంగంలో రాణించలేకపోయారు. కారణం పరిశోధనకు ఆవేశం పనికిరాదు. సంయమనం, ఓర్పు, నేర్పులాంటి ఎన్నో ఉత్తమ గుణాలు కావాలి. లేకపోతే అంతా రసాభాస అయిపోయి మొదటికే మోసం వచ్చి పరిశోధన రంగం నుండి పూర్తిగా తప్పుకోవాల్సి వస్తుంది. అలా మధ్యలోనే పుట్టి మునిచి తప్పుకున్న పరిశోధకులు ఎంతో మంది ఉన్నారు. అలాంటి ప్రమాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, పరిశోధనలో మెలకువలను నేర్చుకోవడానిక ఈ వ్యాసాలు మార్గాన్ని చూపుతాయనడంలో అతిశయోక్తి లేదు. పరిశోధనలో ఇంకా ఖాళీలు ఎక్కడున్నాయో కనీస అవగాహన కలుగుతుంది. జరిగిన పరిశోధనలు ఎంత ఉత్తమంగా జరిగాయి, ఇప్పుడు ఇంకెంత ఉత్తమోత్తమంగా పరిశోధనలు రావాల్సి ఉన్నది అనే జ్ఞానం కలుగుతుంది. అరిగిపోయిన అంశాలు, ఒక పరిశోధనకు నఖలులాంటి పరిశోధనల నుంచి తప్పుకోవడానికి ఈ 'సారాంశం' ఉపయోగపడుతుంది.

కాలక్రమానుసారం మనకు తెలియకుండానే సమాజంలో, సాహిత్యంలో ఎంతో మార్పు వచ్చింది. వచ్చిన మార్పును ఎలా పట్టుకోవాలి. దాని ద్వారా సమాజం ఎంత ప్రభావితం అయిందని పరిశీలించడానికి, కొత్త అంశాలను ఎన్నుకోవడానికి సూక్ష్మంగా అర్థం చేసుకోవడానికి ఈ వ్యాసాలు దారి చూపిస్తాయి. నిత్యం ఎన్నో మార్పులకు గురవుతూ కదిలిపోతున్న సమాజాన్ని, సాహిత్యాన్ని అవలోకనం చేసుకొని నూతన పరిశోధనలు రావాలని ఈ వ్యాసాలు ఆకాంక్షిస్తాయి. ప్రపంచీకరణ తరువాత అన్ని రంగాలలో వేగం పెరిగిపోయింది. దానికి పరిశోధనా రంగం కూడా అతీతం కాదు. దీని వల్ల లోతైన పరిశీలన లేకుండానే ఎన్నో పరిశోధనా గ్రంథాలు రాయబడుతున్నాయి. అవార్డు పొందుతున్నాయి. ఈ ధోరణి మంచిది కాదని చెప్పడానికి చేసిన ప్రయత్నం ఇది. మన పూర్వ పరిశోధనలు ఎంత గొప్పగా, నాణ్యతగా ఉన్నాయో ఇప్పటి తరానికి తెలియజెప్పడానికి ఈ వ్యాసాలు ప్రయత్నించాయి. రాబోయే పరిశోధనలు మరింత సారవంతంగా ఉండాలనే సంపాదకుని తపన ఏ మాత్రం ఫలిస్తుందో కాలమే చెప్పాలి.

తెలుగు పరిశోధక విద్యార్థులు ఇవాళ చౌరస్తాలో నిలబడ్డారని చెప్పాలి. పరిశోధనకు ఏ విషయాన్ని ఎన్నుకోవాలో తెలియదు. ఇప్పటిదాకా ఏయే విషయాల మీద పరిశోధనలు జరిగాయో తెలియదు. (ఆచార్య వెలుదండ నిత్యానందరావు వెలువరించిన 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' 1930 -2013 వరకు జరిగిన పరిశోధనలను గురించిన సమాచారం ఇచ్చినప్పటికీ) సిద్ధాంత వ్యాస రచనకు నియమిత శైలీపత్రం ఇప్పటికీ లేదు. ఇలాంటి సంక్షోభ సందర్భంలో ఈ సారాంశ వ్యాసాలు పరిశోధక విద్యార్థులకు కొంత ఉపయోగపడుతాయని చెప్పవచ్చు.

అధ్యయనం లేకుండానే పరిశోధనా సౌధం మెట్లను ఎక్కడం సాధ్యం కాదని ఈ 'సారాంశం' గ్రంథాలు నిరూపించాయి. ఆయా వ్యాస రచయితలు సూచించిన సూచనలను పరిగణనలోకి తీసుకొని ముందుకు అడుగేస్తే దారి అదే దొరుకుతుందని తెలిపిన వ్యాసాలివి. ఈ రెండు గ్రంథాల చివర రెండు భాగాలుగా ఆచార్య జి.ఎస్. మోహన్ రాసిన 'పరిశోధన స్వరూప స్వభావాలు' వ్యాసం ఎంతో విలువైనది. ప్రతి పరిశోధక విద్యార్థీ చదివి తీరవలసిన వ్యాసం ఇది. పరిశోధన అంశ ఎన్నిక నుంచి మొదలుకొని సిద్ధాంత గ్రంథం తుది ప్రతి రూపకల్పన దాకా అన్ని విషయాల మీద ఒక స్థూల అవగాహన ఈ వ్యాసం కల్పిస్తుంది. పరిశోధనకు ఉపయోగపడే ఎన్నో సూక్ష్మ అంశాలను చర్చించిన వ్యాసం ఇది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ రెండు సంపుటాల 'సారాంశం' నూతన పరిశోధకులకొక స్వర్గం.



–డా॥వెల్దండి శ్రీధర్
9866977741



ఓటరన్నకో మాట

ఓటుఓటనంటు నీటుగా వస్తారు
మాటలెన్నొ జెప్పి మాయ జేయ
ఆశలెన్నొజూపి అందల మెక్కింత్రు
ఒక్క చూపు చూడు ఓటరన్న

కాస్ట్ పేస్టు పూసి కంగారు పెడతారు
హార్టు సీటు పెంచి స్మార్టు గాను
మతము పేరుచెప్పి మర్యాద చేస్తారు
ఒక్క చూపు చూడు ఓటరన్న
కొత్త నోట్లతోడ పుత్తడి తోడను
చెత్త కాగితముగ చేతురయ్య
దబ్బుకు ఆశపడక దక్షున్ని గెలిపించు
ఒక్క చూపు చూడు ఓటరన్న
బ్రాంది బాటిలిచ్చి భ్రాంతిలో పడవేసి
దండుకుందురోట్లు దండిగాను
తాగి చెడుకు నీవు తత్వంబు తెలుసుకో
ఒక్క చూపు చూడు ఓటరన్న
ఓట్లుకొన్నవాడు ఒడుపైన వ్యాపారి
పెట్టుబడిని పెట్టి పొట్టకొట్టు
అమ్మవంటి ఓటు అమ్మిన ముప్పురా
ఒక్కచూపు చూడు ఓటరన్న
చెప్పనలవికాని తిప్పలెన్నొ పడుచు
మాయజేతురయ్యమంత్రమేసి
చెడ్డవాని గెలుపు చేటురా జాతికి
ఒక్క చూపు చూడు ఓటరన్న
రావణుండు నేడు రామున్ని అంటాడు
సేవ పేరు చెప్పి షేవు(Shave) చేయు
ఓట్లకొరకు వారు ఫీట్లెన్నొ చేస్తారు
ఒక్క చూపు చూడు ఓటరన్న
దేశ ప్రగతి కొరకె దివ్యమైన ఓటు
ఉన్నవారిలోన ఉత్తమున్ని
ఎన్ను కొనుము మనల నేలుకొనగ
మేలుకొలుము భావి మేలుకోండి

– డా.ఎన్.వి.ఎన్.చారి

ఎన్ని కలలో

ఎన్ని కళలో కదా! ఎన్నికల జూదమున
భరతాంబ కలలన్ని భగ్నమయ్యేటట్లు!
ఎన్ని కలలో కదా! ఎన్నికల మాటునను
దాగున్న రాకాసి దాహంపు కళ్ళలో!
ఎన్ని కలలో కదా! ఎన్నికల క్రీడలో
బతుకారిపోయినా భారంపు కళ్ళలో!
ఎన్ని కలలో కదా! ఎన్నికల నీడలో
సేదదీరెడి మహా శ్రీమంతు నయనాల!
ఎన్ని కలలో కదా! ఎన్నికల జాడలో
ఉద్యోగ,కార్మికుల ఊహించు కళ్ళలో!
మానిఫెస్టోలతో మాయలూ,మచ్చికలు
హిప్నటైజును చేసి ఇల జూపెదరు దివిని
ఓటర్లనందరను మాటల్తొ కట్టేసి
వాటేసుకుంటారు, ఓటేసుకుంటారు
కులమతాలవారీ కూటముల నేర్పరచి
ఓటు బ్యాంకును చేసి ఓటమిని రానీరు
పంచి పెట్టినదంత పదియింతలై వచ్చు
కళలన్ని చూపించి కలదీర్చుకుంటారు
ఎంతైన దోచొచ్చు! ఎంతైన దాచొచ్చు!
రాజునడిగే రూలు రాజ్యాంగమునె లేదు!
ఓటు వేసేముందు ఓసారి యోచించు
వెలగబెట్టేదెవరో! వెలుగునిచ్చేదెవరో!
ఓటరన్నా! నీదు ఓటులోనే యుంది
బంగారు భవిష్యత్తు పరిమళించెడి రీతి...



– డా॥అడిగొప్పుల సదయ్య,
9963991125

సాహితీ వార్తలు

జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు 2023

గుంటూరు రావిరంగారావు సాహిత్య పీఠం నిర్వహించే 'జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు 2023' కు సంబంధించిన వివరాలు ప్రకటించింది. 2019 నుండి 2023 వరకు ప్రచురింతమైన పద్యం, వచన కవిత, దీర్ఘ కవిత, గేయం, లఘు కవితలు, బాల గేయాలు మొదలైన కవితా సంపుటాలను ఆహ్వానిస్తోంది. ఎంపికైన పుస్తకాల కవులకు ఒక్కొక్కరికి రెండువేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో 2024, ఫిబ్రవరిలో జరిగే సాహిత్య సభలో సత్కరిస్తారు. పుస్తకాలను కన్వీనరు, రావి రంగారావు సాహిత్య పీఠం, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్, తూర్పు, 5వ లైను, గోరంట్ల, గుంటూరు – 522034 చిరునామాకు డిసెంబర్ 31 లోగా పంపాలి.

– నర్రా ప్రభావతి, కన్వీనర్

26న 'ఆజాదీ' ఆవిష్కరణ

కరిపె రాజ్‌కుమార్ కవితా సంపుటి 'ఆజాదీ' ఆవిష్కరణ సభ ఈ నెల 26న ఆదివారం ఉదయం 10.30 గంటలకు బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో నిర్వహించనున్నారు. డా. రూప్ కుమార్ డబ్బీకార్ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని కె. ఆనందాచారి ఆవిష్కరిస్తారు. సభలో డా. కాంచనపల్లి గోవర్ధనరాజు, కొమ్మవరపు విల్సన్‌రావు, ఎం. నారాయణశర్మ ప్రసంగిస్తారు.

– పాలపిట్ట బుక్స్

'చందమామ' కథల జ్ఞాపకాలు

తెలుగు నాట 'చందమామ' పిల్లల మాసపత్రిక చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. 1947 జూలైలో మొదలైన ఈ పత్రిక 2013 వరకు 66 సంవత్సరాల పాటు నడిచింది. చందమామను స్థాపించిన ఘనత, విజయ వాహిని స్టూడియో అధినేత, పాతాళభైరవి, మాయాబజార్, గుండమ్మ కథ వంటి హిట్ చిత్రాలను అందించిన బొమ్మిరెడ్డి నాగిరెడ్డి; రచయిత, నిర్మాత, దర్శకులు అయిన చక్రపాణి గార్లది. మొదట తెలుగు, తమిళం భాషల్లో మొదలై, క్రమేపీ- కన్నడ, హిందీ, మరాఠీ, మలయాళం, గుజరాతి, ఆంగ్లం, ఒరియా, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, సంస్కృతం, సింహళం, సంతాలి వంటి 15 భాషల్లో వెలువడి లక్షలాది పాఠకులకు చేరువైంది. దీనిని గొప్పగా తీర్చిదిద్దిన ఘనత కొడవటిగంటి కుటుంబరావు గారిది. 1952లో చేరిన వీరు 1980లో చనిపోయే వరకు చందమామ ఎడిటర్‌గా కొనసాగారు. వీరు సాహిత్యంలో లబ్ధ ప్రతిష్టులు. అనేక కథలు, నవలలు, గల్పికలు రాసి, చందమామ ద్వారా బాల సాహిత్యాన్ని వెలిగింప చేశారు. వీరి సాహిత్యాన్ని విశాలాంధ్ర వారు ఆరు సంపుటాలుగా కేతు విశ్వనాథ రెడ్డి సంపాదకత్వంలో వెలువరించారు. నవలలను కొన్ని విడిగా ముద్రించారు.

పాఠశాలకు వెళ్లే విద్యార్థుల మొదలు, ఇంటికాడ విశ్రాంతి తీసుకునే నాయనమ్మ, అమ్మమ్మ, తాతయ్యల వరకు ఆబాలగోపాలాన్ని ఎంతగానో ఈ పత్రిక ఆకట్టుకుని, అక్కున చేర్చుకుంది. పెద్దలు తమకు ఇచ్చిన పాకెట్ మనీతో పిల్లలు కొనుక్కుంటే, పుస్తకం కోసం బుక్‌స్టాల్ వద్ద పెద్దలు ఎదురు చూసేవారు. ఆనాడు చందమామను ధర పెట్టి కొనలేని మాబోటి వారు, గ్రంథాలయానికి వెళ్లి చదువుకునేవారు. మా హుజూర్‌నగర్ గ్రంథాలయం 7:30 కి అటెండర్ హుస్సేన్ తెరిచేవాడు. మేము ఏడు గంటలకల్లా గ్రంథాలయం మెట్ల మీద కూర్చొని, హుస్సేన్ గది తాళం తీయగానే లోపలికి పరిగెత్తి వెళ్లి చందమామను అందుకొని కథలన్నీ అయిపోయే వరకు వదిలిపెట్టకుండా చదివేవారం. ఒక్కోసారి చందమామ చేతిలో ఉన్న విద్యార్థి మధ్యలో కూర్చుంటే, అటు ఒకరు ఇటు ఒకరు కూర్చొని ఒకేసారి ముగ్గురు చదివిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇంతలా చందమామ అందర్నీ ఆకట్టుకోవడానికి కారణం కథల్లో రకరకాల పాత్రలు ఉండటం ఒక కారణం. రాజులు, రాక్షసులు, దయ్యాలు, మాంత్రికులు, వ్యాపారులు, కవులు అమాయకులు, గృహిణులు, పూజార్లు, రైతులు ఇలా వందలాది పాత్రలు చందమామ నిండా పరుచుకుని ఉండేవి. విభిన్న పాత్రలతో భిన్నమైన కథలు ప్రతినెల చదువరులను అలరించేవి. దాసరి సుబ్రహ్మణ్యం గారు పాతాళ దుర్గం, కంచుకోట, మాయా ద్వీపం, రాతి రథం, తోక చుక్క, జ్వాలా ద్వీపం మొదలైన జానపద సీరియల్స్ ఉచ్చు కథను ఉత్సుకతను కలిగించేలా ఉండేవి. మరో ఆసక్తికర అంశం బేతాళ కథను ప్రతినెలా ప్రచురించడం. ఈ కథ పటితుల మెదడుకు మేత పెట్టేదిలా, తార్కికతతో నిండి ఉండేది. మన సంస్కృతీ, సంప్రదాయాల విలువలను పెంచేలా రామాయణం, భారతం, జానపద కథలు, పంచతంత్ర కథలు రీ రైట్ చేసి ఇస్తుండే వారు. రచనా విధానం ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. పిల్లల శరీరానికి పుష్టికరమైన ఆహారం ఎలాగో, మానసిక ఆరోగ్యానికి, తెలివితేటల పెరుగుదలకు, విజ్ఞానం వికసించడానికి, జ్ఞానం అభివృద్ధి చెందటానికి, సమాజంలో మనుగడకు ఎంతో ఉపకరిస్తూనే పిల్లలకు వినోదాన్ని, ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలుగ జేసేది.

చందమామలో బొమ్మల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, ఊదారంగుల మేళనంతో, చూడగానే ఇది చందమామ బొమ్మ అనిపించేలా ఒక ప్రత్యేక శైలితో చిత్రకారులు వేస్తుండేవారు. వారిలో వడ్డాది పాపయ్య, ఆచార్య, చిత్ర, వీరరాఘవన్, గోఖలే, శివ శంకరం, శక్తిదాస్, భాష, అయ్యర్, మహేష్, వంటి ఎందరో చిత్రకారులు పత్రికకు చిత్రాలతో అలంకరించి వన్నె తెచ్చారు.



-పువ్వాల కృష్ణమూర్తి,
99123 59345

ఇట్టి చందమామకు కథలను అనేక మంది రచయితలు అందించి తమ రచనా శక్తిని పెంపొందించుకోవడమే కాకుండా, చందమామ రచయిత అనే గొప్ప కీర్తిని గడించుకున్నారు. చందమామ రచయితలు అనే వాట్సప్ గ్రూపును నిర్వహించుకుంటూ ఇటీవలే సమావేశం ఏర్పాటు చేసుకొని తమ అనుభవాలను అనుభూతులను కలబోసుకున్నారు. వారిలో ప్రముఖులు వసుంధర అనే కలం పేరుతో రచనలు చేసిన రాజగోపాల్ రావు, రామలక్ష్మి గార్లు, మాచిరాజు కామేశ్వరరావు, ఎం వి వి సత్యనారాయణ, సిహెచ్ శివరాం ప్రసాద్, ఎన్ వి ఆర్ ఎస్ మూర్తి, జె.నారాయణమూర్తి., కే.ఎన్.వి.ఆంజనేయులు, జొన్నలగడ్డ మార్కండేయులు, ఎం. శివ నాగేశ్వరరావు., లక్ష్మీ గాయత్రి, రాంబాబు, గణేశ్వర రావు, పద్మలత జయరాం, రాంబాబు, బూర్లే నాగేశ్వరరావు, ఆరుపల్లి గోవిందరాజులు, గంగిశెట్టి శివకుమార్, యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకట కృష్ణమూర్తి, దాసరి వెంకట రమణ, మల్లవరపు మనోహర్ రెడ్డి, పువ్వాల కృష్ణమూర్తి వంటి ఓ పాతికమంది రచయితలు నిరంతరం ఈ పత్రికకు కథలను అందిస్తుండేవారు. వీటిని సాన పట్టి, తప్పులు ఉంటే సరిచేసి ప్రచురించడమే కాకుండా - స్వదస్తూరితో ఒక కార్డు కూడా రాసేవారు కొ.కు.గారు. అలాంటి కార్డులను, నాటి చందమామ కథల కాపీలను నేటికీ భద్రంగా దాచుకున్నారు రచయితలు. చందమామ కథల మీద దాసరి వెంకటరమణ గారి తో పాటు అనేక మంది విద్యార్థులు వివిధ యూనివర్సిటీలలో పరిశోధనలు చేసి, పట్టాలను తీసుకున్నారు.

చందమామ కథలను నేటి తరానికి పరిచయం చేయ్యాలని సదుద్దేశంతో జేపీ పబ్లికేషన్స్ ప్రసాద్ రావు గారు 2000 సంవత్సరం నుండి నేటి వరకు పది సంపుటాలుగా చందమామ కథలను 22X28 సైజుతో అందంగా ముద్రించి. మార్కెట్‌లోకి తెచ్చారు. ఆనాటి చందమామనే చదువుతున్నంత ఫీల్ తో పాఠకులు ఆనందపడాలని బొమ్మలను చందమామ చిత్రకారులు శక్తిదాసు తోటి వేయించారు. తన ఆరోగ్యం సహకరించని కారణంగా మాచిరాజు గారి దేశ భక్తి కథల పుస్తకానికి దేవితో బొమ్మలు గీయించారు. వీరు నాటి చందమామ కథలను తలపించే విధంగా చక్కటి బొమ్మలను, ఆకర్షణీయమైన రంగుల్లో చిత్రించి అందించారు.

21 మే 1955 తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడులో పుట్టిన మాచిరాజు కామేశ్వరరావు గారు కెనరా బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసి 2015లో పదవి విరమణ చేశారు. తన 14వ ఏటి నుండి రచనలు చేయడం ప్రారంభించిన వీరు నేటి వరకు 450 దాకా కథలు రాశారు. కేవలం 250 కథలు ఒక్క చందమామలోనే రాశారు. పిల్లల కథలే కాకుండా ఆంధ్రప్రభ, పత్రిక, జ్యోతి, ఆంధ్రభూమి, స్వాతి, విపుల మొదలైన పత్రికల్లో 100కు పైగా పెద్దల కథలు, స్వాతిలో నాలుగు నవలలు, చతురలో రెండు నవలలు రాశారు. వీరి సాహిత్య కృషికి చక్రపాణి - కొలసాని అవార్డు, మాడభూషి రంగాచార్య స్మారక పురస్కారం, శ్రీమతి ఆకెళ్ళ సుబ్బలక్ష్మి సత్కారం బాలసాహిత్యంలో అందు కున్నారు. 5-11-2023 న రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, బాలసాహిత్య పరిషత్ వారు వీరి దేశ సేవ పుస్తక ఆవిష్కరణ సందర్భంగా కథల చందమామ అను బిరుదును ప్రధానం చేశారు.

ఇటీవలే విడుదలైన వీరి "దేశ సేవ" పిల్లల కథల పుస్తకంలోని 21 కథల్లో, 14 కథలు చందమామలో వచ్చినవే. మిగతావి బాల జ్యోతి, ప్రమోద పత్రికల్లో వచ్చాయి. మనిషికి శాపం కథలో ప్రతాపుడు పరుల ఐశ్వర్యం చూసి ఈర్ష పడటంతో- ఆరోగ్యం, నిద్ర, ఆనందం, తృప్తిని మించిన ఐశ్వర్యం మరొకటి లేదని ఋషి హితబోధ చేస్తాడు. అలాగే జైలు నుంచి పారిపోయి ఒక ఇంట్లో జొరబడిన దొంగను మంచి మాటలతో తిరిగి జైలుకు వెళ్లేలా చేసిన ఇల్లాలి కథ పారిపోయిన దొంగ. ఈ కథ కేం బ్రిడ్జి యూనివర్సిటీ వారు తీసుకున్నారు. పదవీ విరమణ చేసిన పంతులు గ్రామంలో నిరక్షరాస్యులకు చదువు నేర్పాలని, తన పాండిత్యం ప్రదర్శించగా, వారి స్థాయికి దిగి విద్య నేర్పాలని, పాలేరు చెప్పిన పాఠం కథ ద్వారా పాలేరు చెబుతాడు. అలాగే పిల్లలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి పిల్లలు తెలుసుకోండి కథ ద్వారా చెప్తారు ఈ మొత్తం కథల్లో విజ్ఞానాన్ని, వివేకాన్ని, తార్కిక శక్తిని, సమాజ పోకడలను చక్కగా తెలియజేస్తారు. ముందుమాట అందించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ గ్రహీత దాసరి వెంకటరమణ , వీరి కథలు పిల్లలకు మనోవైజ్ఞానిక పాఠాలని కొనియాడారు. ఈ పిల్లల కథల పుస్తకాన్ని చదువుతుంటే, పాత చందమామ చదువుతున్న అనుభూతి ఖాయం. పిల్లలు పెద్దలు తప్పకుండా చదివి, దాచుకోవలసిన పుస్తకం.

(శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదు వారు 2022 సంవత్సరానికి గాను బాల సాహిత్యంలో శ్రీ మాచిరాజు కామేశ్వరరావుకు బాల సాహిత్య పురస్కారం ప్రకటించిన సందర్భంగా.)

ఓటును నేను నోటును కాను

మందు విందు కానేకాను..
సగటు మనిషి ఆశల బాటను నేను
పేద ప్రజల మాయ చేసి నీతి నియమం గాలికొదిలి
కోట్ల ఆస్తులు గాలికొదిలి
వారసులకే పదవులిచ్చే
స్వార్థ పాలనపై వేసే వేటును నేను
అవినీతిని బహిష్కరించి అక్రమార్కుల మెడలు వంచి
కులం మతం కుళ్లతో కంపుకొట్టే
మతోన్మాద పాలనపై
ప్రశ్నించే గొంతు చేసే తిరుగుబాటును నేను..
ఎన్నాళ్ళని ఎన్నేళ్లని
పేదోడి కంట కన్నీరని
నినదించి నిలదీయగా
నీతి లేని తుచ్ఛ నాయకులపై
ఎక్కు పెట్టే శ్రమ జీవుల
చేతిలోని తూటను నేను
అదరవద్దు బెదరవద్దు
కదలిరండి ఓటేద్దాం...
మనం మనం కలిసి
ప్రభంజనవుదాం..
సమ సమాజ స్థాపనకై
ఓటు విలువ చాటుదాం..
ప్రగతి బాటను పయనించేందుకు
ఓటంటే నోటు కాదనే
జన స్వరాన్ని వినిపిద్దాం...

– సాయి

దేశానికి పట్టిన శని బీజేపీ ప్రభుత్వం

- కేసీఆర్ కుటుంబానికి కాలం చెల్లింది
- రంగులు మార్చే ఊసరవెల్లి కోమటిరెడ్డి
- ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థులను ఆదరించాలి : చౌటుప్పల్ రోడ్‌షో లో మాజీ ఎంపీ పి. మధు



నవతెలంగాణ-చౌటుప్పల్

దేశానికి పట్టిన శని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమని సీపీఐ(ఎం) మాజీ ఎంపీ, ఏపీ మాజీ కార్యదర్శి పి.మధు విమర్శించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణకేంద్రంలో మునుగోడు సీపీఐ(ఎం) అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి గెలుపు కోసం పట్టణంలో రోడ్డు షో నిర్వహించారు. మహిళల కోలాటాలు, కళాకారుల డప్పు చప్పుళ్ల, ఆటపాటలు, వంద మీటర్ల ఎర్రజెండా చేతబూని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, మహిళలతో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. రోడ్డు షో చిన్నకొండూరు చౌరస్తా వరకు కొనసాగింది. జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ జహంగీర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో మధు మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనకు నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలతో కాలం చెల్లిపోతుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని, నిజాయితీకి పట్టం కట్టాలని కోరారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రూ.18వేల కోట్ల కాంట్రాక్టుకు బీజేపీకి అమ్ముడుపోయారని.. మునుగోడు ఉపఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులే విమర్శించారని గుర్తుచేశారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన రాజగోపాల్‌రెడ్డికి మునుగోడు టికెట్ ఇవ్వడం పట్ల ప్రజలు ప్రశ్నించుకుంటున్నారని తెలిపారు. రంగులు మార్చే ఊసరవెల్లి రాజగోపాల్‌రెడ్డిని చిత్తుగా ఓడించేందుకు మునుగోడు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజలకు తీరని హామీలు ఇస్తూ మోసం చేస్తున్నాయని, మోడీ ఒక్క ప్రాజెక్టు నిర్మాణం కూడా చేయలేదని విమర్శించారు. పదేండ్ల మోడీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నల్లధనం తీసుకువచ్చి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఐదు లక్షల పరిశ్రమలు మూతపడ్డాయని, లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆరోపించారు. గిట్టుబాటు ధర కోసం రైతు ఉద్యమాలు నిర్వహిస్తే మోడీ రైతులపై లాఠీఛార్జి చేయించారని ధ్వజమెత్తారు. కార్మికుల హక్కులను బీజేపీ కాలరాసిందన్నారు. అలాంటి మోడీ ప్రభుత్వానికి కేసీఆర్ వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు కాలం చెల్లిందన్నారు. ప్రజలు, కార్మికులు, రైతుల కోసం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. అవకాశవాద, అవినీతి, మతతత్వ పార్టీల అభ్యర్థులను ఓడించాలన్నారు. కమ్యూనిస్టులు నిత్యం పేద ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయడం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు వచ్చాయని తెలిపారు. రాజగోపాల్‌రెడ్డికి రాజకీయ విలువలు లేవన్నారు. ఈ ప్రాంత ప్రజల పక్షాన పోరాటాలు చేసే దోనూరి నర్సిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ జహంగీర్ మాట్లాడుతూ.. అనేక అరాచకాలకు పాల్పడిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలన్నారు. మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. దేవ జనార్ధన్‌రెడ్డి, కందాల రంగారెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని ఎర్ర జెండా చేతపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు దింపలేదన్నారు. ధన బలానికి, జనబలానికి యుద్ధం జరుగుతుందన్నారు. మునుగోడు గడ్డ కమ్యూనిస్టుల అడ్డా అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండ శ్రీశైలం, బూర్గు కృష్ణారెడ్డి, కల్లూరి మల్లేశం, రఘుపాల్, గంగదేవి సైదులు, బండారు నర్సింహ, మేక అశోక్‌రెడ్డి, ఎమ్‌డి.పాషా, ఆనగంటి వెంకటేశం, మంగ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

మా వల్లే అడవిబిడ్డలకు 'పోడు' పత్రాలు

- ప్రభుత్వాల మెడలు వంచి..
- ప్రజా చట్టాలను తీసుకువచ్చిన ఘనత సీపీఐ(ఎం)దే
- దబ్బు రాజకీయాలను ఓడించాలని పిలుపు
- జనాల కోసం పనిచేసే నాయకున్ని గెలిపించాలని విజ్ఞప్తి : సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ- కూసుమంచి

కేంద్రం, రాష్ట్రాల్లోనూ ఏ ప్రభుత్వం ఏర్పడినా ఆ ప్రభుత్వం మెడలు వంచి ప్రజలకు ఉపయోగపడే చట్టాలను చట్టసభల్లో అమలు చేయించి ప్రజలకు అందించిన ఘనత సీపీఐ(ఎం)దేనని ఆపార్టీ పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నేలపట్ల, అగ్రహారం, మునిగేపల్లి, గోపాల్‌రావు పేట, జీళ్ళచెరువు, కేశవాపురం, చేగొమ్మ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు కేంద్రంలో యూపీఏ-1 సర్కార్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని, సమాచార హక్కు చట్టాన్ని, చట్టసభల్లో ప్రభుత్వాలు మెడలు వంచి ఆమోదింప చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీలదే, ముఖ్యంగా సీపీఐ(ఎం) పార్టీదేనని అన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడి గిరిజనులు, అడవి బిడ్డలకు పోడు భూములకు హక్కుపత్రాలను అందేటట్లు చేశామని తెలిపారు. కేవీపీఎస్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ యాత్రలు నిర్వహించి ఎస్సీ సబ్ ప్లాన్‌ను తీసుకొచ్చేలా చేశామన్నారు. ఈ రోజు ప్రతి ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేశారంటే అది సబ్‌ప్లాన్ ఫలితమేనని గుర్తు చేశారు. సీతారామ ప్రాజెక్టుతో గోదావరి జలాలను పాలేరు జలాశయంలో కలుపుతామని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం.. ఆనాడు తాను చేసిన దుమ్ముగూడెం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం చేసిన పాదయాత్ర ఫలితమేనని వెల్లడించారు.

నేడు పాలేరులో పోటీ చేస్తున్నటువంటి నాయకుల చరిత్ర చూసి ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. వేలకోట్ల కాంట్రాక్టు పనులు చేస్తూ అందులో అవినీతికి పాటుపడుతూ, అక్రమంగా సంపాదించిన డబ్బుతో ప్రజలను అంగడి సరుకులా కొనుగోలు చేసి ఓట్లు వేయించుకుందామని చూస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డబ్బు సంచులు పట్టుకొని ఏ పార్టీ అధికారంలోకొస్తే ఆ పార్టీలోకి వెళుతూ ఊసరవెల్లిగా రంగులు మారుతున్న నాయకులను ప్రజలు తిరస్కరించాలన్నారు. జన సమస్యల కోసం, ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల కోసం పోరాటం చేస్తూ ప్రజల మధ్యలో ఉన్నటువంటి సీపీఐ(ఎం) అభ్యర్థి తనను ప్రజలు ఆదరించి, ఆలోచించి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైరా సీపీఐ(ఎం) అభ్యర్థి భూక్య వీరభద్రం, సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ ఇన్‌చార్జి బండి రమేష్, మండల ఇన్‌చార్జి బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎర్రబోయిన భారతి, మండల కమిటీ సభ్యులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో అభివృద్ధి కుంటుపడింది

- నన్ను గెలిపించండి.. అండగా ఉంటా : సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు
- జగన్నాథపురంలో ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-పాల్వంచ

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి తప్ప, ఈ పదేండ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని కాంగ్రెస్, సీపీఐ(ఎం), టీడీపీ, తెలంగాణ జన సమితి, సీపీఐ(ఎంఎల్-ప్రజాపంథా) బలపరిచిన కొత్తగూడెం నియోజకవర్గ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ప్రజల పక్షాన సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తానని, ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న కొంతమంది నాయకులు తాము అభివృద్ధి చేశామంటే తాము అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటూ ప్రజలను మాయబుచ్చేందుకు తిరుగుతున్నారని విమర్శించారు. ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్, సీపీఐ కూటమికి ప్రజలు పట్టం కట్టబోతున్నారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రత్యేక గ్రాంట్ల ద్వారా నిధులను తీసుకొస్తే, తాజా, మాజీ ప్రతినిధులు వాటి నిధులను మళ్లించి అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. ఐదేండ్ల పాటు ప్రజలను, వారి కష్టాలను పట్టించుకోని నాయకులు డబ్బు మూటలతో వస్తున్నారని వారి ఆటలు కొనసాగకుండా ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ, జన సమితి నాయకులు కోత్వాల శ్రీనివాస్ రావు, జానకి రెడ్డి, ఎర్రం శెట్టి ముత్తయ్య పాల్గొన్నారు.

రైతులపై కేసులు పెట్టిన ఘనత కాంగ్రెస్ దే : ఎమ్మెల్సీ కవిత



పెద్దపల్లి : రైతులపై కేసులు పెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రైతుల కోసం అహర్నిశలు ఆలోచించేది సీఎం కేసీఆర్ అని, కాంగ్రెస్ వాళ్లు చెప్పే అబద్దాలు నమ్మవద్దని ఆమె ప్రజలకు సూచించారు. మతకల్లోలాలు లేని పాలన సీఎం కేసీఆర్ తోనే సాధ్యమని స్పష్టం చేశారు. పెద్దపల్లిలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మనోహర్ రెడ్డి, ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత పదేండ్లలో ఒక్క మతకల్లోలం లేకుండా రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ పరిపాలించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రాష్ట్రం ఎప్పుడూ మతకల్లోలాలతో సతమతమయ్యేదని, సీఎం కేసీఆర్ శాంతి భద్రతల సమస్య లేకుండా చేశారన్నారు. ప్రతి ఒక్కరి రక్షణకు సీఎం కేసీఆర్ పాటుపడ్డారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివద్ధి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేశారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

కమ్యూనిస్టులకు వేసే ప్రతి ఓటూ ఓ తూటానే

- బయట పోట్లాడుతం.. సభలో మాట్లాడుతం
- ప్రజల గోస పట్టని పార్టీలకెందుకు ఓటెయ్యాలి
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే వేరు.. విధానాలొక్కటే
- రాజ్యాంగాన్ని పాతాళానికి తొక్కుతున్న బీజేపీని కేసీఆర్ ప్రశ్నించగలదా?
- నోట్ల కట్టలకు ఆశపడితే భవిష్యత్ నాశనమే
- అదనపు పని గంటలతో కార్మికులతో పాటు ఐటీ ఉద్యోగులూ ఇక్కట్లు
- సీపీఐ(ఎం) గెలిస్తేనే పేదలు, కార్మికులకు లాభం : అమీన్‌పూర్ బహిరంగ సభలో బీవీ రాఘవులు

నవతెలంగాణ-మెదక్‌ప్రాంతీయప్రతినిధి

ఎర్రజెండాకు వేసే ప్రతి ఓటూ పాలకుల గుండెల్లో పేలే తూటా లాంటిదని, ప్రజల సమస్యలపై పోరాడేందుకు మరింత శక్తిని పెంచేందుకు దోహదపడుతుందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ప్రజల కోసం బయట పోట్లాడుతాం.. చట్ట సభల్లో మాట్లాడుతామని స్పష్టం చేశారు. ఓట్లు, సీట్లు వచ్చినా రాకపోయినా కార్మిక వర్గం, పేదల ప్రయోజనాల కోసమే పోరాడుతామన్నారు. ఇతర పార్టీలేవైనా బయటా.. చట్టసభల్లో.. ప్రజల గురించి ఆలోచిస్తాయా.. అని ప్రశ్నించారు. పటాన్‌చెరు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి జె.మల్లిఖార్జున్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సంగారెడ్డి జిల్లాలోని బీరంగూడ మండే మార్కెట్‌లో నాయకులు నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ఆయన హాజరై మాట్లాడారు. పళ్లూడ గొట్టుకోవడానికి ఏ రాయి అయినా పర్వాలేదు అన్నట్టుగా ప్రజల గురించి ఆలోచించని ఏ పార్టీకి ఓటు వేసినా వృథానే అవుతుందన్నారు. "మేముండగానికి ఇండ్లు ఇచ్చారా..? మేం బతకాడిని మా జీతం పెంచారా..? పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించారా..? మా పేదరికం పోయేందుకు ఆలోచించారా..? ఇన్నాళ్లు పాలించి ఏం చేశారో చెప్పండి" అని పాలక పార్టీలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల యజమానులకు సాయపడటం తప్ప ఏ నాడైనా కార్మికులు, పేదల గురించి మాట్లాడని, కొట్లాడని పార్టీల అభ్యర్థులిచ్చే నోట్ల కట్టలకు ఆశపడితే మన భవిష్యత్ నాశనమై గోస పడతామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పరంగా వేరైనప్పటికీ విధానాల పరంగా రెండూ ఒక్కటేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే లేబర్‌కోడ్‌లు తెచ్చేందుకు ఆలోచన చేస్తే.. అప్పట్లో సీపీఐ(ఎం) పోరాడడంతో ఆగిపోయాయని గుర్తు చేశారు. ఆ లేబర్ కోడ్‌లను బీజేపీ అమలు చేస్తోందన్నారు. ఆస్తి పన్నులు బాగా పెంచితేనే అప్పులు తీసుకోవడానికి వీలుంటుందని, స్మార్ట్ మీటర్లు, టైం టారిఫ్ పెట్టి విద్యుత్ సబ్సిడీలు ఎత్తేయాలని బీజేపీ ఆయా రాష్ట్రాలకు లేఖలు రాసిందన్నారు. రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వాలు.. బీజేపీ అమలు చేసే ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేయకుండా ఎవరైనా అడ్డుపడతారా అని ప్రశ్నించారు. సామాజిక న్యాయాన్ని నాశనం చేస్తూ రాజ్యాంగాన్ని పాతాళానికి తొక్కేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. బీజేపీ చేసే రాజ్యాంగ వ్యతిరేక విధానాల్ని కేసీఆర్ ప్రశ్నించగలడా అని ప్రశ్నించారు. ఎత్తైన అంబేద్కర్ విగ్రహం పెడితే చాలదని, ఆయన ఆశయాలను దెబ్బతీస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అదానీ లక్షల కోట్ల నల్లధనాన్ని బయటికి పంపించి తెల్ల ధనంగా మార్చుకున్నట్టు ఆధారాలు బయటపడినా విచారణ సంస్థలు మాత్రం ఆయనకు క్లీన్ చీట్ ఇవ్వడం దుర్మార్గమన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ చరిత్రను అర్థం చేసుకొని ప్రజలు నిజాయితీగా పనిచేసే ఎర్రజెండా అభ్యర్థికి ఓటేయాలని కోరారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో లక్షలాది మంది కార్మికులున్నారని, వీరికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాల కోసం సీపీఐ(ఎం) నికరంగా పోరాడిందన్నారు. కనీస వేతనాల సలహా మండలిని వేయాలని పోరాడిన ఫలితంగా ప్రభుత్వం చొరవ చూపిందన్నారు. పరిశ్రమల్లో వలస కార్మికులే కాదు ఐటీ ఉద్యోగులు సైతం అదనపు పని గంటలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులు, ఉద్యోగులు, పేదల కష్టాలు తెలిసిన మల్లిఖార్జున్‌ను గెలిపించుకోవడం ద్వారా ప్రభుత్వంతో కొట్లాడి సమస్యల్ని పరిష్కరింపచేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

కార్మిక వర్గం ప్రయోజనాలే ప్రధానం: చుక్క రాములు

కార్మిక వర్గం ప్రయోజనాలు తప్ప మరే ప్రయోజనాలు లేవని స్పష్టమైన రాజకీయ విధానాన్ని ప్రకటించే పార్టీ ఒక్క సీపీఐ(ఎం) మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు స్పష్టంచేశారు. ఈ విధానాన్ని చెప్పగల్గిన దమ్ము బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీఎస్పీలకు ఉందా అని ప్రశ్నించారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో లక్షలాది మంది కార్మికుల పక్షాన సీపీఐ(ఎం) పోరాడిందన్నారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఇతర పార్టీల అభ్యర్థులు ఏనాడైనా కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని అడిగిన పాపాన పోలేదన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం కాలుష్య కుంపటిగా మారిందన్నారు. బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల చేసి భూముల్ని కాజేయడం తప్ప అభివృద్ధి చేసిందిలేదని ఆరోపించారు. సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, ఐద్వా రాష్ట్ర నాయకులు ఆశాలత, సీపీఐ(ఎం) అభ్యర్థి మల్లిఖార్జున్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య, బి.మల్లేశం, సాయిలు, రామచంద్రం, నాయకులు పాండురంగారెడ్డి, వాజీద్ అలీ, జార్జ్, అనంతకుమార్, శాంతకుమార్, రాజు, బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన 26 కులాలను బీసీ జాబితాలో చేర్చాలి

- ఎనిమిదిరోజుల్లో బీఆర్ఎస్ తమ వైఖరి ప్రకటించాలి
- లేదంటే ఆ పార్టీని ఓడిస్తాం : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య

రాష్ట్ర బీసీ జాబితా నుంచి 26 కులాలను తొలగించి బీసీలను అన్ని విధాలా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ అధ్యక్షతన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ తొలగించిన వెనుకబడిన 26 కులాలను 8 రోజుల్లోపు బీసీ జాబితాలో కలపాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఇప్పటికే విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో ఎంతో నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లితండ్రులు బీసీలుగా ఉంటె పిల్లలు ఓసీలు ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. బీసీలను విభజించి అధికారంలోకి వస్తామంటే బీసీలు ఊరుకోబోరని హెచ్చరించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతివ్వాలనే విషయం నాలుగు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. డిసెంబర్ 13, 14 న జరగనున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. విలేకర్ల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీలం వెంకటేష్ ముదిరాజ్, సుధాకర్, రాజేందర్, అనంతయ్య, పితాని ప్రసాద్ , బిల్ల దీపిక తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం లోపాయికారీ పొత్తు



సీపీఐ కాంగ్రెస్ కూటమిని ఓడించేందుకు కుట్రలు..

- మైనార్టీలు ఆలోచించి ఓటు వేయండి : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో ఎన్నికల బరిలోకి దిగి ప్రజలను మోసం చేస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఆదివారం మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషాతో కలిసి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ గోషామహల్ అభ్యర్థి రాజాసింగ్‌పై పోటీ పెట్టకుండా, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ మైనార్టీ అభ్యర్థిపైన ఎంఐఎం బరిలో దిగడం మూడు పార్టీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టమవుతుందని విమర్శించారు. పదేండ్లుగా అధికారంలో కొనసాగుతున్న బీజేపీ బీఆర్ఎస్‌లకు గ్యాస్ ధరలు ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు.. యువతను, విద్యార్థులను మోసం చేసేందుకు తప్పుడు మ్యానిఫెస్టోలను ప్రకటించారని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేయక పోగా, ఉన్న సంస్థలను విక్రయించి, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా చేసిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పోటీ పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయిందని దుయ్యబట్టారు. శాసనసభ ఎన్నికల్లో డిపాజిట్లను కూడా తెచ్చుకోలేని బీజేపీ బీసీని ఎలా ముఖ్యమంత్రి చేస్తుందని ప్రశ్నించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌ని పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించిందని గుర్తు చేశారు. లిక్కర్ కేసులో కవితను కాపాడేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీ చేస్తున్న కొత్తగూడెం శాసనసభ నియోజకర్గంలో ఒక ఇండిపెండెంట్ వ్యక్తికి వామపక్ష పార్టీగా చెప్పుకునే ఫార్వర్డ్ బ్లాక్ బీ ఫామ్ ఎలా ఇస్తుందని నారాయణ ప్రశ్నించారు. సీపీఐ మాజీ ఎంపీ అజీజ్ పాషా మాట్లాడుతూ యూపీ, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్న ఎంఐఎం, తెలంగాణ సొంత రాష్ట్రంలో కేవలం 9 సీట్లలోనే ఎందుకు పోటీ చేస్తుందని నిలదీశారు.. రాష్ట్ర వ్యాప్తంగా 40 శాసనసభ నియోజకర్గాల్లో ముస్లింల ప్రభావం ఉంటుందని, ఈసారి ఎంఐఎం తీరుపై ఆలోచించి ఓటు వేయాలని వారికి సూచించారు. తెలంగాణలో కర్నాటక తరహా మార్పులు వస్తాయని అజీజ్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.బాలమల్లేష్, నర్సింహ పాల్గొన్నారు.

విధ్వంసం ఆపకపోతే విపత్తులే

- ప్రకృతి వైద్యులు డాక్టర్ కె.వై.రామ్ చంద్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మనిషి ప్రకృతి విధ్వంసం ఆపకపోతే విపత్తులను ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రకృతి వైద్యులు డాక్టర్ కె.వై.రామ్ చంద్ర హెచ్చరించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్, సిద్ధార్థ యోగ విద్యాలయం, డాక్టర్ రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ చంద్ర మాట్లాడుతూ భూమి మీద అనేక జీవ జాతులున్నప్పటికీ మనిషి మాత్రమే విధ్వంసం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇల్లు ఒక వైద్యశాలు, ప్రతి వంట గది ఒక ఔషధ శాలగా, ప్రతి తల్లి ఒక డాక్టర్‌గా మారినప్పుడే సంపూర్ణ ఆరోగ్య భారతదేశం అవుతుందన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ప్రకృతిని ప్రేమించడం, దానికి అనుకూలంగా జీవించడం నేర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో "మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర" అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, మెమెంటో, సర్టిఫికెట్, చేనేత శాలువతో ఘనంగా సత్కరించారు. ప్రకృతి వైద్యులు యోగ గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మెన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి సభాధ్యక్షత వహించారు.

యాదాద్రి తరహాలో భద్రాద్రి అభివృద్ధి

గెలిపిస్తే రామయ్య దర్శనం చేసుకుంటా..

- కాంగ్రెస్ చేతికి కత్తి ఇచ్చి యుద్ధం మమ్మల్ని చేయమంటే ఎలా..?
- గిరిజనేతరులకు పోడు పట్టాలివ్వాలనుకున్నా మోడీ అడ్డంకి కేసీఆర్‌తోనే సింగరేణికి పరిరక్షణ
- కొత్తగూడెం, భద్రాచలంలో కేటీఆర్ రోడ్ షో



నవతెలంగాణ-భద్రాచలం రూరల్/ కొత్తగూడెం

భద్రాద్రి రామయ్యను కేసీఆర్ నిర్లక్ష్యం చేస్తున్నారనడంలో వాస్తవం లేదని, రాముడుపై అపారమైన భక్తి ఉంది కనుకనే నా పేరు తారకరాముడిగా పెట్టారని, ఈ ఎన్నికల్లో తెల్లం వెంకట్రావుని గెలిపిస్తే రామయ్యను దర్శనం చేసుకుంటానని మంత్రి కేటీఆర్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, కొత్తగూడెం పట్టణాల్లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలపై తనదైన శైలిలో విమర్శలు కురిపించారు. కాంగ్రెస్ చేతికి కత్తి ఇచ్చి మమ్మల్ని యుద్ధం చేయమంటే ఎలా, 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ ప్రాంతానికి ఏం చేసిందని ప్రశ్నించారు. బీజేపీ దివాళా కోరు విధానాలతో దేశం వెనకబడి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో భద్రాచలంలో తెల్లం వెంకట్రావుని గెలిపిస్తే భద్రాద్రిని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. భద్రాచలానికి కాంగ్రెస్ పార్టీ వల్లే పోలవరం శాపంగా మారిందన్నారు. గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇచ్చేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతుందని ఆరోపించారు.

కొత్తగూడెం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో కేటీఆర్ మాట్లాడుతూ..

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సింగరేణి సంస్థను పంటికి అంటకుండా మింగేసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. ఈ కుట్రలు అడ్డుకునేందుకు కాంగ్రెస్ ఏమాత్రం ప్రయత్నం చేయట్లేదని, సింగరేణి పరిరక్షణ కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ తెలంగాణకు గుండెకాయని, కార్మికులు, సంస్థను రక్షించుకునే బాధ్యత మాదేనన్నారు. సింగరేణిని లాభాల బాటలోకి తీసుకువచ్చింది కేసీఆర్ ప్రభుత్వం అని తెలిపారు. ఓట్లు కొనేందుకు వస్తున్న బడాబాబులకు కొత్తగూడెం ప్రజల చైతన్యాన్ని రుచి చూపించాలని సూచించారు. సింగరేణి బతకాలంటే కేసీఆర్, వనమాకు ఓటు వేయాలని కార్మికులను కోరారు.

కార్యక్రమాల్లో ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్సీ తాత మధు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, భద్రాచలం, కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థులు తెల్లం వెంకటరావు, వనమా వెంకటేశ్వరావు, రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దర్శనం చేసుకోకపోవడంపై చర్చ

భద్రాచలం ప్రజల ఓట్లను అడిగేందుకు ఎన్నికల ప్రచార నిమిత్తం భద్రాచలానికి వచ్చిన కేటీఆర్ భద్రాద్రి రామయ్యను దర్శించుకోకపోవడమేంటనే ప్రశ్న స్థానికంగా వ్యక్తమైంది. భద్రాచలంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తేనే రామయ్య దర్శనానికి వస్తానని మాట్లాడటం సరికాదని విశ్లేషకుల అభిప్రాయం. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన రూ.100 కోట్లు, రూ.1000 కోట్ల హామీపై నోరు మెదపలేదు. కనీసం భద్రాచలం అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళిక కూడా ప్రకటించలేదు. దీనిపై విమర్శలు ఉన్న నేపథ్యంలోనే కేటీఆర్ వ్యవహారశైలి మరోసారి చర్చకు దారితీసింది.

ప్రపంచకప్ ప్రైజ్‌మనీ
చాంపియన్ - రూ.33 కోట్లు
రన్నరప్ - రూ.16.5 కోట్లు

ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ - విరాట్ కోహ్లి
మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ - ట్రావిశ్ హెడ్



హైదరాబాద్‌కు రండి!

అహ్మదాబాద్ : భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని హైదరాబాద్‌కు రావాల్సిందిగా హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ఆహ్వానించారు. హెచ్‌సీఏ లీగ్ పోటీలకు దాదా వస్తే.. యువ క్రికెటర్లకు ప్రేరణగా ఉంటుందని ఆయనతో చెప్పారు. భారత్, ఆస్ట్రేలియా ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా బీసీసీఐ మాజీ అధ్యక్షుడు గంగూలీతో జగన్‌మోహన్ రావు భేటీ అయ్యారు. తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి సహకారం అందించాలని గంగూలీని జగన్ కోరారు.



కల చెదిరింది

- ఆసీస్ చేతిలో మళ్లీ భంగపాటు
- ప్రపంచకప్ ఫైనల్లో భారత్ ఓటమి
- ఆరోసారి చాంపియన్‌గా ఆస్ట్రేలియా
- ఛేదనలో ట్రావిశ్ హెడ్ మెరుపు సెంచరీ

భారత్ 240/10, ఆస్ట్రేలియా 241/4
ఐసీసీ 2023 ప్రపంచకప్


కల చెదిరింది. కన్నీరే ఇక మిగిలింది. 2023 ప్రపంచకప్ టీమ్ ఇండియా చేజారింది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. రికార్డు స్థాయిలో ఆరోసారి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. 2003 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడిన టీమ్ ఇండియా.. సొంతగడ్డపై 2023 ప్రపంచకప్ తుది పోరులోనూ నిరాశపరిచింది. ప్రపంచకప్‌లో ఫైనల్లో భారత్‌కు ఇది రెండో ఓటమి.

అజేయ ప్రస్థానానికి ఊహించని ముగింపు. ఆతిథ్య జట్టుగా ప్రపంచకప్‌లో వరుసగా పది మ్యాచుల్లో ఎదురులేని విజయాలు సాధించిన టీమ్ ఇండియా.. టైటిల్ ముంగిట ఫైనల్లో బోల్తా పడింది. 'టాస్' పాత్ర గణనీయంగానే ఉన్నప్పటికీ బ్యాట్‌తో ఆతిథ్య జట్టు అంచనాలను అందుకోలేదు. సెమీఫైనల్ వరకు ప్రత్యర్థులను అన్ని విభాగాల్లో చిత్తు చేసిన టీమ్ ఇండియా.. టైటిల్ పోరులో మాత్రం ఆసీస్ చేతిలో అన్ని విభాగాల్లో తేలిపోయింది!.

ఆస్ట్రేలియా సిక్సర్. ఐసీసీ ప్రపంచకప్ టైటిల్ మరోసారి కంగారూ గూటికి చేరుకుంది. అలెన్ బోర్డర్, స్టీవ్ వా, రికీ పాంటింగ్, మైకల్ క్లార్క్ సరసన పాట్ కమిన్స్ నిలిచాడు. ఆస్ట్రేలియా ప్రపంచకప్ టైటిల్ అందించిన తొలి, ఓవరాల్‌గా మూడో బౌలర్, కెప్టెన్‌గా నిలిచాడు. గతంలో పేసర్లు కపిల్ దేవ్, ఇమ్రాన్ ఖాన్ మాత్రమే కెప్టెన్‌గా ప్రపంచకప్ ట్రోఫీని గెలుపొందారు. ఏడాది ఆరంభంలో ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా.. ఏడాది ఆఖర్లో ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్లో టీమ్ ఇండియాకు తీరని వేదన మిగిల్చింది.

నవతెలంగాణ-అహ్మదాబాద్

ఆతిథ్య భారత్ ఆశలు ఆవిరి. 2023 ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 241 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన ఆస్ట్రేలియా రికార్డు ఆరో వరల్డ్‌కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (137, 120 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్సులు) సెంచరీతో చెలరేగగా, మార్నస్ లబుషేన్ (58 నాటౌట్, 110 బంతుల్లో 4 ఫోర్లు) అజేయ అర్థ సెంచరీతో సమయోచిత ఇన్నింగ్స్ నమోదు చేశాడు. హెడ్, లబుషేన్ నాల్గో వికెట్‌కు 192 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. 43 ఓవర్లలోనే ఆస్ట్రేలియాకు విజయాన్ని కట్టబెట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 240 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్ (66, 107 బంతుల్లో 1 ఫోర్), విరాట్ కోహ్లి (54, 63 బంతుల్లో 4 ఫోర్లు), రోహిత్ శర్మ (47, 31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) రాణించారు. ఛేదనలో మెరుపు సెంచరీతో విశ్వరూపం చూపించిన ట్రావిశ్ హెడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



ట్రావిశ్ హెడ్ అదుర్స్

ఛేదనలో ఆసీస్‌కు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. డెవిడ్ వార్నర్ (7), మిచెల్ మార్ష్ (15), స్టీవ్ స్మిత్ (4)లు బుమ్రా, షమి దెబ్బకు పెవిలియన్‌కు చేరారు. 47/3తో ఆస్ట్రేలియా ఒత్తిడిలో పడింది. కానీ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ మరో ఎండ్‌లో ధ్వంస రచన సాగించాడు. సహజ శైలికి విరుద్ధంగా పవర్‌ప్లేలో కాస్త నెమ్మదించిన హెడ్.. ఆ తర్వాత విరుచుకు పడ్డాడు. స్పిన్నర్లు జడేజా, కుల్దీప్‌లపై భారీ షాట్లు ఆడాడు. పరుగుల రాకతో ఆసీస్ శిబిరం తేలికపడింది. మార్నస్ లబుషేన్ మరో ఎండ్ నుంచి హెడ్‌కు చక్కటి సహకారం అందించాడు. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ భారత బౌలర్ల ఉత్సాహాన్ని నీరుగార్చాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో హెడ్ అర్థ సెంచరీ సాధించగా.. 14 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 95 బంతుల్లోనే శతకం అందుకున్నాడు. మార్నస్ లబుషేన్ మూడు ఫోర్ల అండతో 99 బంతుల్లో అర్థ సెంచరీ చేశాడు. మిడిల్ ఓవర్లలో మంచు ప్రభావంతో భారత బౌలర్లు తేలిపోగా.. హెడ్, లబుషేన్ పరుగులు పిండుకున్నారు. ఈ జోడీని విడదీయటంలో విఫలమైన భారత్.. ప్రపంచకప్ టైటిల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఆఖర్లో గ్లెన్ మాక్స్‌వెల్ (2 నాటౌట్) గెలుపు పరుగులతో ఆసీస్ శిబిరంలో సంబురాలకు తెరతీశాడు.

మెరిసిన ఆ ముగ్గురు

టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఫైనల్లో ఆతిథ్య టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. కెప్టెన్ రోహిత్ శర్మ (47) తనదైన దూకుడుతో ఇన్నింగ్స్‌ను మొదలెట్టాడు. ఆసీస్ ఫీల్డర్లు బౌండరీలు నిలువరించినా.. రోహిత్ శర్మ దంచికొట్టాడు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో ఆసీస్ శిబిరంలో గుబులు పుట్టించాడు. ఓ ఎండ్‌లో గిల్ (4)



తడబాటుకు గురైనా రోహిత్ మాత్రం అలవోకగా బౌండరీలు బాదాడు. ఆరంభంలోనే స్లిప్స్‌లో జీవనదానం పొందిన గిల్.. అవకాశం వృథా చేసుకున్నాడు. మిచెల్ స్టార్క్ వేసిన షార్ట్ బాల్‌కు సర్కిల్ లోపలే క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. మాక్స్‌వెల్‌పై భారీ సిక్సర్‌తో అర్థ సెంచరీ ముంగిట నిలిచిన రోహిత్ శర్మ.. అదే ఓవర్లో ట్రావిశ్ హెడ్ కండ్లుచెదిరే క్యాచ్‌తో పెవిలియన్‌కు చేరాడు. దీంతో పవర్‌ప్లేలోనే టీమ్ ఇండియా ఓపెనర్లు ఇద్దరినీ కోల్పోయింది. రోహిత్ శర్మ దూకుడుతో పవర్‌ప్లేలో టీమ్ ఇండియా దండిగా పరుగులు చేసింది. తొలి పది ఓవర్లలో భారత్ 80/2తో నిలిచింది.

స్లో పిచ్‌పై పవర్‌ప్లే తర్వాత భారత్‌కు పెద్దగా కలిసిరాలేదు. ఫామ్‌లో ఉన్న బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ (4) నిష్క్రమణతో టీమ్ ఇండియా శిబిరం ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో విరాట్ కోహ్లి (54), కెఎల్ రాహుల్ (66) భారత్‌కు మంచి స్కోరు అందించారు. పరుగుల వేట కష్టమైన దశలో వికెట్ నిలుపుకుని ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. పవర్‌ప్లే అనంతరం ఏకంగా 97 బంతుల పాటు బౌండరీ రాకపోవటంతో స్కోరు బోర్డు పిచ్ కంటే ఎక్కువగా నెమ్మదించగా.. ఆసీస్ బౌలర్లలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. క్రీజులో కుదురుకున్న విరాట్ కోహ్లి నాలుగు బౌండరీలతో 56 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. కమిన్స్ ఓవర్లో బంతిని వికెట్లపైకి ఆడుకున్న కోహ్లి అనూహ్యంగా నిష్క్రమించి అభిమానుల్లో నైరాశ్యం నింపాడు. కోహ్లి నిష్క్రమణ తర్వాత రాహుల్ మరింత నెమ్మదించాడు. ఓ ఫోర్‌తో 86 బంతుల్లో అర్థ సెంచరీ సాధించినా.. మరో ఎండ్‌లో రవీంద్ర జడేజా (9) నిరాశపరిచాడు. సూర్యకుమార్ యాదవ్ (18)కు స్లో బౌన్సర్లతో పరీక్ష పెట్టిన ఆసీస్ ఆ దిశగా విజయవంతమైంది. టెయిలెండర్లలో కుల్దీప్ యాదవ్ (10), మహ్మద్ సిరాజ్ (9 నాటౌట్) ఆకట్టుకున్నారు. 50 ఓవర్లలో ఆలౌటైన భారత్ 240 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు పడగొట్టగా. జోశ్ హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్ రెండేసి వికెట్లు తీశాడు. స్పిన్నర్లు గ్లెన్ మాక్స్‌వెల్, ఆడం జంపా పరుగుల పొదుపుతో చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) హెడ్ (బి) మాక్స్‌వెల్ 47, శుభ్‌మన్ గిల్ (సి) జంపా (బి) స్టార్క్ 4, విరాట్ కోహ్లి (బి) కమిన్స్ 54, శ్రేయస్ అయ్యర్ (సి) ఇంగ్లిశ్ (బి) కమిన్స్ 4, కెఎల్ రాహుల్ (సి) ఇంగ్లిశ్ (బి) స్టార్క్ 66, రవీంద్ర జడేజా (సి) ఇంగ్లిశ్ (బి) హేజిల్‌వుడ్ 9, సూర్యకుమార్ యాదవ్ (సి) ఇంగ్లిశ్ (బి) హేజిల్‌వుడ్ 18, మహ్మద్ షమి (సి) ఇంగ్లిశ్ (బి) స్టార్క్ 6, జశ్‌ప్రీత్ బుమ్రా (ఎల్బీ) జంపా 1, కుల్దీప్ యాదవ్ రనౌట్ 10, మహ్మద్ సిరాజ్ నాటౌట్ 9, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం : (50 ఓవర్లలో ఆలౌట్) 240.**

వికెట్ల పతనం : 1-30, 2-76, 3-81, 4-148, 5-178, 6-203, 7-211, 8-214, 9-226, 10-240.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 10-0-55-3, జోశ్ హేజిల్‌వుడ్ 10-0-60-2, గ్లెన్ మాక్స్‌వెల్ 6-0-35-1, పాట్ కమిన్స్ 10-0-34-2, ఆడం జంపా 10-0-44-1, మిచెల్ మార్ష్ 2-0-5-0, ట్రావిశ్ హెడ్ 2-0-4-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : డెవిడ్ వార్నర్ (సి) కోహ్లి (బి) షమి 7, ట్రావిశ్ హెడ్ (సి) గిల్ (బి) సిరాజ్ 137, మిచెల్ మార్ష్ (సి) రాహుల్ (బి) బుమ్రా 15, స్టీవ్ స్మిత్ (ఎల్బీ) బుమ్రా 4, మార్నస్ లబుషేన్ నాటౌట్ 58, గ్లెన్ మాక్స్‌వెల్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 18, **మొత్తం : (43 ఓవర్లలో 4 వికెట్లకు) 241.**

వికెట్ల పతనం : 1-16, 2-41, 3-47.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 9-2-43-2, మహ్మద్ షమి 7-1-47-1, రవీంద్ర జడేజా 10-0-43-0, కుల్దీప్ యాదవ్ 10-0-56-0, మహ్మద్ సిరాజ్ 7-0-45-1.

2023లో 2003 రిపీట్

ఈసారి ప్రపంచకప్ వేట మునుపటి లెక్క ఉండదు. ఇదీ మెగా ఫైట్ ముంగిట టీమ్ ఇండియా మాట. ప్రపంచకప్‌లో సెమీఫైనల్ ఎవరూ ఎటువంటి పొరపాటు చేయని రోహిత్‌సేన.. బలహీనతే లేని జట్టుగా ఫైనల్లోకి అడుగుపెట్టింది. 2003 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ ఒత్తిడికి లోనై టైటిల్‌ను ఆస్ట్రేలియాకు కోల్పోయింది. 2023 ఫైనల్లో మనోళ్లు ఒత్తిడికి గురి చేస్తారే కానీ ఒత్తిడి ట్రాప్‌లో పడరు అనే బలమైన నమ్మకం అహ్మదాబాద్‌లో గాలి బుడగలా పేలింది. 2003 ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా.. రికీ పాంటింగ్ (140 నాటౌట్), డామిన్ మార్టిన్ (88 నాటౌట్) ఇన్నింగ్స్‌లతో భారీ స్కోరు నమోదు చేసింది. ఛేదనలో గంగూలీ సేనపై ఒత్తిడి పెంచింది. ఆ పని టీమ్ ఇండియా ఆదివారం చేయలేదు. స్లో పిచ్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 240 పరుగులే చేసింది. సెమీస్ సహా గ్రూప్ దశలో సవాల్‌తో కూడిన లక్ష్యాలను ఛేదించిన అనుభవం ఆస్ట్రేలియా సొంతం. టైటిల్ పోరులో ఈ సవాల్ ఆసీస్‌కు కొత్త కాదు. అందుకే ఆరంభంలోనే 3 వికెట్లు పడినా.. డ్యాషింగ్ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ దూకుడు ట్రాక్ వీడలేదు. మిడిల్ ఓవర్లలో బౌండరీలతో దండెత్తాడు. భారత బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. ప్రపంచకప్‌ను మళ్లీ ఆస్ట్రేలియాకు తీసుకెళ్లాడు. 2003 పరాజయానికి 2023లో ప్రతీకారం తీర్చుకోవాలని ఆశించిన టీమ్ ఇండియా.. మళ్లీ భంగపడింది. ప్రపంచకప్ టైటిల్ ముంగిట ఆఖరు మెట్టుపై చతికిల పడింది. వందకోట్ల భారత అభిమానులకు తీరని వేదన మిగిల్చింది.



పవర్ కట్!

స్లో పిచ్. పరుగులు సులువుగా రావు. క్రీజులో నిలబడి చెమటోడ్చాలి. అప్పుడే మంచి స్కోరు సాధ్యం. ఇవేవీ టీమ్ ఇండియాకు తెలియనిది కాదు. ప్రపంచకప్‌లో తొలి పది మ్యాచుల్లో అమలు చేసిన వ్యూహమే ఫైనల్లోనూ అనుసరించారు. ఆరంభంలో రోహిత్ శర్మ దంచికొడ్తే.. ఆ తర్వాత ఆఖరు వరకు ఇన్నింగ్స్ బాధ్యత కోహ్లి చూసుకోవాలి. రోహిత్ శర్మ పవర్‌ప్లేలో దండయాత్ర చేశాడు. రోహిత్ దెబ్బకు తొలి పది ఓవర్లలో భారత్ 80 పరుగులు పిండుకుంది. కానీ ఆ తర్వాత ప్రణాళికే అనుకున్నట్టు సాగలేదు. ఐదు వికెట్లు చేతిలో ఉంచుకుని డెత్ ఓవర్లలోకి అడుగుపెట్టిన టీమ్ ఇండియా.. అక్కడా నిరాశపరిచింది. చివరి పది ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 43 పరుగులే చేసింది. ఇక 11-40 ఓవర్లలో 3 వికెట్లకు 117 పరుగులే చేసింది. తొలి పది ఓవర్లలో 80 పరుగులు సాధిస్తే.. ఆ తర్వాతి 40 ఓవర్లలో 180 పరుగులే వచ్చాయి. కెఎల్ రాహుల్, విరాట్ కోహ్లి వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. ఈ క్రమంలో 97 బంతుల వరకు ఒక్క బౌండరీ కూడా బాదకుండా అతి జాగ్రత్తతో కొంత నష్టం చేశారు!. ఆసీస్ మెరుపు ఫీల్డింగ్, ఒక్కో బ్యాటర్‌కు ప్రత్యేకించి ఫీల్డింగ్ మోహరింపులు సహా క్రమం తప్పకుండా బౌలింగ్‌లో మార్పులు కంగారూలకు బాగా పని చేశాయి. దీంతో పవర్‌ప్లే ముగియగానే టీమ్ ఇండియా ఆటలో పవర్ లేకుండా పోయింది.



నవచిత్రం

భర్తని భార్యే హత్య చేసిందా?




స్పందన పల్లి, యుగ్‌రామ్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా 'ది ట్రయల్'. ఈ సినిమాను ఎస్ఎస్ ఫిలింస్, కామన్ మ్యాన్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ఫస్ట్ ఇంటరాగేటివ్ ఫిల్మ్‌గా దర్శకుడు రామ్ గన్ని రూపొందించారు. స్మృతి సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించారు. సుదర్శన్ రెడ్డి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ఈ సినిమాను ఈ నెల 24న థియేటర్స్ ద్వారా గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర ట్రైలర్‌ను హీరో శ్రీ విష్ణు విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మూవీ ట్రైలర్ చూశాను. చాలా ఇంట్రెస్టింగ్‌గా, ఎంగేజింగ్‌గా ఉంది. థ్రిల్లర్ జోనర్ సినిమా ఇది. డైరెక్టర్ రామ్ బాగా కథను డీల్ చేశారని ట్రైలర్‌తో తెలుస్తోంది. ఈ నెల 24న సినిమా థియేటర్స్‌లోకి వస్తోంది. ఈ సినిమా మీ అందరికీ తప్పకుండా నచ్చుతుందని ఆశిస్తున్నాను. టీమ్ అందరికీ ఈ సినిమా మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

సబ్ ఇన్‌స్పెక్టర్ మిసెస్ రూప, ఆమె భర్త అజయ్ వాళ్ళ మొదటి మ్యారేజ్ యానివర్సరీ ఒక అపార్ట్మెంట్ మేడపైన ఏకాంతంగా జరుపుకుంటున్నప్పుడు అనుకోని సమయంలో అజయ్ కాలు జారి బిల్డింగ్ పై నుంచి పడి చనిపోతాడు. ఇది మీడియాలో పెద్ద న్యూస్ అవుతుంది. పోలీసులు ఇన్వెస్టిగేషన్ ప్రారంభిస్తారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్.. రూప తన భర్తను చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తుందని అనుమానిస్తాడు. ఆమెను ఇంటరాగేట్ చేస్తాడు. రూప మాత్రం తన భర్తది ఆత్మహత్యేనని గట్టిగా చెబుతుంది. ఇంతకీ అజయ్‌ది హత్యా?, ఆత్మహత్యా?, హత్యే అయితే పోలీస్ ఆఫీసర్ అయిన రూప తన భర్తనే ఎందుకు చంపింది అనే అంశాలతో ట్రైలర్ ఆసక్తి కలిగించింది. ట్రైలర్ కలిగించిన క్యూరియాసిటీ థియేటర్స్‌కు ప్రేక్షకుల్ని రప్పిస్తుందని చిత్ర బృందం ఆశిస్తోంది. అలాగే ముఖ్యంగా స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటుల నటన చాలా అద్భుతంగా ఉంది. విజువల్స్ పరంగా శ్రీ సాయికుమార్ దార తన కెమెరా పనితనాన్ని చాలా అద్భుతంగా చూపించారు. అదే విధంగా ట్రైలర్‌లో వినిపించిన మ్యూజిక్‌ను మ్యూజిక్ డైరెక్టర్ శరవణ వాసుదేవన్ చాలా బాగా కంపోజ్ చేస్తూ సినిమాలో ఉండే నేపథ్య సంగీతంపై మరింత ఆసక్తిని పెంచారు. ఈ సినిమా ట్రైలర్‌కి ముఖ్యంగా ఎడిటింగ్ బాగా అనిపించింది అని చిత్రయూనిట్ తెలిపింది.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - శ్రీ సాయికుమార్ దారా, ఎడిటర్ - శ్రీకాంత్ పట్నాయక్. ఆర్, సంగీతం - శరవణ వాసుదేవన్, కో ప్రొడ్యూసర్ - సుదర్శన్ రెడ్డి, ప్రొడ్యూసర్స్ - స్మృతి సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ, కథ స్క్రీన్ ప్లే దర్శకత్వం - రామ్ గన్ని.



డిసెంబర్ 1న రిలీజ్

సుధీర్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కాలింగ్ సహస్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ పతాకాలపై అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సుధీర్ సరసన డాలీషా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 1న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'మా సినిమా అవుట్‌పుట్ బాగా వచ్చింది. సినిమాపై మంచి ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. రీసెంట్‌గా రిలీజ్ చేసిన రెండు పాటలు, టీజర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్‌ను రాబట్టుకున్నాయి. డిసెంబర్ 1న వరల్డ్ వైడ్‌గా ఈ చిత్రాన్ని గ్రాండ్ లెవల్లో రిలీజ్ చేస్తున్నాం. డైరెక్టర్ అరుణ్ సినిమాను తెరకెక్కించిన తీరు సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. సుధీర్‌కి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందరినీ అంచనాలను మించేలా సుధీర్‌ను సరికొత్త కోణంలో ప్రెజంట్ చేసేలా ఇందులో ఆయన క్యారెక్టర్ ఉంటుంది. అన్నీ ఎలిమెంట్స్ ఉన్న మూవీ ఇది. తప్పకుండా ప్రేక్షకులను మెప్పిస్తుందని భావిస్తున్నాం. మూవీ ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ని ఇస్తుంది' అని అన్నారు.

ఆనంద్ బయానా, శివబాలాజీ మనోహరన్, రవితేజ నన్నిమాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : మోహిత్ రెహమానియక్, బ్యాగ్రౌండ్ స్కోర్ : మార్క్ కె రాబిన్, సినిమాటోగ్రఫీ : సన్నిడి, ఎడిటర్ : గ్యారీ బి.హెచ్.

అత్యంత భయానక చిత్రం



'పిండం' చిత్రంలోని ఒక దృశ్యం

హర్రర్ జోనర్ చిత్రాల పట్ల ప్రేక్షకుల్లో ఎప్పుడూ మంచి ఆసక్తి ఉంటుంది. అయితే మన దగ్గర పూర్తిస్థాయి హర్రర్ చిత్రాలు రావడం చాలా అరుదు. కొన్ని చిత్రాలలో రొమాంటిక్ లేదా కామెడీ ట్రాక్‌ల వల్ల హర్రర్ మోతాదు తగ్గిపోతుంది. అలాంటి ట్రాక్‌ల జోలికి పోకుండా, కేవలం ప్రేక్షకులను భయపెట్టడమే లక్ష్యంగా తెలుగులో అసలు సిసలైన హర్రర్ చిత్రం రాబోతోంది.

హీరో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ సభ్యులు ఈ మూవీని చూసి థ్రిల్ అయ్యారు. ఈ మధ్య కాలంలో ఈస్థాయిలో భయపెట్టిన హర్రర్ చిత్రాన్ని చూడలేదని అభిప్రాయపడ్డారు. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు, తర్వాత ఏం జరుగుతుందన్న ఉత్కంఠను రేకెత్తిస్తూ అద్భుతంగా రూపొందించారని చిత్ర బృందాన్ని ప్రశంసించారు.

డిసెంబర్ 7న సాయంత్రం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక అత్యంత వైభవంగా జరగనుంది. ఈ వేడుకకు చిత్ర బృందంతో పాటు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరు కాబోతున్నారు. ఈ వేడుకను ఆద్యంతం ఆసక్తికరంగా, విభిన్న రీతిలో, సినిమాకు తగినట్లుగా సరికొత్త అనుభూతిని కలిగించేలా ప్లానింగ్ చేస్తున్నారు. హర్రర్ జోనర్ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్ర విడుదల తేదీని తాజాగా మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాని డిసెంబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ప్రేక్షకులను భయపెట్టడమే లక్ష్యంగా ఈ సినిమా ఓ కంప్లీట్ హర్రర్ చిత్రంగా రూపొందింది. ఇంతటి భయానక హర్రర్ చిత్రాన్ని టాలీవుడ్ ఇంతవరకూ చూడలేదని, ఒంటరిగా కూర్చొని ఈ సినిమాని చూడలేరని చిత్ర బృందం చెబుతోంది. నిలవనుంది.

ఈశ్వరీ రావు, అవసరాల శ్రీనివాస్, రవివర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ: సాయికిరణ్ దైదా, కవి సిద్ధార్థ, డీఓపీ: సతీష్ మనోహర్, సంగీతం: కృష్ణ సౌరభ్ సూరంపల్లి, ఆర్ట్: విష్ణు నాయర్, ఎడిటర్: శిరీష్ ప్రసాద్, పోరాటాలు: జష్వ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సురేష్ వర్మ.వి, లైన్ ప్రొడ్యూసర్ : శ్రీనివాస్ పెన్మత్స, సహ నిర్మాత: ప్రభు రాజా, సమర్పణ: ఆరోహి దైదా, నిర్మాత: యశ్వంత్ దగ్గుమాటి.

ఊహించని ట్విస్ట్ ఇస్తా..



హ్రితిక శ్రీనివాస్

ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం-1గా రూపొందిన చిత్రం 'సౌండ్ పార్టీ'. వీజే సన్నీ, హ్రితిక శ్రీనివాస్ జంటగా నటించారు. జయ శంకర్ సమర్పణలో సంజయ్ శేరి దర్శకత్వం వహించారు. రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలు. ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా ఈనెల 24న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలవుతోంది.

ఈ సందర్భంగా హీరోయిన్ హ్రితిక శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ, సీనియర్ నటి ఆమని మా అత్తయ్య అవటంతో చిన్నప్పుడు నుంచి సినిమాలపై ఆసక్తి ఉండేది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కొన్ని సినిమాల్లో నటించాను. హీరోయిన్‌గా 'అల్లంత దూరాన' తర్వాత నటించిన రెండవ చిత్రమిది. దర్శకుడు సంజయ్ కథ చెప్పినప్పుడు ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ఇదొక కంప్లీట్ ఫన్ ఎంటర్టైనర్. కామెడీతోపాటు కంటెంట్ కూడా ఉంది. ఇందులో నేను సిరి అనే పాత్రలో నటించాను. చాలా తెలివైన అమ్మాయి. సినిమాలో నా పాత్ర చాలా ఇంపార్టెంట్‌గా ఉంటుంది. క్రికెట్ టీమ్‌లో ధోనీలా నా పాత్ర ఉంటుందని డైరెక్టర్ అంటుంటారు. సినిమా క్లైమాక్స్‌లో ఎవరూ ఊహించని ట్విస్ట్ ఇస్తాను. లాస్ట్‌లో వచ్చి ధోని ఎలా సిక్స్‌లు కొడతారో అలా నా పాత్ర ఉందని చెప్పుకుంటారు. అమాయకులైన తండ్రీ కొడుకులు ఈజీ మనీ కోసం ఎలాంటి పనులు చేస్తారనేది ఈ సినిమా మెయిన్ కాన్సెప్ట్. ఇందులో బిట్ కాయిన్ గురించి కూడా ఉంటుంది. డైరెక్టర్ సంజయ్ రైటింగ్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఆయన కామెడీ టైమింగ్ చాలా బాగుంటుంది. మా నిర్మాతలు సినిమా కోసం ఎక్కడా రాజీపడలేదు' అని తెలిపారు.

ఫ్యామిలీ మొత్తం చూడాల్సిన సినిమా

తేజ్ బొమ్మదేవర, రిషికి లొక్రే జంటగా నటించిన సినిమా 'మాధవే మధుసూదన'. ఈ చిత్రాన్ని సాయి రత్న క్రియేషన్స్ బ్యానర్ పై బొమ్మదేవర రామచంద్ర రావు నిర్మిస్తూ, దర్శకత్వం వహించారు. బొమ్మదేవర శ్రీదేవి సమర్పిస్తున్నారు. ఈ నెల 24 ఈ సినిమా థియేటర్స్ ద్వారా రిలీజ్ కాబోతోంది.

ఈ సందర్భంగా మీడియాతో సుమన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను దర్శకుడు బొమ్మదేవర రామచంద్ర రావు చాలా క్లారిటీగా రూపొందించారు. ఏ సినిమా బాగా రావాలన్నా డైరెక్టర్, స్టోరీ, టెక్నీషియన్స్ కీలకం. ఈ సినిమాకు ఆ టీమ్ బాగా కుదిరింది. ఈ సినిమాతో బొమ్మదేవర రామచంద్ర రావు తన కొడుకు తేజ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నాడు. తను మంచి హీరో అవుతాడు. హీరోయిన్ పర్ఫార్మెన్స్ కూడా ఆకట్టుకుంటుంది. వికాస్ చేసిన పాటలు చాలా బాగుంటాయి. ఫ్యామిలీ అంతా కలిసి చూడాల్సిన సినిమా ఇది' అని తెలిపారు.



దర్శక, నిర్మాత బొమ్మదేవర రామచంద్రరావు మాట్లాడుతూ, 'నేను ఆశించినట్లే మా అబ్బాయి బాగా పర్ఫార్మ్ చేశాడు. మా సినిమాటోగ్రాఫర్ వాసు నేను అనుకున్నట్లుగా సీన్స్ తీశాడు. మ్యూజిక్ డైరెక్టర్ వికాస్ నాలుగు మంచి పాటలు ఇచ్చాడు. పాట సందర్భం తెలుసుకుని పర్ఫెక్ట్ గా ట్యూన్ చేశాడు. సినిమాలో ఎలాంటి వల్గారిటీ, డబుల్ మీనింగ్ డైలాగ్స్ ఉండవు. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది' అని అన్నారు.

'ఈ నెల 24న థియేటర్స్‌లోకి మా సినిమా వస్తోంది. మీరంతా ఫ్యామిలీతో కలిసి చూసి ఆదరిస్తారని కోరుకుంటున్నా. ఈ సినిమాతో ఒక మంచి ప్రయత్నం చేశాం. ఆ ప్రయత్నానికి మీ ఆదరణ లభిస్తుందని కోరుకుంటున్నా' అని హీరో తేజ్ బొమ్మదేవర చెప్పారు.

ఆరోగ్యానికి మేలు...



ఉరుకుల పరుగుల జీవితంలో ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయి. దాని వల్ల చాలా మంది చిన్న వయసులోనే అధిక బరువు సమస్యతో బాధ పడుతున్నారు. మనం వాడే బియ్యం, చపాతీల్లో అధిక కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు ఉంటాయి. వాటితో పాటు మన కూరల్లోనూ కొవ్వు ఎక్కువే. ఈ కొవ్వు పదార్థాలు ఆహారంలో క్యాలరీలను పెంచుతాయి. దాంతో బరువు పెరుగుతారు. అందుకే బరువు తగ్గేందుకు మీ ఆహారంలో వీటిని చేర్చండి.

- పసుపు, నల్ల మిరియాలు, లవంగం, జీలకర్ర, ఆవాలు మీ వంటకు మంచి రుచిని ఇవ్వడమే కాకుండా ఆరోగ్యకరమైన పోషకాలతో నిండి ఉంటాయి. సుగంధ ద్రవ్యాల్లో ఉన్న ఆరోగ్య ప్రయోజనాల వల్ల వీటిని మందుల తయారీలోనూ వాడుతారు. వీటిలో వుండే యాంటీ బాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి మనల్ని కాపాడతాయి. శరీరంలో ఉండే బ్యాక్టీరియాను తొలగిస్తాయి. అధిక బరువు తగ్గేందుకు ఇవి సాయపడతాయి.
- కూరలు మనకు ఆరోగ్యాన్ని ఇవ్వాలంటే సరిపడా కొవ్వునే వాడాలి. రిఫైన్డ్ నూనెకు బదులు నెయ్యి వాడండి. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వు ఉంటుంది. ఆరోగ్యకరమైన కొవ్వు మేలు చేసి అధిక బరువు సమస్య నుంచి తొందరగా బయటపడేలా చేస్తుంది.
- మనం చపాతీలను గోధుమపిండితో తయారు చేస్తాం. వీటిలో పిండిపదార్థాలు ఎక్కువ. అందువల్ల గోధుమకు బదులు జొన్నలు, సజ్జలు, రాగులు వంటి వాటిని వాడితే మేలు. వీటితో తయారు చేసిన చపాతీలలో ప్రోటీన్, ఫోలేట్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి.
- మనం ఇంట్లో చేసే చపాతీల నుంచి కూరల వరకు అన్నింట్లో ఆరోగ్యకరమైన పోషక పదార్థాలు ఉంటాయి. అందుకే ఇంటి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రాసెస్ చేసిన, ప్యాకింగ్ చేసిన, రెడీ టు ఈట్ ఆహారానికి దూరంగా ఉండాలి. దాన్ని ఎంత తగ్గిస్తే అంతగా బరువు తగ్గే అవకాశాలు పెరుగుతాయి.
- రోజూ ఒకే ఆహారాన్ని తీసుకోవడం ఎవరికైనా నచ్చదు. అందువల్ల కొంచెం వైవిధ్యమైన రుచి కోసం ప్రయత్నించండి. పోహా, ఇడ్లీ, సాబుదానా ఖిచి, ఉప్మా వంటి వాటిని తినండి. తద్వారా మీరు అధిక బరువు సమస్య నుంచి త్వరగా కోలుకుంటారు.

వీటిని ప్రయత్నించండి...

శరీరంలో కొవ్వు పేరుకుపోయి సమస్యతో సతమతమవుతుంటారు చాలా మంది. ఈ కొవ్వు కారణంగా అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. అందుకే ఈ కింది చిట్కాలు పాటిస్తే కొవ్వును కరిగించుకోవచ్చు. అవేంటో చూద్దాం.



- ఉదయం పరగడుపునే రెండు చెంచాల తేనెను గ్లాసు గోరు వెచ్చని నీటిలో బాగా కలిపి తాగాలి. ఇది పొట్ట దగ్గర కొవ్వును తగ్గించడానికి సహాయ పడుతుంది.
- ఒక గ్లాసు నీటిలో ఒక నిమ్మకాయ రసాన్ని పూర్తిగా పిండాలి. దీన్ని ఉదయాన్నే పర గడుపున తీసుకోవాలి. క్రమం తప్ప కుండా ఇలా చేస్తే కొవ్వు కరుగుతుంది.
- రెండు చెంచాల క్రాన్‌బెర్రీ జ్యూస్‌ను ఒక గ్లాసు నీటిలో కలిపి భోజనానికి ముందు తీసుకోవాలి. ఇలా చేస్తే తప్పక ఫలితం ఉంటుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అవిసె గింజెల పొడి ఓ చెంచా, తేనె ఓ చెంచా కలిపి ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకోబోయే ముందు తాగాలి. ఇది కూడా పొట్ట దగ్గర కొవ్వును బాగా తగ్గిస్తుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో నువ్వుల నూనె ఒక చెంచా, అల్లం రసం చెంచా మోతాదులో కలిపి రోజుకు రెండుసార్లు తీసుకోవాలి. ఇది పొట్ట దగ్గర పేరుకుపోయిన కొవ్వు తగ్గేందుకు ఇది సహకరిస్తుంది.
- గ్రీన్ టీ పొడి చెంచా, నిమ్మరసం పావు చెంచా, తేనె రెండు చెంచాల మోతాదులో తీసుకుని ఒక గ్లాసు నీటిలో కలపాలి. మూడు నిమిషాల పాటు బాగా కలిపాలి. దీన్ని రోజుకి రెండు సార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

అవగాహన పెంచుకోండి

ఇంట్లో వారందరి బాగు కోరుకోవడమే కాదు.. ఎవరికి ఏ అవసరమొచ్చినా తీర్చడానికి ముందుకొస్తాం. ఎలాంటి ఆర్థిక ఇబ్బంది వచ్చినా గుట్టు చప్పుడు కాకుండా పిల్లల కడుపు నింపేందుకు అనేక తంటాలు పడతాం. మరి మన బాధ్యతలన్నీ సమర్థంగా నిర్వహించడానికి అవసరమయ్యే ఆర్థిక శక్తిని సమకూర్చు కోవల్సిన అవసరం మనపై వుంది. అప్పుడే మన కుటుంబానికీ, మనకీ భరోసా. మరి దాని కోసం ఏం చేయాలో తెలుసుకుందాం...

కొంతమంది మహిళలు తమ వ్యక్తిగత, కుటుంబ పరిస్థితుల రీత్యా అప్పటిదాకా తాము చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేస్తుంటారు. మరికొంతమంది సంపాదించాల్సిన అవసరం లేదంటూ ఈ నిర్ణయం తీసుకుంటుంటారు. ఈ రెండూ ఆర్థికంగా చేటు చేసే నిర్ణయాలే అంటున్నారు నిపుణులు. తద్వారా మొదట్లో బాగానే ఉన్నా భవిష్యత్తులో ప్రతి చిన్న అవసరానికీ భర్త మీదే ఆధారపడాల్సి వస్తుంది. కాబట్టి పెళ్లైనా ఉద్యోగం మానకపోవడమే ఉత్తమం. తద్వారా భవిష్యత్తులో ఒంటరిగా జీవించాల్సి వచ్చినా ఆర్థికంగా ఇబ్బందులు ఉండవు.

పెట్టుబడులు పెట్టాలి?

ఆర్థిక విషయాల్లో పెళ్లి కాక ముందు తండ్రిపై, పెళ్లయ్యాక భర్తపై ఆధారపడే అమ్మాయిలు ఈ కాలంలోనూ కొందరున్నారు. ఆర్జన వరకు బాగానే ఉన్నా డబ్బు పొదుపు-మదుపు విషయాల్లో అవగాహన లోపమే ఇందుకు కారణం. అయితే ఇలా ప్రతి చిన్న దానికీ వారిపైనే ఆధారపడడం వల్ల వాళ్లు అందుబాటులో లేనప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుంది. కాబట్టి డబ్బుల్ని ఎందులో పొదుపు చేయాలి? లాభాలు ఆర్జించాలంటే వేటిలో పెట్టుబడులు పెట్టాలి? వంటి ప్రాథమిక విషయాలపై అవగాహన పెంచుకోవడం అత్యవసరం అంటున్నారు నిపుణులు. అలాగని ఒకేసారి అన్ని విషయాల గురించి తెలుసుకోవడం ఎవరి వల్లా సాధ్యం కాదు. కాబట్టి నిపుణుల సలహాలు పాటిస్తూ ఒక్కో విషయాన్ని ఒంట బట్టించుకుంటే ఆర్థిక విషయాల్లో మరొకరిపై ఆధారపడాల్సిన పరిస్థితి రాదు.

మీకోసం కూడా..

'ఏ అవసరానికైనా వస్తుంది' అని కిచెన్ డబ్బాలోనో, చీరల మాటునో డబ్బు దాస్తుంటారు చాలా మంది మహిళలు. ఇంట్లో ఎవరడిగినా తాము దాచుకున్న డబ్బును తీసిస్తుంటారు. మరి మీ సంగతేంటి? ఉద్యోగినులైతే.. వెంటనే డీమ్యాట్ ఖాతా ప్రారంభించండి. డెట్ మ్యూచువల్ ఫండ్లలో కొంత మొత్తం మదుపు చేసి, నెలనెలా డబ్బులు వెనక్కి వచ్చేలా చూసుకోవచ్చు. లేదా ఈక్విటీ ఫండ్ డివిడెండ్ ప్లాన్లలో మదుపు చేయొచ్చు. గృహిణులకు వీటి గురించి పెద్దగా అవగాహన ఉండదు. అందుకే ఎప్పుడైనా కొంత మొత్తం చేతికి అందినప్పుడు బ్యాంకులో నాన్ క్యుములేటివ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే నెలనెలా వడ్డీ పొందవచ్చు. కాస్త పెద్దవాళ్లయితే పోస్టాఫీసులో సీనియర్ సిటిజన్ పొదుపు ఖాతానో, నెలవారీ ఆదాయ పథకం(ఎంఐఎస్)నో ఎంచుకోవచ్చు. నెలనెలా డబ్బులు





ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా డెట్ ఫండ్లలో మదుపు చేసి, ఆదాయం వచ్చేలా ఏర్పాటు చేసుకోండి. దీనికోసం బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ సహాయం తీసుకోవచ్చు. ఇది మళ్లీ మీరు ఉద్యోగంలో చేరేంత వరకూ మీకు ఆర్థిక భరోసానిస్తుంది.

ఒంటరిగా జీవిస్తుంటే...

కారణాలు ఏమైనా ఇప్పుడు ఒంటరి తల్లుల సంఖ్యా బాగా పెరుగుతోంది. పిల్లల ఆర్థిక అవసరాలను తీర్చడంతోపాటు, తమ ఆర్థిక రక్షణ గురించి కూడా అలాంటి మహిళలు తప్పక ఆలోచించుకోవాలి. అందుకే మీ పేరిట జీవిత బీమా పాలసీ తీసుకోండి. ఇంకా పిల్లలతో కలిసి ఫ్యామిలీ ఫ్లోటర్ ఆరోగ్య



మదుపు చేసే వీలుంటే.. మ్యూచువల్ ఫండ్లలో సిప్, బ్యాంకులో రికరింగ్ డిపాజిట్ చేసినా మంచిదే. ఆరోగ్య బీమా పాలసీని తీసుకోండి. మహిళల ప్రత్యేక అవసరాల దృష్ట్యా బీమా సంస్థలు వారి కోసం ప్రత్యేక ఆరోగ్య పాలసీలు అందుబాటులోకి తెచ్చాయి. వాటిల్లో గృహిణుల కోసం తెచ్చిన సరళ్ జీవన్ బీమా పాలసీ ఒకటి. దాన్ని ప్రయత్నించొచ్చు.

తల్లి కాబోతుంటే...

అమ్మ కాబోతున్న సమయంలో మహిళలకు ఎన్నెన్నో భావోద్వేగాలు. పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ప్రణాళికలు. కొత్తగా వచ్చే ఖర్చులు ఒకవైతే.. ఇంటి బాధ్యతల దృష్ట్యా కొందరు మహిళలకు కెరియర్ త్యాగం చేయక తప్పని పరిస్థితి. ఆదాయం ఒక్కసారిగా ఆగిపోతే.. ఆర్థికంగా భర్తపై ఆధారపడాల్సి వస్తుంది. అంటే ఆర్థిక స్వేచ్ఛ కరవైనట్లే. అందుకే దానికి సిద్ధమవ్వాలి. అప్పటి వరకూ మీ దగ్గరున్న మొత్తాన్ని ఏదైనా

బీమా పాలసీ కచ్చితంగా ఉండాలి. కనీసం ఆరు నెలల ఖర్చులను అత్యవసర నిధిగా అందుబాటులో ఉంచుకోవాలి. క్రమానుగత పెట్టుబడి విధానంలో సాధ్యమైనంత మొత్తాన్ని మదుపు చేసేందుకు ప్రయత్నించాలి. పిల్లలతోపాటు మీ భవిష్యత్తు గురించీ ఆలోచించాలి. మదుపులో మీ పదవీ విరమణ ప్రణాళికలకీ ప్రాముఖ్యం ఇవ్వాలి. ఆదాయం ఆగిపోయిన రోజున మీకంటూ భరోసా కల్పించే ఏర్పాటు చాలా అవసరం. అలాగే వీలునామా రాయడం, ప్రతి పెట్టుబడి పథకంలో కచ్చితంగా పిల్లలను నామినీగా చేర్పించడం మర్చిపోవద్దు.

ఈ సూత్రం పాటించండి..

ఆర్జించే తల్లులై ఇంటి బాధ్యత పంచుకోవడం తప్పనిసరి అయితే 40:30:30 సూత్రాన్ని పాటించండి. అంటే మీ ఆదాయంలో 40 శాతాన్ని ఇంటి ఖర్చులకు ఇవ్వండి. 30 శాతాన్ని మీ అవసరాలకు కేటాయించుకోండి. మిగిలిన 30 శాతాన్ని మీ పదవీ విరమణానంతర అవసరాల కోసం వివిధ పథకాల్లో మదుపు చేయండి. ఇందులో కొంత మొత్తాన్ని గోల్డ్ ఈటీఎఫ్‌లు, సార్వభౌమ పసిడి బాండ్లలో పెట్టుబడి పెడితే ఉపయోగకరంగా ఉంటుంది.

అడుగడుగునా అన్యాయమే..



(మొదటిపేజీ తరువాయి)

ఫ్యాక్షనిజం గుండాయిజానికి తావు లేదన్నారు. ప్రజలు వజ్రాయుధమైన ఓటును దుర్వినియోగం చేసుకోరాదని పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో దోపిడీ, రైతాంగ సమస్యలు, పాలమూరు వలసలు, సాగునీటి వంటి సమస్యలను ఏ పార్టీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలకు అతి సమీపంలో కృష్ణ తుంగభద్ర నదులు ఉన్నప్పటికీ సాగు తాగునీరుకు నోచుకోకపోవడం పాలకుల వైఫల్యమే అని గుర్తు చేశారు. తొమ్మిదేండ్ల క్రితం తెలంగాణ ప్రాంత దుస్థితిని ఆ తర్వాత జరిగిన అభివృద్ధిని ఒకసారి పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. 55 ఏండ్ల గోసల తర్వాత వచ్చిన తెలంగాణలో ప్రాజెక్టులను పూర్తిచేసుకుని.. సాగు, తాగునీరు కల్పించిన ఘన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాల వల్లే తెలంగాణలోని బోయలు బీసీలుగా ఉన్నారని, ఈసారి ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బోయలను ఎస్టీల్లో చేర్చుతానని హామీ ఇచ్చారు. ఆర్డీఎస్ దుస్థితి వల్లనే తుమ్మిలను పూర్తి చేసి 35,000 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ పూర్తి చేయడమే గాక చిన్నోని పెళ్లి ఎత్తిపోతలను పూర్తి చేశామన్నారు. అలంపూర్‌లో 100 పడకల ఆస్పత్రితో పాటు ఇతర పనులను మిషన్ కాకతీయ ద్వారా పూర్తి చేసుకుందామన్నారు. పక్క రాష్ట్రం కర్నాటకలో అమలు చేయలేని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. ధరణి తొలగిస్తే రైతుబంధు వంటి అనేక పథకాలు రైతుల ఖాతాలో ఎలా జమ చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి పథకాలు సంపూర్ణంగా అమలు కావాలంటే మరోసారి బీఆర్ఎస్ గెలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి నిరంజన్ రెడ్డి, ఎంపీ రాములు, , అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బీరం హర్షవర్ధన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి జనార్దన్ రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్ యాదవ్, నాయకులు జక్క రఘునందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేస్తాం..తగ్గిస్తాం..వాదిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

ఇష్టానుసారంగా పెరిగిపోతున్నాయి. చమురు ఉత్పత్తులపై రూ.10 లోపు ఉన్న ఎక్సైజ్ డ్యూటీని మోడీ సర్కారు రూ.32కిపైగా పెంచింది. అంతర్జాతీయంగా చమురు ధరలు తక్కువ ఉన్నప్పటికీ రోజురోజుకీ ధరలు పెరగడానికి కేంద్రమే కారణం. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఇప్పుడు డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్టేనన్న విమర్శ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నది. రిజర్వేషన్ల అంశంలోనూ ప్రజల మధ్య చీలిక తెచ్చి లబ్ది పొందాలనే తాపత్రయమే కనిపించింది. దానికి తోడు భావోద్వేగభరితమైన అంశాలను పొందుపర్చింది. మతపరమైన విభజన ఎజెండాకు బీజేపీ మొదటి నుంచీ ప్రాధాన్యత ఇస్తున్నది. ముస్లిముల్లోని వెనుకబడిన తరగతుల వారి రిజర్వేషన్లు ఎత్తివేత, వృద్ధులకు ఉచితంగా అయోధ్య, కాశీయాత్ర, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లిం మధ్య జరిగినదిగా చూపెట్టేలా పొందుపర్చిన అంశాలు దీన్ని బలపరిచేలా ఉన్నాయి. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మతరిజర్వేషన్లు తెలంగాణలో అమలవుతున్నాయి..దాన్ని తీసేస్తాం అని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యతిరేకమే అయితే, పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దాన్ని ఎందుకు రద్దు చేయలేదనే చర్చ మొదలైంది. పారదర్శకమైన పాలన అందిస్తామంటున్న కేంద్రం తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలకే పరిమితం కావడం తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే విమర్శ బలంగా వినిపిస్తున్నది. అంతిమంగా బీజేపీ అట్టహాసంగా ప్రకటించిన మ్యానిఫెస్టోలో ఎక్కడా స్పష్టత లేదనే విమర్శ రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నది.

అధికారమిస్తే అభివృద్ధి చూపిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరాగాంధీ చేసిన మంచి పనులే ఇప్పటికీ ప్రజల మదిలో ఉండేలా చేశాయని గుర్తుచేశారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను కాంగ్రెస్ పార్టీ అంతే బాధ్యతతో నిర్వర్తించిందన్నారు. ఆదివాసీ, గిరిజనుల సంక్షేమానికి ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని చెప్పారు. ఆమె మరణించి 40 ఏండ్లు అయినా ఇంకా ఆరాధించడం పట్ల సంతోషం వెలిబుచ్చారు. జంగ్, జంగల్, జమీన్ సంస్కృతి ఆదివాసీ సంస్కృతి అని, ఇది ప్రపంచంలో అత్యున్నతమైన సంస్కృతి అని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు చూసి ఆనాడు కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని.. కానీ ఏ ఉద్దేశంతో ఇచ్చిందో ఆ లక్ష్యం నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగుల సమస్యలు తీరలేదని.. కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని విమర్శించారు.

కేసీఆర్, కేటీఆర్‌కు ఉద్యోగాలు ఇవ్వకండి

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. మీరు మాత్రం కేసీఆర్, కేటీఆర్‌లకు ఉద్యోగాలు ఇవ్వకూడదని సూచించారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో తొమ్మిదేండ్లుగా ప్రజలను మోసం చేశారన్నారు. ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చి కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై మాట్లాడలేదని.. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేనని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగాయని, ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేననే విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు.

అధికారంలోకి రాగానే రుణమాఫీ

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. కచ్చితంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ఉద్యమకారుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని, రూ.10లక్షల ఇన్సూరెన్సుతో యువవికాసం పథకాన్ని తీసుకొస్తామన్నారు. ప్రతి జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణం చేపడతామని, కర్నాటక తరహాలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, అభయహస్తం కింద రూ.12లక్షలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను ఆదరించి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, కర్నాటక ఎమ్మెల్సీ ప్రకాష్‌రాథోడ్, రాజురా ఎమ్మెల్యే సుభాష్‌దోబే, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జబాలియా శరణార్థి శిబిరంపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రి నుంచి ప్రజలను భారీగా తరలిస్తున్నారు. రోగులు, ఆరోగ్య కార్యకర్తలు, శరణార్థులతో సహా 7,000 మందికి పైగా ప్రజలు ఇక్కడ ఉన్నారు. ప్రజలు గుంపులుగా బయటకు వెళ్తున్న దృశ్యాలను అంతర్జాతీయ మీడియా శనివారం విడుదల చేసింది. శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించింది.నాలుగో రోజు కూడా ఇజ్రాయెల్ సైన్యం ఆసుపత్రిలో మకాం వేసింది. 120 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉందని, నవజాత శిశువులు ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నారని హమాస్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే, ఇజ్రాయెల్ మాత్రం తాము తరలింపు ఉత్తర్వు జారీ చేయలేదని వాదిస్తోంది. ఇజ్రాయెల్ సైన్యం హమాస్ కేంద్రంగా ఉందని ఆరోపిస్తూ ఆసుపత్రిని పాక్షికంగా కూల్చివేస్తోంది.దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లోని హమద్ పట్టణంలో ఇజ్రాయెల్ బాంబు దాడిలో చిన్నారులతో సహా 28 మంది మరణించారు. గాజాలో ఇప్పటివరకు జరిగిన యుద్ధంలో మరణించిన వారి సంఖ్య 12,000 కు చేరుకుంది. గాజాలోని ఐక్యరాజ్య సమితి ఏజెన్సీలు శనివారం రఫా సరిహద్దు మీదుగా ఒక ట్రక్కు ఇంధనం అందిందని తెలిపాయి.

ఇజ్రాయెల్ లెబనాన్

దక్షిణ లెబనాన్‌లోని ఇజ్రాయెల్ అల్యూమినియం ప్లాంట్‌పై క్షిపణి దాడి చేసింది. నబాతిహ్ పట్టణంలోని ప్లాంట్‌పై శనివారం రెండుసార్లు దాడి జరిగింది. గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, లెబనీస్ సరిహద్దులో సాయుధ సమూహం హిజ్బుల్లాతో పోరాటం తీవ్రంగా ఉంది.గాయపడిన పాలస్తీనా చిన్నారులు అరబ్ ఎమిరేట్స్‌కు చేరుకున్నారు. ఇజ్రాయెల్ దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారులతో తొలి విమానం యూఏఈకి చేరుకుంది. గాజాలో గాయపడిన 1,000 మంది చిన్నారులకు చికిత్స అందించేందుకు యూఏఈ ముందుకొచ్చింది. దీని ప్రకారం, గాయపడిన పిల్లలు మరియు కుటుంబ సభ్యులతో సహా 15 మందితో కూడిన మొదటి విమానం అబుదాబికి చేరుకుంది. ఇందులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పిల్లలు కూడా ఉన్నారు.

బీజేపీ మ్యానిఫెస్టో ఎన్నికల జిమ్మిక్కు..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విడుదల చేసిన బీజేపీ మ్యానిఫెస్టో ఎన్నికల జిమ్మిక్కుగా ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వలేదని పేర్కొన్నారు. విభజన చట్టాన్ని అమలు చేయలేదని తెలిపారు. తీవ్ర ఆర్థిక దిగ్బంధానికి గురి చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అమిత్‌షా శనివారం ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు కావడం లేదని గుర్తుచేశారు. తెలంగాణలో అమలు చేస్తామని ప్రకటించడం ప్రజలను మోసగించడమేనని తెలిపారు. ఈ మ్యానిఫెస్టో ప్రజల్లో చీలిక తేవడంతో పాటు, సంక్షేమ పథకాలకు కోతకోసేదిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు దీన్ని గమనించి ఈ ఎన్నికల్లో మతోన్మాద, ప్రజా వ్యతిరేక బీజేపీని, దాని మిత్రపక్షాలను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. 2014లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కేంద్ర బీజేపీ ప్రకటించి, వాటికి ఎగనామం పెట్టిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న లక్షలాది ఖాళీలు నింపకుండా, ఇక్కడ ఉద్యోగాల భర్తీ చేస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉండి ద్రవ్యోల్బణాన్ని అరికట్టే అవకాశం ఉన్నప్పటికీ అరికట్టలేని బీజేపీ, రాష్ట్రంలో ఎలా అరికడుతుందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను పంపిణీ చేయకుండా ప్రాజెక్టులను ఆపిందని తెలిపారు. వ్యవసాయ రంగాన్నీ, వ్యవసాయ మార్కెట్లను కార్పొరేటీకరించాలని నాలుగు నల్లచట్టాలను తెచ్చిందని పేర్కొన్నారు. 23 వ్యవసాయ ఉత్పత్తులకు మాత్రమే అశాస్త్రీయ మద్దతు ధర నిర్ణయించి కార్పొరేట్ వ్యాపారులకు లక్షల కోట్ల లాభాలు ఆర్జించి పెడుతున్నదన్నారు. కానీ నేడు తెలంగాణలో వ్యవసాయానికి ఎరువులు, సబ్సిడీలు, ధాన్యానికి మద్దతు ధరలు అమలుచేస్తామని ప్రకటించడం హాస్యాస్పదని తెలిపారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్య సేకరణ చేయకుండా తెలంగాణ రైతాంగాన్ని ముంచి, ఇప్పుడు రాష్ట్రంలో క్వింటాల్‌కు రూ.3,100 ఇస్తామని చెబుతున్నదని తెలిపారు.

కేంద్రంలో పదేండ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ రూ.3,100లు మద్దతు ధరను ఎందుకు నిర్ణయించలేదు?అని ప్రశ్నించారు. గత ఎన్నికల సందర్భంగా ప్రకటించిన పసుపుబోర్డు ప్రకటన శిలాఫలకాలకే పరిమితమైందని గుర్తుచేశారు. దాన్ని టర్మరిక్ సిటీ చేస్తామంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. పార్లమెంటులో చిన్న సవరణ చేస్తే అమల్లోకి వచ్చే ఎస్సీ వర్గీకరణకు, ఇప్పుడు మళ్లీ కమిటీ వేస్తామనడం ఎన్నికల జిమ్మిక్కేనని విమర్శించారు. మైనారిటీలకు అమలవుతున్న రిజర్వేషన్లు ఎత్తివేస్తామంటే ఇది ప్రజల్లో చీలికకు ఉపయోగపడేదేతప్ప మరొకటి కాదని తెలిపారు. మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ, విద్యారంగంలో జ్యోతిష్యాన్ని, కర్మకాండ లాంటి పాఠ్యాంశాలను చేర్చి దేశ నాగరికతను వేల సంవత్సరాలు వెనక్కు తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని బీజేపీ ప్రకటించిన మోసపూరితమైన మ్యానిఫెస్టో తెలంగాణ అభివృద్ధికి ఏమాత్రం దోహదపడదని తమ్మినేని తెలిపారు.

కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎం

(మొదటిపేజీ తరువాయి)

మద్దతు ధర కల్పిస్తామని, ఎరువుల కోసం ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని చెప్పారు. మహిళా సంఘాలకు రూపాయి వడ్డీకే రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికలు బీజేపీకి, కుటుంబ పార్టీలకు మధ్య జరుగుతున్నాయని, ఇతర రాష్ట్రాల్లో లాగానే తెలంగాణలో కూడా బీజేపీ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతుందని అన్నారు. పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్‌ను కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తే, కేసీఆర్ ఆ ప్రయోజనం ప్రజలకు అందకుండా చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సీఎం కేసీఆర్‌కు ఏటీఎంల మారిందని అన్నారు. మియాపూర్‌లో కోట్ల భూ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సర్కారు భూములను అమ్మి అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. దళిత బంధు ఇచ్చి ఎమ్మెల్యేలు మొత్తం 30శాతం కమీషన్ తీసుకున్నారన్నారు. ఈ 30శాతం కమీషన్ ప్రభుత్వాన్ని ఈ నెల 30న సాగనంపాలన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. అక్కడ ఏ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. అక్కడ ఇచ్చిన ఒక్క గ్యారంటీని అమలు చేయలేదని, ఇక్కడ కూడా ఆరు గ్యారెంటీలు ఇస్తామని ఆ పార్టీ చెబుతుందని, వాటిని నమ్మవద్దని తెలిపారు. సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, సదానందరెడ్డి, కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, కో-కన్వీనర్ రమేష్, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్ రెడ్డి, కంజర్ల ప్రకాష్, చేవెళ్ల, వికారాబాద్, పరిగి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థులు కేఎస్ రత్నం, నవీన్ కుమార్, మారుతీ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పౌరుల కోసం ఆటలు




(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటున్నది. అయితే ప్రజలలో ఈ గేమ్స్‌ను ఒక ప్రచారసాధనంగా ప్రభుత్వం వినియోగించుకుంటున్నదని విమర్శ లు వినిపిస్తున్నాయి. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కింద సిటిజన్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ అయిన 'మైగవ్'.. జాతీయ ఆసక్తి ఉన్న థీమ్‌ల ఆధారంగా యూజర్ ఫ్రెండ్లీ గేమ్‌ల అభివృద్ధి కోసం ప్రతిపాదనలను ఆహ్వానించింది. "ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగంలో పెరుగుదల, ఆసక్తి స్థాయిని పరిగణనలోకి తీసుకుంటే, పౌరుల కోసం కొత్త మోడళ్లను రూపొందించే సమయం ఆసన్నమైంది" అని గత వారం విడుదల చేసిన రిక్వెస్ట్ ఫర్ ఎంపానెల్‌మెంట్(ఆర్ఎఫ్ఈ) పత్రం మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నది. ప్రజల అవగాహనను మెరుగుపరచడం, అభిప్రాయాన్ని తెలుసుకోవడం, నేర్చుకోవడం, సమాచార వ్యాప్తికి ఆటలు గొప్ప సాధనం అని అనేక పరిశోధన అధ్యయనాలు సూచిస్తున్నాయని వివరించింది. 2014లో ప్రధాని మోడీ ప్రారంభించిన 'మైగవ్' 3.41 కోట్ల కంటే ఎక్కువ నమోదిత వినియోగదారులను కలిగి ఉన్నది.

ఈ అంశాల పైనే గేమ్స్

యుద్ధవీరులు, స్వచ్ఛతా మిషన్, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ), నగర ప్రణాళిక, పట్టణ అభివృద్ధి, వాతావరణ మార్పు, గ్రామీణాభివృద్ధి, జాతీయ వ్యవసాయ విధానం, లైఫ్ (సుస్థిర భవిష్యత్తును నిర్మించడం), నా సంస్కృతి నా ప్రైడ్ వంటి "జాతీయ ఆసక్తికి సంబంధించిన థీమ్‌ల" ఆధారంగా ఈ గేమ్స్ రూపొందించబడతాయని తెలిసింది. క్రాస్‌వర్డ్, వర్డ్ సెర్చ్, నంబర్, తేడాను కనుగొనడం, లాజిక్ పజిల్స్ వంటి పజిల్ గేమ్‌లుగా వీటిని అభివృద్ధి చేయొచ్చని సమాచారం. అయితే, వీటిని అన్ని వయసుల పౌరులు, విద్యార్థులను ఆకర్షించడానికి ఉపయోగపడతాయని టెక్ నిపుణులు అంటున్నారు.





సాయుధ రైతాంగ పోరాట వారసత్వం మాది

ఇబ్రహీంపట్నంలో ఎర్రజెండా ఎగురవేస్తాం : సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు

నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యం: అభ్యర్థి పగడాల యాదయ్య



నవతెలంగాణ-మంచాల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వం తమదని, ఈ సారి ఎన్నికల్లో ఇబ్రహీంపట్నంలో తప్పకుండా ఎర్రజెండా ఎగురవేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య మంచాల మండలంలో ప్రచారం నిర్వహించారు.

మండలంలోని తిప్పాయిగూడ, చిత్తాపూర్, తాళ్ళపల్లిగూడ, లింగంపల్లి గ్రామాల్లో పార్టీ ప్రచారం కొనసాగింది. ఈ ప్రచారానికి డీజీ హాజరై మాట్లాడారు. ఇబ్రహీంపట్నం పోరాట వారసత్వం కలిగిన ప్రాంతమని, ఇక్కడ ఎర్రజెండా ఆధ్వర్యంలో వేల ఎకరాల భూమి పంపిణీ చేసినట్టు గుర్తు చేశారు. అంతేగాక సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలుగా పనిచేసిన కొండిగారి రాములు, మస్కు నర్సింహ.. అనేక అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. 15ఏండ్లుగా అసెంబ్లీలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఈప్రాంతం పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో వినిపించే వారే కరువయ్యారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం సీపీఐ(ఎం)తోనే సాధ్యం అన్నారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటేసి తమ పార్టీ అభ్యర్థి పగడాల యాదయ్యను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పూర్తిగా విఫలం అయ్యారన్నారు. ఆయనే మళ్లీ మరోసారి అవకాశం కోరడం విడ్డూరంగా ఉందన్నారు. తమకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగిల్ల శ్యామ్ సుందర్, జిల్లా నాయకులు కర్నాటి శ్రీనివాస్‌రెడ్డి, గొరెంకల నర్సింహ, కందుకూరి జగన్, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రామాలయాన్ని చుట్టుముట్టిన గోదావరి వరద

నాడు ఎరుపు మయం నేడు ముంపు భయం

కమ్యూనిస్టుల ఏలుబడిలో కరకట్టల నిర్మాణం.. సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు గెలిచిన సమయంలోనే గోదారి ముంపు బాధల నుంచి భద్రాద్రికి విముక్తి.. కుంజా బొజ్జి, సున్నం రాజయ్య 30 ఏండ్లకు పైగా ఎమ్మెల్యేలు ఉన్న సమయంలో కళకళలాడిన గోదావరి(గౌతమీ) తీరం నేడు కొద్దిపాటి వర్షానికే విలవిలాడుతోంది. నేటి పాలకుల నిర్లక్ష్యానికి తోడు పోలవరం ఎత్తు పెంచడంతో బ్యాక్‌వాటర్ ప్రభావం.. భద్రాద్రి నిత్యం వరద బురదలోనే కొట్టుమిట్టాడుతోంది.

కొద్దిపాటి వర్షానికే భద్రాద్రిలో భయం భయం..

- వర్షాకాలంలో నిరంతరం నీళ్లలోనే పట్టణం
- ప్రజల బాగోగులు పట్టని బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ : సీపీఐ(ఎం) ఎమ్మెల్యేల ఏలుబడిలోనే కరకట్ట నిర్మాణం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

శ్రీరాముడంటే తమకే దేవుడని.. రామభక్తి అంటే తమదేననే రీతిలో బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ వ్యవహారశైలి ఉంటుందని తెలిసిందే. మరి రాముడంటే అయోధ్యకే పరిమితమా? శ్రీరాముడు జానకీ సమేతంగా నడయాడిన భద్రాచలం బాగోగులు మోడీ అండ్ కోకు పట్టవా? ఒకవేళ పడితే పోలవరం ఎత్తుతో గోదారి ముంపులో భద్రాద్రి కొట్టుకుపోతున్నా ఎందుకు స్పందిం చరూ..! కేసీఆర్ హామీలే తప్ప ఆచరణ ఉండదా? రూ.వెయ్యి కోట్ల వాగ్దానం ఏమై నట్టు? పోలవరం ఎత్తుపెం చినా ఎందుకు స్పందిం చరూ? స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా ప్రశ్నిం చరే.. కమ్యూనిస్టులు చట్ట సభల్లో ఉన్నన్ని రోజుల్లో భద్రాద్రికి ఏనాడైనా ఇలాంటి దుస్థితి పట్టలేదే..! కుంజా బొజ్జి, సున్నం రాజయ్య లాంటి ఎమ్మెల్యేలు మళ్లీ కావాలంటే సీపీఐ(ఎం) అభ్యర్థి గెలుపుతోనే సాధ్యమనే మాట స్థానికంగా వినిపిస్తోంది.

వర్షాకాలం వస్తే ముంపు భయం..?

కేంద్ర, రాష్ట్రాలు గోదావరి ముంపుపై ఓ నిర్ణయాన్ని తీసుకోవడంలో తాత్సారం చేస్తుండటం పరివాహక వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. నదికి ఓవైపునున్న భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, మరోవైపున ఉన్న బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాలు వర్షాకాలం వస్తే విలవిలలాడుతున్నాయి. పోలవరం తిరుగు జలాల ప్రభావమే దీనికి కారణమని స్థానికులంటున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరంతో తెలంగాణలో ముంపు లేదని వాదిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ముంపు ఆధారాలను అందజేసినా కేంద్రం మాత్రం పట్టనట్టే ఉంటోంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రభుత్వాలు సైతం తెలంగాణకు ఈ విషయంలో మద్దతు ఇస్తున్నా.. కేంద్రం వైపు నుంచి సానుకూలత లేదు. గతేడాది వరదలకు భద్రాచలంలోని దాదాపు అన్ని కాలనీలు నీటిమయం అయ్యాయి. రామాలయ పరిసరాల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో తెప్పలపై ప్రయాణం చేసిన దృశ్యాలు కండ్లముందే కదలాడుతున్నాయి. వేలాది ఎకరాల్లో పంట చేలు నీటమునిగాయి. ఇండ్లు నేలమట్ట మయ్యాయి. జనజీవనం నెలల తరబడి స్తంభించింది. అయినా ప్రభుత్వాల వైపు నుంచి పైసా సహాయ సహకారం అందలేదు. భద్రాద్రి ఆలయ భవిష్యత్తుకు కూడా పోలవరం ఎత్తుతో ముప్పు తప్పదంటున్నా.. రామభక్తులమని చెప్పుకునే పార్టీలకు పట్టడం లేదనే విమర్శలున్నాయి.

సంయుక్త సర్వేపై నిర్లక్ష్యం..

పోలవరం ఎత్తుతో గోదావరి ముంపులో భద్రాచలం, దాని పరిసరాలు నామరూపాలు లేకుండా పోతాయని.. గతేడాది వరదలే దానికి ప్రత్యక్ష నిదర్శనంగా ఉన్నా కేంద్రం మాత్రం వివక్ష చూపుతోంది. పోలవరం ఎత్తు.. భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతం ముంపుపై తెలంగాణ, అటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మరోసారి సంయుక్త సర్వే చేపట్టాలని కేంద్ర జలసంఘం నిర్ణయించింది. కానీ అది ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

సీపీఐ(ఎం) గెలుపే పరిష్కారం..

రెండు తెలుగు ప్రభుత్వాలను సమన్వయం చేసి ఈ సమస్యను పరిష్కరించాల్సిన కేంద్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. భద్రాచలాన్ని ఆనుకుని ఉన్న ఐదు పంచాయతీలనైనా తెలంగాణకు ఇస్తే కొంత వరకు సమస్య పరిష్కారం అవుతుంది. దీనిపై ఆర్డినెన్స్ తీసుకురావాల్సిన కేంద్రం పట్టించుకోవడం లేదు. సంయుక్త సర్వే అంశాన్నీ సీడబ్ల్యూసీ నిర్లక్ష్యం చేస్తోంది. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి కారం పులయ్యను గెలిపిస్తే అసెంబ్లీలో పోరాడి ఈ సమస్యకు పరిష్కారం చూపుతారు.

- మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

మతోన్మాదంతో బీజేపీ.. అవినీతిలో బీఆర్ఎస్..

- గుండుగుత్తగా సీట్లు అమ్ముకుంటున్న కాంగ్రెస్ !
- పేదల పక్షాన నిలబడే సీపీఐ(ఎం) అభ్యర్థులకే ఓటేయ్యండి : పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్
- హుజూర్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-నేరేడుచర్ల

ఈ ఎన్నికల్లో మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న బీజేపీ.. అవినీతిలో మునిగిపోయిన బీఆర్ఎస్.. శాసనసభ సీట్లనే గుండుగుత్తగా అమ్ముకుంటున్న కాంగ్రెస్.. పోటీలో ఉండగా.. వారంతా సంపాదించిన డబ్బుతో ఓట్లు కొని మరోసారి అధికారంలోకి రావాలని యత్నిస్తున్నాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ అన్నారు. కాబట్టి పేదల పక్షాన నిలబడే సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లా నేరేడుచర్ల మండలంలోని మేడారం గ్రామంలో సిరికొండ శ్రీను అధ్యక్షతన నిర్వహించిన హుజూర్‌నగర్ సీపీఐ(ఎం) అభ్యర్థి మల్లులక్ష్మి ప్రచార యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల కోసం నిరంతరం శ్రమిస్తూ, వారి పక్షాన నిలబడే సీపీఐ(ఎం) అభ్యర్థులు రాష్ట్రంలో 19 నియోజకవర్గాల్లో పోటీలో ఉన్నారని తెలిపారు. తెలంగాణలో 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని చెబుతున్నారు.. కానీ మనం చీకటిలో మాట్లాడు తున్నామన్నారు. కేరళలో 24 గంటల నాణ్యమైన లో వోల్టేజీ లేని విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. కేరళలో ఎర్రజెండా ప్రభుత్వం పేదరికం లేకుండా చేయడంలో విజయవంతమైందన్నారు. విద్యా వైద్యం రంగాల్లో ఘననీయమైన పురోగతిని సాధించి దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉందని చెప్పారు. రాష్ట్రంలో 99 శాతం కుటుంబాలకు భూమి ఉందని, 94 శాతం ప్రజలకు ఇండ్లు ఉన్నాయని, మరో నాలుగు శాతం మంది పేదలకు రాబోయే మూడేండ్లలో ఇండ్లు నిర్మించే కార్యక్రమం చేస్తోందన్నారు. అలాంటి రాజకీయ ప్రత్యామ్నాయం రావాలంటే ఎర్రజెండా నాయకత్వంలో 19 మంది అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా శాసనసభకు పంపిస్తే పేదలపక్షాన పోరాడి వాణి వినిపించే అవకాశం ఉంటుందన్నారు. కేంద్రకమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ నియోజవర్గంలో కాంగ్రెస్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నుండి సైదిరెడ్డి ఇద్దరిలో ఏ ఒక్కరూ మల్లులక్ష్మికి పోటీపడగలరా అని ప్రశ్నించారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అరిబండి లక్ష్మీనారాయణ, జూలకంటి రంగారెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సాగర్, సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు, యాదగిరిరావు, ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ చరిత్రలో.. మొదటిసారి బరిలో 22 మంది అభ్యర్థులు



నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ చరిత్రలో శాసనసభ ఎన్నికల్లో 22 మంది అభ్యర్థులు పోటీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రధాన పార్టీల అభ్యర్థులకు స్వతంత్ర అభ్యర్థులు దడ పుట్టిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు తమకు అనుకూలమైన వారిని విత్‌డ్రా చేయించేందుకు శాయ శక్తుల్లా ప్రయత్నాలు చేశారు. బుజ్జగింపుల్లో సమయం దాటి పోవడంతో ఇద్దరు అభ్యర్థులు విత్‌డ్రా కోసం వెళ్లి కూడా వెనుదిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. నామినేషన్ల అనంతరం ప్రధాన పార్టీల నాయకులు తమను బుజ్జగిస్తారని ఆలోచించే ఎక్కువ మంది నామినేషన్లు వేసినట్టు తెలిసింది. తమ బలం ఏంటో ప్రజల మధ్య తేల్చుకుంటామని స్వతంత్ర అభ్యర్థులు చెబుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులను బుజ్జగించడానికి బదులు ప్రధాన పార్టీలు తమ మ్యానిఫెస్టోలను, పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. మరో ప్రయత్నంగా స్వతంత్ర అభ్యర్థుల ఓట్లను తమకు అనుకూలంగా మల్చుకునే విధంగా వ్యూహాలు పన్నుతున్నారు. ఓట్ల చీలికతో తమ ఓటు బ్యాంకును పదిలపర్చుకుంటే గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్‌లో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉంది. ఈసారి ఎన్నికల్లో చక్కెర పరిశ్రమ, నిమ్జ్ బాధితులు ప్రధాన ఎన్నికల ఎజెండాగా మారనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. జహీరాబాద్ ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో ఇక్కడ చెరకు ప్రధాన పంటగా పండిస్తారు. నియోజకవర్గంలో 5 వేల నుంచి పదివేల వరకు చిన్నసన్నకారు చెరుకు రైతులు ఉన్నారు. చక్కెర పరిశ్రమ క్రషింగ్ ప్రారంభం అవ్వకపోతే అధికార పార్టీపై ప్రభావం పడుతుందని నాయకులు ఆలోచిస్తున్నారు. రైతులను, పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులను మచ్చిక చేసుకునేందుకు పలు దఫాలుగా పర్యటనలు, ప్రచారాలు కూడా నిర్వహించిన విషయం తెలిసిందే. జహీరాబాద్ నియోజకవర్గంలో చివరివరకు ఎంతమంది అభ్యర్థులు ప్రచారం చేస్తారో, ఎంతమంది ఎవరికి మద్దతిస్తారో, ప్రచారం నిర్వహించకుండా మిన్నకుండిపోతారో వేచి చూడాలి మరి..

110 స్థానాల్లో బీజేపీకి డిపాజిట్ గల్లంతు

అధికారంలోకి రాగానే సచివాలయంలో ప్రజా దర్బార్ ... కాంగ్రెస్ మ్యానిఫెస్టో బీఆర్ఎస్‌ను భయపెడుతుంది

- నక్సలైట్ల ఎజెండా అమలు చేసింది కాంగ్రెస్సే
- ఆ తర్వాతే నక్సలిజం తగ్గింది
- 'మీట్ ది ప్రెస్'లో రేవంత్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల్లో బీజేపీకి 110 సీట్లలో డిపాజిట్లు రావు. రాష్ట్రానికి బీసీ సీఎంను ఎలా చేస్తుందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 10 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంటే.. ఒకరు మాత్రమే ఓబీసీ సీఎం ఉన్నారని గుర్తు చేశారు. బీసీ గణన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నా...ఆ పార్టీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. బీసీగణన చేయలేని పార్టీ బీసీ సీఎంను ఎలా చేస్తుందని నిలదీశారు. బలహీనవర్గాలు కేసీఆర్‌ను ఓడించాలన్న కసితో ఉన్నాయన్నారు.

ఆ ఓట్లను చీల్చి కేసీఆర్‌కు సహకరించడమే బీజేపీ వ్యూహమని విమర్శించారు. ఎన్నికల కోసమే బీజేపీ ఎస్సీ వర్గీకరణ హామీ ఇస్తుందని చెప్పారు.ఎస్సీ వర్గీకరణపై గతంలో వెంకయ్య నాయుడు సభ నిర్వహించి 100 రోజుల్లో చేస్తామన్నారు... ఇప్పటికీ అతీగతీ లేదన్నారు. బిల్లు పెడితే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నా... బీజేపీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. దళితుల ఓట్లు కాంగ్రెస్‌కు రాకుండా చీల్చేందుకే కమిటీతో కాలయాపన అని ఆరోపించారు. దమ్ముంటే పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మోడీని కలిసిందుకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని కోరారు. నక్సలైట్ల ఎజెండాను కాంగ్రెస్ అమలు చేసిందనీ, ఆ తర్వాతనే నక్సలిజం తగ్గిందని గుర్తు చేశారు. పేదలకు భూమి పంచింది కాంగ్రెస్ పార్టీయేన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సచివాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ధరణి పేరుతో పెద్ద ఎత్తున భూదోపిడీ జరిగిందని రేవంత్ ఆరోపించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న లక్ష ఎకరాల నిజాం వారసుల భూములు చేతులు మారాయని విమర్శించారు. అందుకే ధరణి రద్దు చేస్తామంటే కేసీఆర్‌కు దుఃఖం వస్తుందన్నారు.కాస్రా పహాణీ లాంటి మాన్యువల్ రికార్డులను యథాతథంగా భూమాత ద్వారా డిజిటలైజ్ చేస్తామన్నారు కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇచ్చి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. భూ యజమానికి, కౌలు రైతులకు, రైతు కూలీలకు అందరికీ ఆర్థికసాయమందిస్తామన్నారు.

రాష్ట్రంలో సంకీర్ణం అనే చర్చే లేదు

రాష్ట్రంలో సంకీర్ణం అనే చర్చే లేదని రేవంత్ అన్నారు. ఈ విషయంలో ఎవరికీ అనుమానం అక్కర్లేదన్నారు. కాంగ్రెస్‌పార్టీకి 80-85 సీట్లు వస్తాయన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో కారు పార్టీని భయపెడుతున్నదని చెప్పారు. అధికారం కోల్పోతు న్నామన్న విచక్షణ కోల్పోయి కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ఏర్పాటు ఖాయమైనప్పుడు సీమాంధ్ర పాలకులు మాట్లాడినట్టు ఇవాళ కల్వకుట్ల కుటుంబం మాట్లాడు తున్నదని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో ఖాళీలను భర్తీ చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. యూపీఎస్సీ తరహాలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. అధికారంలోకి రాగానే 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీనిచ్చారు.

కేసీఆర్ ఉద్యమకారుడు కాదు

సీఎం కేసీఆర్ ఉద్యమకారుడు కాదనీ, ఫక్తు రాజకీయ నాయకుడని, ఆయనకు రావాల్సినదానికంటే ఎక్కువే వచ్చాయని రేవంత్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యమకారుల కుటుంబాలను గుర్తించి ఆదుకుంటామన్నారు. స్వాతంత్ర్య సమరయోధులతో సమానంగా తెలంగాణ ఉద్యమకారులను గౌరవిస్తామన్నారు.

అధికారంలోకి రాగానే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఆదాయాన్ని పెంచడం పేదలకు పంచడం కాంగ్రెస్ విధానమని చెప్పారు. ప్రగతిభవన్‌ను డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భవన్‌గా మారుస్తామని తెలిపారు. సీఎంకు ఫెడరల్ స్ఫూర్తి తెలియదనీ, ఆయన రాచరికమే అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని కేసీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇస్తున్న విద్యుత్ కొంటున్నది కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గడ్ నుంచి కాదా? అని ప్రశ్నించారు. సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేయలేని కేసీఆర్.. కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, సాధిక్, కె శ్రీనివాసరావు, మధు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలే సీపీఐ(ఎం) ఎన్నికల ఎజెండా

- ప్రజాస్వామ్య విలువలకు బీజేపీ తిలోదకాలు : సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజయ్ రాఘవన్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా సమస్యలే ఏజెండాగా సీపీఐ(ఎం) ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుందని అ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ విజయ్ రాఘవన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు నిర్వహించే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ ఓటమే ధ్యేయంగా తమ పార్టీ ముందుకెళ్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తూ బీజేపీ రాజ్యాంగేతర శక్తిగా మారిందన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాఘవన్ మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని ఓడించే ప్రజాస్వామ్య శక్రులకు మద్దతు ఇస్తూనే తాము బలంగా ఉన్న 19 స్థానాల్లో పోటీలో ఉన్నామన్నారు. సీపీఐకి ఒక్క సీటులో మద్దతు ఉందన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య విలువలను విడనాడి బీజేపీ రాజ్యాంగేతర శక్తిగా మారిందన్నారు. బీజేపీ పాలనలో దళితులు, కార్మికులు, కర్షకులపై భారాలు అధికమయ్యాయని, ప్రతి ఒక వర్గం సంకటస్థితిని ఎదుర్కొంటోందని తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ.. ప్రత్యా మ్నాయ విధానం కావాలని ప్రజలు కోరుకుంటు న్నారన్నారు. కమ్యూనిస్టులు పోటీ చేస్తున్న 20 స్థానాల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు అఖిలభారత స్థాయిలో ప్రభావితం చేస్తాయని అన్నారు. బీజేపీ బీసీ ముఖ్యమంత్రి అంటుందే తప్ప బీసీల సమస్యలపై ఆ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలిపారు. ఖమ్మంలో కమ్యూనిస్టులను ఆదరించాల్సిందిగా కోరారు. సమావేశంలో సీపీఐ(ఎం) జాతీయ నాయకులు ఎం. సాయిబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె. వెంకటేశ్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పంచ్ తంత్రం!

ఓట్లు కొనుడులోన ఒక్కింత గడబిడ
అయిననూమనకేమి భయములేదు
ఏడెన్మిదీమంది ఏ పార్టిలున్ననూ
కొనవచ్చు నొందొంద కోట్లు జల్లి
అధికారమున్నప్పుడందుకే దోయాలి
నిలబెట్టుకొనుడెగా నీతి నేడు
మనదిక్కు రానంటే
తనలోటుపాట్లేమొ
అదనుగా లాగ వానయ్య దిగును
ఉన్నపవరెల్లవాడాలి ఊడ్చుకొనుచు
మాట వినవోడు
ఎవడున్నతాటతీసి




దారి లోపల బడ వేసి
తీరుబడిగ
తిప్పవలెనుగా చక్రాలుతప్పకుండ

- ఏనుగు నరసింహారెడ్డి

బీఆర్ఎస్‌లోకి బాబూ మోహన్ తనయుడు

మంత్రి హరీశ్‌రావు సమక్షంలో చేరిక



నవతెలంగాణ-జోగిపేట

సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి పి. బాబుమోహన్‌కు భారీ షాక్ తగిలింది. ఆయన తనయుడు ఉదయ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు బీజేపీ అందోల్ మండలాధ్యక్షులు నవీన్‌కుమార్, ఉమ్మడి పుల్కల్ మండలాధ్యక్షులు శేఖర్‌గౌడ్, జోగిపేట పట్టణాధ్యక్షులు సయ్య సాయి, బీజేవైఎం నాయకులు రవికిరణ్, సాయికుమార్, ఎస్సీ మోర్చా నాయకులు రాకేష్, నాయకులు లక్ష్మణ్, అర్జున్, రాములు, లడ్డు తదితరులు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సిద్దిపేటలోని మంత్రి హరీశ్‌రావు నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీ నేత, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బాలయ్య తన అనుచరులతో ఇదివరకే బీఆర్ఎస్‌లో చేరారు. దాంతో అందోల్‌లో బీజేపీకి గడ్డు పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బలోపేతానికి తామంతా కృషి చేస్తామని, అందోల్‌తోపాటు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రానున్నదన్నారు. మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్ మఠం బిక్షపతి, పార్టీ సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, కాశీనాథ్ తదితరులు ఉన్నారు.

ఓయూకు ఎన్నికల ఫీవర్

బోసిపోయిన యూనివర్సిటీ

నవ తెలంగాణ- ఓయూ

ఎన్నికల సమయంలో విద్యార్థులు ఇండ్లకు సొంత గ్రామాల్లో ఉండటంతో ఓయూ పూర్తిస్థాయిలో బోసిపోయింది.సెంట్రల్ లైబ్రెరీ అయితే వెలవెల బోతుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించింది. ప్రస్తుత ఎన్నికలలో ఓయూ కీలక పాత్ర పోషిస్తుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఓయూ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు కొందరు పోటీల్లో ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీ, పార్టీల నుండి టికెట్స్ ఆశించి భంగపడ్డారు. చివర వరకు ముమ్మర ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. గత్యంతరం లేక చివరి సమయంలో కొందరు పార్టీలు మారారు. డబ్బు లేకపోవడం, రాజకీయంగా పట్టు లేకపోవడం, మరికొందరికి సహకరించే నేతలు లేకపోవడంతో వారికి టికెట్ రాలేదని సమాచారం. వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు, వారి వారి నియోజకవర్గ పరిధిలోని పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం, ఇంకొందరు పార్టీలు ఇచ్చిన ఎన్నికల బాధ్యతల్లో పాల్గొంటున్నారు. ఉద్యోగావకాశాలు లేకపోవడంతో ఆయా పార్టీల్లో ఇచ్చిన బాధ్యతలను చేస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అది ఓ మృత్యు నిలయం

అల్ షిఫా ఆస్పత్రిలో పరిస్థితిపై డబ్ల్యూహెచ్ఓ



గాజా స్ట్రిప్ : గాజాలోని అల్ షిఫా ఆస్పత్రిని ఓ 'మృత్యు నిలయం'గా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అభివర్ణించింది. అక్కడి పరిస్థితి చెప్పనలవి కాదని తెలిపింది. డబ్ల్యూహెచ్ఓ నేతృత్వంలోని బృందం శనివారం ఆస్పత్రిని సందర్శించింది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా అక్కడ కేవలం ఓ గంట సేపు మాత్రమే గడిపింది. ఈ బృందంలో ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రజారోగ్య నిపుణులు, అధికారులు, భద్రతా సిబ్బంది సభ్యులుగా ఉన్నారు. ఆస్పత్రిలో స్వచ్ఛమైన నీరు, ఇంధనం, మందులు, ఇతర అత్యవసరాలకు కొరత ఏర్పడిందని ఈ బృందం వివరించింది. వాస్తవానికి ఓ వైద్య కేంద్రంగా ఇది పనిచేయడం లేదని తెలిపింది. 'కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయి. తూటాలు దూసుకొస్తున్నాయి. ఆస్పత్రి ప్రాంగణంలో సామూహిక శ్మశాన వాటిక కన్పించింది. అక్కడ 80 మందికి పైగా మృతులకు అంత్యక్రియలు నిర్వహించారని చెప్పారు' అని డబ్ల్యూహెచ్ఓ ఓ ప్రకటనలో వివరించింది. ఈ సంస్థత తెలిపిన వివరాల ప్రకారం... ఆస్పత్రిలోకి ప్రవేశించే మార్గాలు, ఆస్పత్రి మైదానం మొత్తం వ్యర్థాలతో నిండిపోయింది. ఎక్కడ చూసినా భరించలేదని దుర్వాసన వస్తుండడంతో తమ ఆరోగ్యం, భద్రతపై రోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరవై ఐదు మంది ఆరోగ్య కార్యకర్తలు, 291 మంది రోగుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీరిలో 32 మంది చిన్నారులు కూడా ఉన్నారు. ఆస్పత్రిలో మిగిలి ఉన్న రోగులు, వారి బంధువులు, ఆరోగ్య సిబ్బందిని అక్కడ నుండి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాబోయే 24-72 గంటల్లో వారందరినీ సురక్షితంగా వేరే ప్రదేశాలకు పంపుతామని, ముఖ్యంగా రోగులను గాజాకు దక్షిణాన ఉన్న ఆస్పత్రుల్లో చేరుస్తామని అధికారులు తెలిపారు.

డబ్ల్యూహెచ్ఓ ప్రకటనపై ఇజ్రాయిల్ ఇప్పటి వరకూ ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. ఆస్పత్రి ప్రాంగణాన్ని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ రక్షణ దళాలు హెచ్చరికలు పంపడంతో అల్ షిఫా మైదానంలో ఆశ్రయం పొందుతున్న 2,500 మంది బాధితులు అక్కడి నుండి వెళ్లిపోయారు. ఆస్పత్రి సమీపంలో భీకర పోరు సాగుతోందని, ఇజ్రాయిల్ సైన్యంతో సమన్వయం చేసుకొని తాము ఆస్పత్రిలోకి వెళ్లామని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. వెంటనే కాల్పుల విరమణ పాటించాలని, ఆపన్నులకు మానవతా సాయాన్ని అందించాలని ఆ సంస్థ మరోసారి విజ్ఞప్తి చేసింది.

రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రధాని భద్రతా విధులకు వెళ్తున్న ఆరుగురు పోలీసులు మృతి



జైపూర్ : ప్రధాని మోడీ భద్రతా విధుల కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఆరుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. రాజస్థాన్‌లోని ఝుంఝునులో ప్రధాని ఎన్నికల సభకు వెళ్తుండగా, చురు జిల్లా సుజన్‌గఢ్ సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. సుజన్‌గఢ్ సర్కిల్ ఆఫీసర్ (సిఒ) షకీల్ ఖాన్ కథనం ప్రకారం... నాగౌర్‌లోని ఖిన్వసర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఆరుగురు, మహిళా పోలీస్ స్టేషన్‌కు చెందిన ఒకరు ప్రధాని ఎన్నికల సమావేశానికి కారులో ఝుంఝును బయల్దేరారు. సుజన్‌గఢ్ సదర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కనోటా చెక్‌పోస్ట్ సమీపంలో జాతీయ రహదారి-58పై అకస్మాత్తుగా ఓ జంతువు (నీల్‌గాయ్) వాహనం ముందుకు రావడంతో దాన్ని తప్పించేందుకు ప్రయత్నించిన డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు. ఆగివున్న ట్రక్కును ఢీకొట్టాడు. దీంతో, వాహనం ముందు భాగం పూర్తిగా ఛిద్రమై ముక్కలైంది. తెల్లవారు జామున 5:30 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఖిన్‌సర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎఎస్ఐ రామచంద్ర, కానిస్టేబుళ్ల కుంభారం, సురేష్ మీనా, తానారామ్, మహిళా పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ మహేంద్ర అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, డిజిపి ఉమేష్ మిశ్రా విచారం వ్యక్తం చేశారు.

రాజ్యాంగ నైతికతను తిరస్కరించకూడదు : సీజేఐ



న్యూఢిల్లీ : రాజ్యాంగ నైతికత సిద్ధాంతాన్ని తిరస్కరించకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రస్తుత సామాజిక ఆచరణ పద్ధతుల కారణంగా రాజ్యాంగ నైతికత ఉద్రిక్తతకు లోనవుతోందన్న కారణంతో దానిని తిరస్కరించడం తగని పని అని చెప్పారు. రాజ్యాంగ నైతికత ద్వారా భారతీయ సాంస్కృతిక పద్ధతులను పరిశీలించేటప్పుడు వైరుధ్యాలు తలెత్తే అవకాశంపై అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ కొన్ని రాజ్యాంగ విలువలు ఆమోదయోగ్యమైనవని తెలిపారు. రాజ్యాంగ నిర్మాతలు ఇతర దేశాలకు చెందిన రాజ్యాంగాల్లోని కొన్ని నిబంధనల్ని మన పరిస్థితులకు అనువుగా మార్చి భారత రాజ్యాంగంలో చేర్చారని వివరించారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు ఆయన ఇంటర్వ్యూ ఇస్తూ మతం, కులం, జాతి కారణంగా పౌరులపై పెత్తనం చెలాయించేందుకు వీలు లేకుండా సామాజిక ఆచరణ పద్ధతుల్ని సంస్కరించాలని రాజ్యాంగమే చెబుతోందని అన్నారు. అంటరానితనం నిర్మూలన, ప్రభుత్వ విధాన ఆదేశిక సూత్రాలు వంటి అనేక రాజ్యాంగ నిబంధనలు మన దేశంలో అందరికీ ఒకటేనని చంద్రచూడ్ చెప్పారు. ఉచిత న్యాయ సహాయం, పంచాయతీల ద్వారా స్థానిక పాలన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై చట్టాలు చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వంపై ఉంచుతూ ఆదేశిక సూత్రాలను రూపొందించారని గుర్తు చేశారు.

థర్మల్ ప్లాంట్లకు బొగ్గు కొరత

- రెండు రోజులకే సరిపడ నిల్వలు
- సక్రమంగా సరఫరా చేయని రైల్వే

అమరావతి : రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల పరిస్థితి దినదినగండంగా మారింది. ప్లాంట్లకు ఒక్క రోజు బొగ్గు ఆగినా అందులో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉండగా, రాష్ట్రంలో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. కనీసం 15 రోజులకు 10,73,835 మెట్రిక్ టన్ను(ఎం.టి)ల బొగ్గు నిల్వలు ఉండాలి. అయితే, అవసరమైనదాంట్లో 9శాతం బొగ్గు మాత్రమే జెన్‌కో ప్లాంట్‌లో ప్రస్తుతం ఉంది. దీనిని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ) సైతం ధ్రువీకరించింది. రాష్ట్రంలో జెన్‌కో ఆధ్వర్యంలో మూడు థర్మల్ ప్లాంట్లు నడుస్తున్నాయి. ఇవి నడవాలంటే రోజుకు 71,100 ఎం.టిల బొగ్గు అవసరం. ప్రస్తుతం మూడు ప్లాంట్లలో రెండింటిలో ఒకటిన్నర రోజుకు సరిపడా నిల్వలు మాత్రమే ఉన్నాయి. రైల్వే శాఖ నుంచి ఎంవి రమణారెడ్డి రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ (ఎంవిఆర్ఆర్‌టిపిపి), విజయవాడలోని నార్లా తాతారావు థర్మల్ పవర్ ప్లాంట్(ఎన్‌టిటిపిఎస్)కు తక్కువ బొగ్గు సరఫరా జరుగుతుందని సిఇఎ పేర్కొంది. రైలుమార్గం ద్వారా జరిగే ఈ సరఫరాలో ఏ మాత్రం ఆటంకం ఏర్పడినా కరెంట్ కోతలతో అంధకారం నెలకొనే ప్రమాదం ఉంది. రైల్వే కూడా సాధారణ రైళ్లకు ఎక్కువగా క్లియరెన్స్ ఇచ్చి గూడ్స్ వాహనాలను ఆపుతోంది. ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదం వల్ల కృష్ణపట్నం ప్లాంట్‌కు ఒడిశాలోని మహానది గని నుంచి రావాల్సిన బొగ్గు రెండు రోజులు ఆలస్యంగా వచ్చింది. దీంతో సింగరేణి నుంచి తెప్పించి జెన్‌కో అధికారులు సర్దుబాటు చేశారు. ప్లాంట్లకు బొగ్గులో కూడా నాణ్యత లేదనే ఆరోపణలు ఉన్నాయి. బొగ్గులో మట్టి ఎక్కువగా ఉండటంతో అనుకున్నంత ఉత్పత్తి జరగడం లేదు. నిబంధనల ప్రకారం ప్లాంట్ లోడ్ ఫాక్టర్(పిఎల్ఎఫ్) 85శాతం ఉండాలి. అయితే ఏపి జెన్‌కో మూడు ప్లాంట్లు కలిపి 59శాతం మాత్రమే ఉంది. ఎన్‌టిటిపిఎస్ 73శాతం, రాయలసీమ థర్మల్ ప్లాంట్ 71శాతంతో ఉండగా, కృష్ణపట్నం ప్లాంట్ కేవలం 40శాతం మాత్రమే ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రస్తుతం 223 మిలియన్ యూనిట్లు(ఎంయు) విద్యుత్ డిమాండ్ ఉంది. డిస్కంలకు అవసరమైన విద్యుత్ జెన్‌కో నుంచి 91(ఎంయు), కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి 40(ఎంయు), హిందుజా నుంచి 17ఎంయు, సోలార్ విద్యుత్ 30ఎంయుల వరకు విద్యుత్ వస్తుంది. మిగిలిన కొరతను డిస్కంలు పవర్ ఎక్స్చేంజ్ మార్కెట్ నుంచి రూ.9ల వరకు కొనుగోలు చేస్తున్నాయి.

ఏ ప్లాంటులో ఎంత నిలువ ?

ఎన్‌టిటిపిఎస్ ప్లాంట్‌లో ఉత్పత్తి రోజుకు 28,500 మిలియన్ టన్ను(ఎం.టి)లు బొగ్గు అవసరం. ప్రస్తుతం అక్కడ 520,81ఎంటిల బొగ్గు మాత్రమే ఉంది. ఎంవిఆర్ఆర్‌టిపిపి రోజుకు 21వేల ఎంటిల బొగ్గు కావాల్సి ఉండగా ప్రస్తుతం అక్కడ 30,337 ఎంటిలు మాత్రమే ఉంది. నెల్లూరులోని కృష్ణపట్నం ప్లాంట్‌కు రోజుకు 19,000ఎంటిల బొగ్గు కావాల్సి ఉండగా, అక్కడ 170560 ఎంటిల నిల్వ ఉంది. రెండో దశ కింద ప్రారంభించిన మూడో యూనిట్‌కు సరిపడ బొగ్గు లేకపోవడంతో రెండు రోజుల క్రితం అక్కడ ఉత్పత్తి



నిలిచింది. శనివారమే బొగ్గు వ్యాగన్లు రావడంతో 170560ఎంటిలకు నిల్వ చేరుకుంది. సాంకేతిక కారణంతో ఆ యూనిట్ ఆదివారం కూడా పనిచేయలేదు. ఈ ప్లాంటును కొంత విదేశీ బొగ్గుతో నడపాల్సి ఉండగా, అది అందుబాటులో లేకపోవడంతో స్వదేశీ బొగ్గుతోనే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు చెబుతున్నారు.

ఎందుకీ స్థితి ?

రాష్ట్రాల జెన్‌కో ప్లాంట్లకు సరిపడ బొగ్గును కోల్ ఇండియా సరఫరా చేయడం లేదు. మరోవైపు ఏపి జెన్‌కో యాజమాన్యం వైఫల్యం కూడా కనిపిస్తోంది. రాష్ట్ర జెన్‌కోలకు సరిపడ అందించలేని కోల్ ఇండియా నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టిపిసి)లకు, ప్రైవేట్ ఉత్పత్తి ప్లాంట్లకు అందిస్తుంది. నిబంధనల ప్రకారం 15 రోజులకు సరిపడ బొగ్గు నిల్వలను ప్లాంట్లు సమకూర్చుకోవాలి. ఎన్‌టిపిసి ప్లాంట్లు 15 రోజులకు సరిపడ బొగ్గులో 57శాతం ఉంచుకుంటూ రాష్ట్ర జెన్‌కో ప్లాంట్లలకు మాత్రం తక్కువ స్థాయిలో సరఫరా చేస్తోంది. ప్లాంట్లకు అవసరమైన బొగ్గును జెన్‌కో రైల్ మార్గం ద్వారా తెప్పించుకుంటుంది. రాష్ట్రంలో ఉన్న ప్లాంట్లకు అవసరమైన బొగ్గును జెన్‌కో మహానది బొగ్గు గనుల నుంచి రావాల్సి ఉంది. అయితే మహానదికి బకాయిలు ఉండడంతో అవసరమైన బొగ్గు రావడం లేదు. కేవలం రోజు వారి చెల్లింపులు ద్వారా మాత్రమే బొగ్గును జెన్‌కో తెచ్చుకుంటోంది.

హలాల్ లేబుల్‌పై నిషేధం

- యోగి ప్రభుత్వం ఆదేశం

లక్నో : పాల ఉత్పత్తులు, చక్కెర, బేకరీ వస్తువులు, పిప్పరమెంట్ ఆయిల్, స్నాక్ ఐటెమ్స్, ఎడిబుల్ ఆయిల్ వంటి ఉత్పత్తులపై హలాల్ లేబుల్ ప్రచురించడంపై యోగి ప్రభుత్వం నిషేధం విధించింది. రాష్ట్రంలో హలాల్ బ్రాండెడ్ వస్తువుల ఉత్పత్తి, నిల్వ, పంపిణీని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. ఆహార ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించడంపై 2006లో చేసిన చట్టానికి విరుద్ధమని రాష్ట్ర ఆహార కమిషనర్ కార్యాలయం శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. హలాల్ లేబుల్ వినియోగదారులలో గందరగోళాన్ని సృష్టిస్తుందని యోగి ప్రభుత్వం ఆరోపించింది. ఆహార ఉత్పత్తుల నాణ్యతపై రాష్ట్ర ప్రభుత్వ న్యాయ సూత్రాలకు విరుద్ధమని కమిషనర్ అనితాసింగ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వినియోగదారుల మధ్య గందరగోళాన్ని సృష్టించడం చట్ట ప్రకారం శిక్షార్హమైన నేరమని పేర్కొంది.

22 మంది భారత మత్స్యకారుల విడుదల

చెన్నై : తమిళనాడులోని రామేశ్వరానికి చెందిన 22 మంది మత్స్యకారులను శ్రీలంక ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. తమ ప్రాదేశిక జలాల్లో ప్రవేశించి చేపల వేట జరుపుతున్నారని ఆరోపిస్తూ, శనివారం వీరిని శ్రీలంక అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మత్స్యకారులకు చెందిన రెండు పడవలను కూడా విడుదల చేశామని కంట్రీ బోట్ జాలర్ల సంఘం అధ్యక్షుడు రాయప్పన్ రామేశ్వరంలో విలేకరులకు తెలిపారు. పీఎం స్వనిధి కార్యక్రమంలో పాల్గొనేందుకు నిర్మలా సీతారామన్ శనివారం రామేశ్వరం చేరుకున్నారు. మత్స్యకారులను, వారి పడవలను విడిపించేందుకు జోక్యం చేసుకోవాలని కోరుతూ శనివారం సాయంత్రం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశామని చెప్పారు.

ఆస్పత్రిలో తమిళనటుడు విజయ్‌కాంత్ చేరిక

చెన్నై : ప్రముఖ తమిళ హీరో, దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం (డిఎండికె) వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి విజయకాంత్ ఆస్పత్రిలో చేరారు. సాధారణ వైద్య పరీక్షల కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయన చేరినట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

అంతర్జాతీయం


జపాన్‌లో ఆర్థికమాంద్యం



జులై నుంచి సెప్టెంబర్ త్రైమాసికందాకా రెండు త్రైమాసికాలలో జపాన్ ఆర్థిక వ్యవస్థ కుదింపుకు గురైందని బుధవారం విడుదల చేసిన ప్రభుత్వ డేటాను బట్టి తెలుస్తోంది. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగావున్న జపాన్ స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) మూడవ త్రైమాసికంలో 2.1శాతం కుదింపుకు గురైంది. ఇది వార్షికంగా పడిపోతుందనుకున్న 0.6శాతం కంటే చాలా ఎక్కువ. రెండవ త్రైమాసికంలో 4.5శాతం పెరిగిన తరువాత ఈ పతనం జరిగింది. జపాన్ లో అభివృద్ధి మందగించిందని, ప్రస్తుత త్రైమాసికంలో కూడా జపాన్ ఆర్థిక వ్యవస్థ కుంగుబాటుకు గురైతే ఆశ్చర్యపోవలసిన అవసరంలేదని నొరించుకిన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ లో చీఫ్ ఎకనామిస్టుగావున్న తకేషి మినామి అన్నారు.

కుటుంబాల వినిమయాన్ని కుదించే అతి ద్రవ్యోల్బణం, చైనా, ఇతర ప్రాంతాల నుంచి బలహీనమైన బాహ్య డిమాండ్ వల్ల జపాన్ పారిశ్రామికవేత్తలు వత్తిడికి గురైన కారణంగా జపాన్ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం నెలకొంటున్నది. అధికారికంగా విడుదలైన డేటా ప్రకారం అంతకు ముందు త్రైమాసికంలో 0.9శాతం కుదింపుకు గురైనప్పటికీ జులై-సెప్టెంబర్ మధ్యకాలంలో వినిమయంలో మార్పురాలేదు. ఆర్థికవేత్తలు 0.2శాతం వృద్ధి ఉంటుందని ఆశించినా జపాన్ ఆర్థిక వ్యవస్థ ఇలా కుదింపునకు గురవటం విశేషం. వినిమయదారుల కొనుగోలు శక్తికి సూచికగా భావించబడే ద్రవ్యోల్బణంతో సర్దుబాటుచేసిన నిజ వేతనాలు సెప్టెంబర్ లో 2.4శాతం పతనం అయ్యాయి. ఇలా జరగటం వరుసగా 18వసారి.

పశ్చిమ దేశాల ఆధిపత్యం ముగుస్తోంది! : లవ్రోవ్



పశ్చిమ దేశాలకు ప్రతిగా నూతన ప్రపంచ ఆర్థికాభివృద్ధి కేంద్రాలు ఆవిర్భవించాయని, సహకారానికి గల అవకాశాలను అందిపుచ్చుకుని సంబంధాలను బలోపేతం చేశాయని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ అన్నారు. చైనా, ఇండియా, ఇరాన్, గల్ఫ్ దేశాలు, లాటిన్ అమెరికన్ అండ్ కరిబియన్ స్టేట్స్(సీఈఎల్ఏసీ)వంటి గ్రూపులు ఇలా ఆవిర్భవించిన ఆర్థిక శక్తులుగా ఉన్నాయని లవ్రోవ్ చెప్పాడు. గత ఐదు శతాబ్దాలుగా పశ్చిమ దేశాలు ప్రపంచంపైన ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. ఈ శకం ముగిసింది. పశ్చిమ దేశాల ఆధిపత్యానికి ముగింపు పలకటానికి బహుళ ధ్రువ కేంద్రాలకు మరికొంత సమయం పడుతుందని కూడా ఆయన అన్నారు.

ఇదే సందర్భంగా అమెరికా డాలర్ పైన ఆధారపడకుండా తమ స్వంత కరెన్సీని ఏర్పాటు చేసుకునే దిశగా లాటిన్ అమెరికన్ అండ్ కరిబియన్ స్టేట్స్(సీఈఎల్ఏసీ) ఆలోచించవలసిందిగా బ్రెజిలియన్ అధ్యక్షుడు లూలా డ సిల్వా సూచించిన విషయాన్ని లవ్రోవ్ గుర్తు చేశారు. అలాగే బ్రిక్స్ గ్రూపు దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపుల వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని కూడా లూలా సూచించిన విషయాన్ని కూడా లవ్రోవ్ ఉటంకించాడు. అమెరికా ప్రపంచీకరణ పేరుతో తను రూపొందించిన నియమాలను తానే ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా ఆంక్షలను విధిస్తుండటంవల్ల ప్రపంచ దేశాలకు ప్రత్యామ్నాయ ఆలోచనలు అవసరమౌతున్నాయని లవ్రోవ్ అన్నారు.

ప్రపంచ వాణిజ్యం, పెట్టుబడులలో చైనా పలుకుబడి పెరిగిన తరువాత ప్రపంచ వాణిజ్య సంస్థ విభాగమైన సమస్యల పరిష్కార విభాగాన్ని అమెరికా పనిచేయకుండా చేసిందని లవ్రోవ్ పేర్కొన్నారు. అమెరికా ప్రయోజనాలు నెరవేరేవరకే పనికివచ్చే నియమాలను అమెరికా రూపొందిస్తుందని, ఎప్పుడైతే ఇతర దేశాలు అమెరికాకంటే సమర్థవంతంగా పనిచేయటం మొదలవుతుందో అప్పుడే అమెరికా నియమ, నిబంధనలను మారుస్తుందని లవ్రోవ్ చెప్పారు.

ప్రపంచంలో నూతన ఆర్థిక, సైనిక, రాజకీయ శక్తుల కేంద్రాలుగా ఆవిర్భవిస్తున్న కారణంగా ఈ శకం ముగింపునకు వస్తోందని లవ్రోవ్ ప్రకటించారు.

యువతిపై దారుణం

- కాలేజీ విద్యార్థినిపై సామూహిక లైంగికదాడి
- భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ క్వార్టర్స్‌లో ఘటన



ముంబయి : భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ క్వార్టర్స్‌లో కాలేజీ విద్యార్థిని(19)పై సామూహిక లైంగికదాడి జరిగింది. దారుణానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని చెంబూర్ ప్రాంతంలోని పోస్టల్ కాలనీలోని భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) క్వార్టర్స్‌లోని ఒక ఫ్లాట్‌లో ఈ దారుణం జరిగింది. ఈ ఘటన ఈనెల 15-16 మధ్య రాత్రి 10 గంటల నుంచి 12.30 గంటల మధ్య చోటు చేసుకున్నది. కామర్స్ విద్యార్థిని అయిన బాధితురాలు ఆమె తల్లి, సోదరితో పాల్ఘర్ జిల్లాలో నివసిస్తున్నది. ఆమె బార్క్‌లో పనిచేస్తున్న తన తండ్రిని దగ్గరకు వచ్చింది. మునిసిపల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లోని ఒక భవనంలో ఆమె తండ్రికి ఒక ఫ్లాట్ కేటాయించబడింది.

ఇద్దరు నిందితుల్లో ఒకరైన అజిత్ కుమార్ యాదవ్ (26) బార్క్‌లో పని చేస్తున్న ఒక ఉద్యోగి కుమారుడు. బాధితురాలి తండ్రి ఇంటికి సమీపంలోని ఫ్లాట్‌లో నివసిస్తున్నాడు. సంఘటన జరిగిన రోజు అజిత్ తల్లిదండ్రులు రాత్రికి బయటకు వెళ్లారనీ, అతను తన స్నేహితుడు ప్రభాకర్ యాదవ్ (30)ని తన ఇంటికి ఆహ్వానించాడు.

అజిత్ ఇంటిలో నిందితులు యువతికి కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చారు. దాంతో ఆమె స్పృహ కోల్పోయింది. అనంతరం నిందితులిద్దరూ ఆమెపై దారుణానికి తెగబడ్డారు. అర్ధరాత్రి 12:30 గంటలకు బాలిక స్పృహలోకి వచ్చిన తర్వాత తన ఫ్లాట్‌కు పరుగెత్తింది. ఆ తర్వాత అదే భవనంలో ఉంటున్న తన సన్నిహితులకు జరిగిన విషయాన్ని తెలియజేసింది. ఈనెల 16న బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. నిందితులిద్దరిని అరెస్టు చేసిన పోలీసులు వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా నవంబర్ 20 వరకు పోలీసు కస్టడీ విధించారు. ఈ ఘటనపై మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

లోక్‌సభలో ప్రయివేటు బిల్లులు పెండింగ్

700లకు పైగానే..

- ఉమ్మడి పౌరస్మృతి, లింగ సమానత్వ సవరణతో సహ పలు కీలకమైనవి..

న్యూఢిల్లీ : లోక్‌సభలో 700కు పైగా ప్రయివేటు బిల్లులు పెండింగులో ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం శిక్షలకు సంబంధించిన నిబంధనల్లో, ఎన్నికల చట్టాల్లో సవరణలకు ఉద్దేశించినవే. పలు బిల్లుల్ని ప్రస్తుత లోక్‌సభ కాలంలోనే అంటే 2019 జూన్‌లో ప్రవేశపెట్టారు. కొన్నింటిని ఇటీవలే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఆగస్టులో సభ ముందు ఉంచారు. సభ్యులు తమకు తాముగా ప్రవేశపెట్టేవే ప్రైవేటు బిల్లులు. సభ్యులు నూతన బిల్లుల్ని ప్రవేశపెట్టవచ్చు. లేదా అప్పటికే ప్రవేశపెట్టిన బిల్లుల్లో సవరణలు ప్రతిపాదించవచ్చు. రెండు రోజుల క్రితం లోక్‌సభ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం అలాంటి బిల్లులు 713 పెండింగులో ఉన్నాయి. ప్రయివేటు బిల్లుల్లో ఉమ్మడి పౌరస్మృతి, లింగ సమానత్వం, వాతావరణ మార్పులు, వ్యవసాయం వంటి అంశాలకు సంబంధించినవే కాకుండా ప్రస్తుతం అమలులో ఉన్న క్రిమినల్, ఎన్నికల చట్టాలకు సవరణలతో పాటు రాజ్యాంగ నిబంధనలకు ప్రతిపాదించిన సవరణలు కూడా ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు ప్రతి శుక్రవారం రెండో అర్ధభాగంలో సభ్యులు ప్రైవేటు బిల్లులు ప్రవేశపెట్టవచ్చు. అదే సమయంలో ప్రైవేటు బిల్లులపై చర్చ కూడా జరుగుతుంది. వాటిపై తీర్మానాలు సైతం చేస్తారు. ప్రైవేటు బిల్లులపై చర్చ పూర్తవగానే సంబంధిత మంత్రి స్పందిస్తూ బిల్లును ఉపసంహరించుకోవాల్సిందిగా సభ్యుడిని కోరతారు. ప్రైవేటు బిల్లులు ఓటింగుకు రావడం చాలా అరుదుగా జరుగుతుంది.

చరిత్రను వక్రీకరించడం తగదు

- రైతాంగ సాయుధ పోరాటంలో ఎగిసిన భూ ఉద్యమం
- వినోబాభావే ఉద్యమంగా ప్రచురించడం సరైందికాదు

ఆంధ్రజ్యోతి కథనంపై వామపక్షాల ఖండన



అమరావతి : నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముందుకు తెచ్చిన భూ ఉద్యమాన్ని వక్రీకరించేలా ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించడం తగదని వామపక్ష పార్టీలు ఖండించాయి. చరిత్రను వక్రీకరించేలా కాకుండా వాస్తవాలను పత్రికలో ప్రచురించాలని కోరాయి. ఈ మేరకు సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆదివారం ఆంధ్రజ్యోతి ఎడిటరుకు లేఖ రాశారు. ఈ నెల 19న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఏపీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన భూ పంపిణీ కార్యక్రమాన్ని విమర్శిస్తూ భూములపై బొంకులు అనే కథనంలో ఆంధ్రప్రదేశ్‌లో వినోబాభావే కాలంలోనే భూ పంపిణీ జరిగినట్లు రాశారని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధాలను సరిదిద్దే పేరుతో మరో అబద్ధాన్ని మీరు ప్రచారంలోకి తీసుకురావడం సరైందికాదని అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముందుకు తెచ్చిన భూ పంపిణీ కార్యక్రమాన్ని దెబ్బతీసేందుకు భూస్వాముల ప్రయోజనాల కోసమే వినోబాభావే భూదాన కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. భూస్వాములు దయతో భూములు ఇచ్చినట్లు ప్రకటించినా వాటిని ఎక్కడా పేదలకు పంచలేదని, ఆ భూములు ఇప్పటికీ భూస్వాముల ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు. ఎవరికీ చెందని ప్రభుత్వ భూములను కూడా భూదానం పేరుతో పంచినట్లు ప్రచారం చేశారు తప్ప ఒక్క ఎకరా కూడా పేదలకు దక్కలేదన్నారు. రాష్ట్రంలో 1940 నుంచి 15 ఏళ్లపాటు మళ్లీ 1960 నుంచి 1970 వరకు అంటే పదేళ్ల పాటు రాష్ట్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో పెద్దయెత్తున భూ పోరాటాలు జరిగాయని తెలిపారు. చల్లపల్లి జమీందారు భూములకు సంబంధించిన భూ పోరాటాల్లో కమ్యూనిస్టులు ముఖ్య పాత్ర అద్వితీయమైనదని గుర్తుచేశారు.

పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు తదితర నాయకులు ఈ పోరాటాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారన్నారు. పేదలు ఎర్రజెండాలు నాటి ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. 1960 నుంచి నూజివీడు తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు దాసరి నాగభూషణరావు, చలసాని జగన్నాథరావు, బొడ్డు దేవసుందరం నాయకత్వంలో బంజర భూముల ఆక్రమణ ఉద్యమాన్ని నిర్వహించి వేలాది ఎకరాల బంజరు భూములను పేదలకు పంపిణీ జరిగిందన్నారు. ఈ భూములకు 1969, 1970లలో ఆనాటి కలెక్టరు ఆర్కే వేపా 15 వేల ఎకరాలకు అసైన్‌మెంట్ పట్టాలను మంజూరు చేశారన్నారు. ఆ పోరాటాల ఫలితంగా పేదల చేతుల్లో వున్న ఆ భూములకు అనివార్యంగా తరువాత కాలంలో వచ్చిన ప్రభుత్వాలు పట్టాలు పంపిణీ చేశాయని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా నూజివీడులో ఆ భూములకు శాశ్వత పట్టాలను మంజూరు చేయటం మాత్రమే జరిగిందన్నారు. రాష్ట్రంలో భూ పంపిణీపై వాస్తవాలు ఇవి కాగా, కమ్యూనిస్టులు చేసిన పోరాటాన్ని విస్మరించి భూ పంపిణీ వినోబాభావే సాగించినట్లు చెప్పటం చరిత్రను వక్రీకరించటమే అవుతుందని అన్నారు.

రాష్ట్రంలో వినోబాభావే భూములు ఎక్కడ పంచారో, అవి ఇప్పుడు ఎవరి స్వాధీనంలో ఉన్నాయో ఒక ఉదాహరణ ఇచ్చినా సంతోషిస్తామన్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల అసైన్డ్ భూములు పేదల చేతుల నుంచి అన్యాక్రాంతమైనా ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదన్నారు. దురాక్రమణదారులకు గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం కూడా కొమ్ముకాశాయని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చిన జీఓ కూడా అన్యాక్రాంతమైన భూములకు చట్టబద్ధత కల్పించడానికి తప్ప పేదలకు పెద్దగా ఉపయోగపడదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తానే భూములు పంచినట్లు అబద్ధాలు చెబుతున్నారని, మీరు రాసింది వాస్తవమని, అయితే ఆ భూములు పోరాటాల ద్వారా ఎలా పేదల చేతుల్లోకి వచ్చాయో అనే వాస్తవాలను కూడా ప్రజలకు అందించాలని కోరారు.

'ఆధార్' ఆధారిత చెల్లింపు మోసాలు



ప్రజాస్వామ్యం అంటే "ప్రజల చేత - ప్రజల కొరకు - ప్రజల యొక్క" అర్థం పూర్తిగా మారిపోయి, కరడు కట్టిన నేరస్థులు, ఆర్థిక నేరస్థుల చేతుల్లో "నాయకుల చేత - నాయ కుల కొరకు - నాయకుల యొక్క" గా మారిపోయింది. వారు కష్టపడి పన్నులు కట్టిన వారి డబ్బుని అక్రమ పద్ధతుల్లో సంక్షేమం పేరుతో ప్రభుత్వ ఖజానాలను, దేశాన్ని సంక్షోభం లోకి నెట్టి సర్వనాశనం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలను నేరుగా జన్‌ధన్ బ్యాంకు ఖాతాల్లో వెయ్యటానికి ఆధార్ సంఖ్య చరవాణి సంఖ్యలను అనుసంధానం చేస్తున్నారు. స్థిరాస్థి రిజిస్ట్రేషన్లు, పాన్ నంబర్లను కూడా ఆధార్‌కు అనుసంధానం చేశారు. జీవితమంతా ఆధార్ మీదే ఆధార పడాలనేట్టుగా చేశారు. చివరకు ఆధార్ సంఖ్య "శస్త్రచికిత్స అద్భుతంగా జరిగింది కానీ రోగి మరణిం చాడు" అన్న చందంగా తయారైంది.

140 కోట్లు జనాభా ఉన్న మన దేశంలో 136 కోట్ల మంది ఆధార్ సంఖ్యను తీసుకున్నారు. కాగా ప్రపంచ ఆర్థిక వేదిక 2018 లోనే 110 కోట్ల మంది ఆధార్‌లు హ్యాక్ అయ్యాయని ఎంతగానో మొత్తుకున్నా యూనిక్ ఐడెంటి ఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) భారత ప్రభుత్వాలు మాత్రం అబ్బే అలాంటిదేమీ జరగలేదంటూ తేలిగ్గా కొట్టి పారేశారు. ఆధార్ ధ్రువీకరణ మొదలు, బయో మెట్రిక్ విశ్వసనీయత వరకు అనేక అనుమానాలున్నాయని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ "మూడీస్" చెప్పినా పెడచెవిన పెట్టారు. 2023 అక్టోబర్ 9న అమెరికా నిఘా సంస్థ 'రీసెక్యూరిటీ' 81.5 కోట్ల భారతీయుల ఆధార్ పూర్తి సమాచారాన్ని క్లియర్‌అండ్ డార్క్‌వెబ్‌లో 60 లక్షల రూపాయలకు అమ్మకానికి పెట్టారని వెల్లడించింది. కోవిడ్ కాలంలో కరోనా వాక్సిన్లకు ఆధార్, బయోమెట్రిక్‌ల గోప్యత లోపించటంతో కోట్ల మంది సమాచారం తస్కరించబడింది.

ప్రభుత్వం, బ్యాంకులు ఆర్భాటంగా, వేలంవెర్రిగా ఆధార్ ని అందరినెత్తినా బలవంతంగా రుద్దటం మూలంగానే ఆర్థిక లావాదేవీల్లో అనేక మోసాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే సిలికాన్, బంకవేలి ముద్రల నకిలీ నకళ్లతో దొంగ హాజరు నిధుల తస్కరణ జరుగుతున్నాయి. ఇదే పద్ధతిలో సైబర్ నేరగాళ్ళు బంక వేలిముద్రలతో బ్యాంకు ఖాతాలోలని డబ్బంతా ఊడ్చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆధార్ వినియోగాన్ని కొన్ని షరతులతో అనుమతించి నప్పటికి, నానాటికీ ఆర్థిక మోసాలు పెరిగిపోతున్నాయి. పాత పద్ధతిలో ఏటీఎంల నుంచి కార్డుతో సులువుగా డబ్బులు తీసుకునే వాళ్ళం. ఏటీఎం సెంటర్లలో నేరస్తులు మన కార్డుల్ని క్లోనింగ్ చేసి డబ్బంతా కాజేస్తున్నారు.

ప్రస్తుతం ఆధార్ ఎనంబ్లడ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈ పీఎస్) అంటే ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ కొంప నిలు వునా ముంచుతోంది. ఒక రకంగా కూలీలకు, రైతులకు, గ్రామీణులకు, అత్యవసరమైన వారికి ఈ వ్యవస్థ బాగున్న ప్పటికీ సైబర్ నేరగాళ్ళు నకిలీ వేలిముద్రలతో దఫాకు పది వేల రూపాయలు చొప్పున రోజు మొత్తం మీద 5 దఫాలు అంటే 50 వేల రూపాయలు కొట్టేస్తున్నారు. మన ఖాతాలో, లక్ష రూపాయలుంటే మనకు బ్యాంకు నుండి, ఎస్ఎంఎస్,ఈ మెయిల్ రాకపోయినా, ఈ లావాదేవీలను మనం గమనించక పోయినా రెండు రోజుల్లో ఖాతా మొత్తం ఖాళీ అవుతుంది. ఈ వ్యవస్థ ద్వారా 2010 నుండి బ్యాంకులో ఆధార్ కార్డు ద్వారా డబ్బులు వేయడం, తీయటం, బదిలీ చేయటం సాధ్యపడుతుంది. బ్యాంకు లావాదేవీలకు ఎస్ఎంఎస్ ద్వారా ఓటీపీ వస్తుంది. (ఏఈపీఎస్)లో ముందస్తు సమాచారం ఏదీ ఉండదు. ఈ లావాదేవీలన్నీ రిజర్వ్ బ్యాంకు పర్యవేక్షిస్తుంది. నేషనల్ పేమెంట్ కోపరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)ని బ్యాంకులకు ఉచితంగా ఇచ్చింది.

2019-2023 మధ్య 8,68 లక్షల కోట్ల రూపాయల లావాదేవీలన్నీ (ఏఈపీఎస్) ద్వారా జరిగాయి. మార్చి 2023 నాటికి 34.1 కోట్ల మంది 485.94 కోట్ల (ఏఈపీఎస్) లావాదేవీలను జరిపారని కేంద్రమంత్రి డా॥ భగవత్ కరాడ్ చెప్పారు. అయితే ఎస్‌బీఐ నుండే ఎక్కువ లావాదేవీలు జరగటం వల్ల ఎక్కువ మోసాలు ఇక్కడే జరిగాయి. 2023లో (ఏఈ పీఎస్) లావాదేవీల్లో ఎస్‌బీఐలో రూ.10 లక్షలు, కెనరా బ్యాంకులో రూ.14.29 లక్షలు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.9.91 లక్షలు, పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.8.79 లక్షలు పోగొట్టుకున్నారని, సైబర్ క్రైమ్ gov.in నమోదు కాని లావాదేవీలు, కోట్లలో ఉండొచ్చు అనే సందేహమూ ఉంది. (యూఐడీఏఐ)లో మోసపూరిత ప్రయత్నాలను గుర్తించేందుకు నకిలీ బంక వేలిముద్రలను పసికట్టేందుకు అంతర్గతంగా భద్రమైన వేలిముద్రలను మేధా అభివృద్ధి యాంత్రిక వ్యవస్థ ఉందని సదరు మంత్రిగారు ఎప్పుడో చెప్పారు.

కానీ 2023 సెప్టెంబరు 16న మా అమ్మ గారి కోసం బీఎస్ఎన్ఎల్, చందానగర్, హైదరాబాద్ కెళ్ళి నా ఆధార్ వివరాలు, బయోమెట్రిక్ ఇచ్చి సిమ్‌కార్డు తీసుకున్న, రెండు రోజులకే నా కొటక్ మహీంద్రా బ్యాంకు ఖాతా నుండి 9999 రూపాయలు, యూనియన్ బ్యాంకు ఖాతా నుండి రూ.మూడు వేలు (ఏఈపీఎస్) ద్వారా సైబర్ నేరగాళ్ల కొట్టేశారు. (ఏఈపీఎస్) లావాదేవీలు సెల్‌ఫోన్లలో సిగ్నల్స్ సరిగ్గా రాక, ఇంటర్ నెట్ కనెక్టివిటీ సరిగా లేక, బ్యాంకు ఖాతాల్లో తగు బ్యాలెన్సులేక, శ్రామికులు, వృద్ధులు, బాలల బయోమెట్రిక్ నిర్ధారణ క్లిష్టంగా ఉండటం వల్ల 34 శాతం విఫలమవుతున్నాయి. లేకుంటే మరిన్ని సైబర్ దాడుల్లో మరిన్ని డబ్బులు పోయేవి. బ్యాంకు ఏజెంట్లు, బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా ఈ రకం లావాదేవీలు జరుపుకోవటానికి 35 బ్యాంకులు అంగీకరించాయి. దేశవ్యాప్తంగా బ్యాంకు ప్రాంగణంలో 1,10,282 ఏటీఎంలు, బ్యాంకు వెలుపల 1,38,579 ఏటీఎంల నిర్వహణ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నందున వీటి పర్యవేక్షణ, రక్షణ వ్యవస్థ, భద్రత లోపించాయి. (ఏఈపీఎస్) లావాదేవీలు సక్రమంగా జరిగేందుకు యూపీఐ లైట్‌ఆఫ్ లైన్ బయోమెట్రిక్ ధ్రువీకరణ, నాణ్యమైన, నమ్మకమైన 'నోబెల్ సాఫ్ట్‌వేర్'ని వాడాలి.

బ్యాంకు ఖాతాల్లో తమ ప్రమేయం లేకుండా సైబర్ నేరగాళ్ల (ఏఈపీఎస్) ద్వారా డబ్బుని కాజేస్తే 3 పని దినా ల్లోగా బ్యాంకు కి తెలియజేస్తే 90 రోజుల తర్వాత డబ్బు తిరిగి ఇస్తారట. లేదంటే ఇవ్వరని ఆర్‌బీఐ చెబుతుంది. సీరియస్‌గా ఉన్న వారు, హాస్పిటల్ రోగులు, బ్యాంకు నుండి లావాదేవీల ఎస్ఎంఎస్‌లు, మెయిల్స్ రానివారు, ఫోన్లు పాడైనవారు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ రానివారు, బిజీగా ఉండే వారు, నిరక్షరాస్యులకు 3 పని దినాల్లో బ్యాంకుకు తెలియ చేయటం సాధ్యమేనా! (ఏఈపీఎస్) బాధితులు ముందుగా బ్యాంకు హెల్ప్ లైన్ లేదా కస్టమర్ కేర్ కి ఫోన్ చేసి జరిగిన మోసం చెప్పి, ఖాతాలో అన్ని బ్యాంకు లావాదేవీలను నిలిపివేయ్యమని చెప్పాలి. తర్వాత సైబర్‌క్రైమ్ gov.in ఫిర్యాదు చేసి, ఆ ఎక్నాలెడ్జిమెంట్ ఉన్న పేపర్‌ను, ఒక లెటర్‌ను బ్యాంకులో ఇవ్వాలి. బ్యాంకు నుండి దీనికి సంబంధించిన ఫిర్యాదు సంఖ్యను, రశీదును తీసుకోవాలి. వెంటనే ఖాతా నుండి ఆధార్ వివరాలను తీసివేయాలి. దీని బదులు డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు, పాస్‌పోర్టు లాంటి జిరాక్స్ (ఏదో ఒక ప్రూఫ్) ఇవ్వాలి. బ్యాంకు అకౌంట్ తెరిచే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఆధార్ ఇవ్వొద్దు మరీ తప్పనిసరి అయితే 12 అంకెల బదులు చివరి 4 అంకెలున్న ముసుగు (మాస్క్) ఆధార్ మాత్రమే ఇవ్వాలి. అనవసరంగా బయోమెట్రిక్ ఇవ్వొద్దు. కొన్ని బ్యాంకులు కావాలని ఖాతాదారుల్ని ఆధార్, బయోమెట్రిలంటూ చంపేస్తున్నారు.

తరచూ బ్యాంకు ఖాతా, డెబిట్ ఏటీఎం కార్డు పిన్, ఇంటర్ నెట్ పాస్‌వర్డ్‌లను మారుస్తూ ఉండాలి. సంఘటన జరిగిన 90 రోజుల తర్వాత పోగొట్టుకున్న మొత్తం డబ్బుని ఖాతాలో జమ చెయ్యాలని బ్యాంకుని అడగాలి, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు లావాదేవీలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. (యూఐడీఏఐ) సైట్ కి వెళ్లి విస్టువల్ ఐడీని సృష్టించుకోవాలి. ఆధార్ సంఖ్యలో 12 అంకెలు కాగా, వీఐడీలో 16 అంకెలు ఉంటాయి. వీఐడీ అంకెలు మనకు తప్ప వేరే ఎవరికీ తెలియవు. ఇదే సంఖ్యతో ఆధార్‌కు తాళం వెయ్యొచ్చు, తాళంతీయ్యొచ్చు, మన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా వృద్ధుల ఆధార్‌లన్నింటికీ మన ఫోన్ నంబరు ఇవ్వటం సురక్షితం. (యూఐ డీఏఐ)లోకి వెళ్ళి మన ఆధార్ ధ్రువీకరణ ఎన్నిసార్లు (50 సార్లు జరిగిన) జరిగింది, ఎక్కడైనా దుర్వినియోగమవుతున్నదీ. తెలుసుకొని జాగ్రత్తగా ఉండొచ్చు. మిత్రులు, నెట్ సెంటర్లలో ఆధార్ డౌన్‌లోడ్ చేసుకుంటే, పనయ్యాక దీన్ని తొలగించేసుకోవాలి. సామాజిక మాధ్యమాలున్న వారు వివరాల గోప్యతను పాటించాలి.

బ్యాంకు లావాదేవీ ఆన్‌లైన్‌లో జరిపేటప్పుడు బ్యాంకు సైట్ పేరు సరిగ్గా ఉందా! లేదా! చివర డాట్ కామ్ లేదా ఆర్గ్ డాట్ ఉందాలేదా? సరిచూసుకోవాలి. తెలియని లింకులు వస్తే నొక్కవద్దు ఫోన్లలో మన వివరాలు చెప్పవద్దు. ఇలాంటి మోసాలు అరికట్టాలంటూ సెప్టెంబరు 2023లో "బ్యాంక్ బచావో... దేశ్ బచావో..." అంటూ సామాజిక కార్యకర్తలు రిజర్వు బ్యాంకు గవర్నర్‌ని కలిసి (ఏఈపీఎస్) మోసాలకు బ్యాంకులనే బాధ్యులు చెయ్యాలని లేఖ ఇచ్చారు. ఆధార్ వ్యవస్థ పటిష్టత కోసం పార్లమెంట్, సుప్రీంకోర్టుల సమన్వయం, పర్యవేక్షణ, మార్గ దర్శకత్వం ఉండితీరాలి. దేశంలో ఏ ఒక్క పౌరుడికి ఆధార్ సంఖ్య ఎలాంటి నష్టాన్ని కలిగించకూడదు.

> **తరచూ బ్యాంకు ఖాతా, డెబిట్ ఏటీఎం కార్డు పిన్, ఇంటర్‌నెట్ పాస్‌వర్డ్‌లను మారుస్తూ ఉండాలి. సంఘటన జరిగిన 90 రోజుల తర్వాత పోగొట్టుకున్న మొత్తం డబ్బుని ఖాతాలో జమచెయ్యాలని బ్యాంకుని అడగాలి, స్థిరాస్థుల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు లావాదేవీలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. (యూఐడీఏఐ) సైట్ కి వెళ్లి విస్టువల్ ఐడీని సృష్టించుకోవాలి. ఆధార్ సంఖ్యలో 12 అంకెలు కాగా, వీఐడీలో 16 అంకెలు ఉంటాయి. వీఐడీ అంకెలు మనకు తప్ప వేరే ఎవరికీ తెలియవు. ఇదే సంఖ్యతో ఆధార్‌కు తాళం వెయ్యొచ్చు, తాళంతీయ్యొచ్చు, మన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా వృద్ధుల ఆధార్‌లన్నిం టికీ మన ఫోన్ నంబరు ఇవ్వటం సురక్షితం.**

- ఎ.ఎన్.ఎస్.శంకరరావు, 9848685679

> **బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా, గృహలక్ష్మి పథకాల్లో అర్హులకు లబ్ధి చేకూరక పోవడంతో ఆ పార్టీ పట్ల వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలోనే అత్యంత ప్రతి ష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడి గడ్డ బ్యారేజీ వంతెన పిల్లర్లు కుంగిపోవడం చర్చనీయాంశంగా మారింది. కల్వకుంట్ల చంద్ర శేఖర్‌రావు కుటుంబం అవినీతికి ఇది సాక్షంగా చూపుతూ విపక్షాలు, ప్రతిపక్షాలు విరుచుకు పడుతున్నాయి. దీంతో బీఆర్ఎస్ సంది గ్ధంలో పడింది. దీనికితోడు బీఆర్ఎస్ ముఖ్య నేతలు అందరూ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ కాస్త బలహీన పడుతోంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ 'ఓడిపోతే రెస్ట్ తీసుకుంటా' అనడం... ఓటమికి చేరువైన ట్టేననే అర్థం వస్తోంది.**

'తుమ్మెద'లా వాలిపోతున్నారు!

అసలే చలి చుట్టుముడుతోంది. వాతావరణంలో కూడా చాలా మార్పులు కనిపిస్తున్నాయి. దీంతో పాటే ప్రజలు కాలానిక నుగునంగా మారుతున్నారు. ఇక పట్టణాల్లో అయితే చలి పెరిగితే చాలు చాయ్‌కొట్టు, బజ్జీల కొట్టు వద్దకు తుమ్మెదల్లా వాలిపోతున్నారు. మధ్యలో తుమ్మెద ఎందు కొచ్చిందని అనుకుంటున్నారా...? తుమ్మెదకు ఓ గుణం ఉంది. తేనె ఉండే పువ్వులు కనిపిస్తే చాలు వాలిపోతుంటాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు కూడా తుమ్మె దలానే ఉంటున్నాయి. ఎక్కడ మనీ, సీటు ఉంటే అక్కడే నాయకులు తుమ్మెదల్లా వాలిపోతున్నారు. ఎందుకంటే ఇది ఎన్నికల సీజన్-2023 కాబట్టి. ఈ యేడు తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికల దృష్ట్యా రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. రాష్ట్రంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఇలా అనేక పార్టీల్లోనూ రాజకీయం పుంజుకుంటోంది. పొత్తులు, ఎత్తులు, వ్యూహాలతో రాజకీయ చతురత చూపుతున్నారు. మేనిఫెస్టోలు, వాదోపవా దాలు, చర్చలు, సర్వేలు, సవాళ్లతో రాజకీయం హీటెక్కుతోంది. గెలుపు తమదంటే తమదేనంటూ తేగేసి చెబుతున్నారు. పథకాలు, గ్యారెంటీలు అంటూ మాయ జేసేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారు. ఇక బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మూడోసారి ముచ్చటగా అధికార పగ్గాలు చేపట్టేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కర్నాటక విజయ దరహాసంతో కాంగ్రెస్ ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ఒక్కసారి అవకాశమివ్వండంటూ అధికారం చేజి క్కిచ్చుకునే పనిలో పడింది. బీజేపీ సైతం ఒకపక్క అన్నీ ఊసిపోతున్నా తెలంగాణ రాష్ట్రంలో పాగా వేసేందుకు జిమ్మిక్కులు చేస్తోంది. ఏకంగా బీసీని ముఖ్య మంత్రి చేస్తామంటూ ప్రకటించింది. మొత్తంగా రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఎందుకంటే బీజేపీ కులమత రాజకీయాలు, ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే విధానాలకు పాల్పడడమే కాకుండా కార్మిక, కర్షక, ప్రజా హక్కులు కాలరాస్తోంది. ముఖ్యంగా ఢిల్లీలో రైతులపై చేయించిన దమనకాండ చరిత్రలో మరిచిపోలేనిదిగా మిగిలిపోయింది. ప్రజలు కూడా బీజేపీని నమ్మే పరిస్థితిలో లేరు. అయినా రాష్ట్రంలో అధికారం చేజిక్కిచ్చుకునేందుకు మత విద్వే షాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే ఇటీ వల ఓ సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీజేపీకి అధికారమిస్తే రాష్ట్రంలో ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. ఇలాంటి ప్రకటనలు హిందూ, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించవా?



అధికారంలోకి రావాలంటే ప్రజల కోసం పనిచేయాలి. వామపక్షాల వలే అధికారం ఉన్నా లేకున్నా ప్రజల కోసం పోరా డాలి. వారి యోగక్షేమాల గురించి, వారు పడుతున్న ఇబ్బందుల గురించి ఎప్పటికప్పుడూ తెలుసుకోవాలి. అప్పుడు ప్రజలు గుర్తిస్తారు. కానీ ఇలాంటి విద్వేషాల వల్ల ఆ ఆపార్టీ పలచన కావడమే తప్ప వేరే లేదు.

ఇక బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన రైతు బంధు, రైతు బీమా, గృహలక్ష్మి పథకాల్లో అర్హులకు లబ్ధి చేకూరకపోవడంతో ఆ పార్టీ పట్ల వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ వంతెన పిల్లర్లు కుంగిపోవడం చర్చనీయాంశంగా మారింది. కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబం అవినీతికి ఇది సాక్షంగా చూపుతూ విపక్షాలు, ప్రతిపక్షాలు విరుచుకు పడుతున్నాయి. దీంతో బీఆర్ఎస్ సందిగ్ధంలో పడింది. దీనికితోడు బీఆర్ఎస్ ముఖ్య నేతలు అందరూ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ కాస్త బలహీన పడుతోంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ 'ఓడిపోతే రెస్ట్ తీసుకుంటా' అనడం... ఓటమికి చేరువైన ట్టేననే అర్థం వస్తోంది. వీటన్నింటిని ఓటర్లు గమనిస్తూనే ఉన్నారు. మరోవైపు పోలీసు శాఖ కూడా అప్రమత్తం అయింది. డబ్బు అక్రమ రవాణా, ఓటర్లను లొంగదీసుకునేందుకు మద్యం, విలువైన వస్తువుల సరఫరా కాకుండా నిఘా పెట్టింది. చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల అవినీతి డబ్బు కోట్ల రూపాయల్లో పట్టుబడింది. కాగా ఇప్పటికే ఆయా నియోజక వర్గాల్లో ఆయా పార్టీలు డబ్బులను అక్రమ రవాణా చేసినట్టు ఆరోపణ లొస్తున్నాయి. మొత్తంగా పార్టీలు అన్నీ ఓటును కొనుగోలు చేసే పనిలో పడినట్టు అర్థమవుతోంది. అధికార పగ్గాలు చేజిక్కిచ్చుకు నేందుకు కోట్ల రూపాయలు కుమ్మరించి ఓట్లు కొల్లగొట్టేం దుకు తుమ్మెదల్లా వాలిపోతున్నాయి. ఇప్పటికే విజయభేరీ సభలు, ఆశీర్వాద సభలు అంటూ కోట్ల రూపాయలు ఖర్చు చేశాయి. ఓటుకు నోటు, మద్యం పంచుతూ పార్టీలు బలా బలాలు తేల్చుకుంటున్నాయి. ఇప్పటికైనా ఓటరు మేలుకుని అభివృద్ధి చేసే నాయకులను గుర్తించి ఎన్నుకో వాల్సిన సమ యం ఆసన్నమైంది. ప్రలోభాలకు, మాయమాటలకు లొంగకుండా ఉత్తమ నాయకులను ఎన్నుకోవాలి. లేదంటే పాత సీసాలో కొత్తసారాయి అన్న చందంగా షరామామూలే అవుతుంది.

- వేముల క్రాంతికుమార్, 9676717377

భారతదేశంలో పర్యావరణ చట్టాలు

దీపిక



మానవునితో పాటు సమస్త జీవ కోటి మనుగడ పర్యావరణంపైనే ఆధారపడి ఉంటుంది. అలాంటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవటం పౌరుల ప్రాధమిక బాధ్యత అని భారత రాజ్యాంగం చెబుతుంది. భారతదేశంలోని పర్యావరణ చట్టాలు పర్యావరణాన్ని రక్షించడానికి, సహజ వనరులను పరిరక్షించడానికి మరియు పర్యావరణ సమతుల్యతను ప్రభావితం చేసే కార్యకలాపాలను నియంత్రించడానికి అనుగుణంగా రూపొందించబడ్డాయి. ఈ చట్టాలు స్థిరమైన అభివృద్ధిని నిర్ధారించడానికి మరియు పర్యావరణ క్షీణతను తగ్గించడానికి కృషి చేస్తాయి. భారతదేశంలో పర్యా వరణ చట్టాలను విజయవంతంగా అమలు చేయడం అనేది ప్రభుత్వ సంస్థలు, న్యాయవ్యవస్థ, పౌర సమాజం, భారతీయ పౌరు లతో కూడిన సమిష్టి బాధ్యత. పర్యావరణ పరిరక్షణ కోసం సామూహిక, వ్యక్తిగత బాధ్యత తీసుకోవడం ద్వారా, భారత దేశం మరింత స్థిరమైన, పర్యావరణ సమతుల్య భవిష్యత్తు కోసం ప్రయత్నించవచ్చు. ఆ దిశగా పర్యావరణ చట్టాలపై అందరికి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది.

1. భారత పర్యావరణ చట్టం (1986) భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ప్రకారం ఆమోదించబడింది ?
ఎ) ఆర్టికల్ 51 బి) ఆర్టికల్ 235
సి) ఆర్టికల్ 32 డి) ఆర్టికల్ 253

2. పర్యావరణ చట్టాల యొక్క ప్రాథమిక లక్ష్యం ఏమిటి?
ఎ) కార్పొరేషన్ల హక్కులను పరిరక్షించడం
బి) పర్యావరణాన్ని సంరక్షించడం, రక్షించడం
సి) ఏ ధరకైనా ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం
డి) వ్యక్తిగత స్వేచ్ఛను పరిమితం చేయడం

3. భారతదేశ వన్యప్రాణి సంరక్షణ చట్టం ఎప్పుడు ఆమోదించబడింది ?
ఎ) 1972 బి) 1986
సి) 1927 డి) 1992

4. అటవీ సంరక్షణ చట్టం (1980) ఏ సంవత్సరంలో సవరించంబడింది?
ఎ) 1982 బి) 1988
సి) 1972 డి) 1992

5. ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరామైన పర్యావరణంలో జీవించటం అనేది ప్రజల ప్రాథమిక హక్కులలో అంత ర్భాగమని రాజ్యాంగంలోని ఏ అధికరణం చెబుతుంది ?
ఎ) ఆర్టికల్ 51 బి) ఆర్టికల్ 235
సి) ఆర్టికల్ 21 డి) ఆర్టికల్ 253

6. పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఏ సంవత్సరంలో ఏర్పాటు అయ్యింది ?
ఎ) 1982 బి) 1988
సి) 1972 డి) 1985

7. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ (జి) పర్యావరణ పరిరక్షణ ఎవరి బాధ్యతగా పేర్కొంటుంది ?
ఎ) ప్రభుత్వం బి) పౌరులు
సి) రాజ్యాంగం డి) న్యాయస్థానాలు

8. జీవవైవిధ్య సంరక్షణ చట్టాన్ని భారత పార్లమెంటు ఏ సంవత్సరంలో ఆమోదించబడింది ?
ఎ) 1999 బి) 1988
సి) 2002 డి) 2022

9. యునైటెడ్ స్టేట్స్‌లోని ఏ ఫెడరల్ ఏజెన్సీ పర్యావరణ చట్టాలను అమలు చేయడానికి బాధ్యత వహిస్తుంది?
ఎ) ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (EPA)
బి) ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (FBI)
సి) రక్షణ శాఖ (DoD)
డి) ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (FDA)

10. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ పాలసీ యాక్ట్ (NEPA) ప్రయోజనం ఏమిటి?
ఎ) గాలి నాణ్యత ప్రమాణాలను ఏర్పాటు చేయడం
బి) ప్రమాదకర వ్యర్థాలను పారవేయడాన్ని నియంత్రించడం
సి) ఫెడరల్ ప్రాజెక్ట్‌ల కోసం పర్యావరణ ప్రభావ అంచనాలు అవసరం
డి) వన్యప్రాణుల సంరక్షణను ప్రోత్సహించడం

11. యునైటెడ్ స్టేట్స్‌లోని ఏ చట్టం ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ, పారవేయడాన్ని నియంత్రిస్తుంది?
ఎ) క్లీన్ ఎయిర్ యాక్ట్
బి) స్వచ్ఛమైన నీటి చట్టం
సి) వనరుల సంరక్షణ మరియు పునరుద్ధరణ చట్టం (RCRA)
డి) ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ యాక్ట్ (OSHA)

12. పర్యావరణ చట్టంలో "స్థిరమైన అభివృద్ధి" భావన యొక్క లక్ష్యం ఏమిటి ?
ఎ) ఏ ధరకైనా ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించండి
బి) పర్యావరణ పరిరక్షణతో ఆర్థికాభివృద్ధిని సమతుల్యం చేయండి
సి) భవిష్యత్ తరాల ప్రయోజనాలను ప్రత్యేకంగా పరిరక్షించండి
డి) అన్ని రకాల పారిశ్రామిక అభివృద్ధిని నిషేధించండి

13. పర్యావరణ చట్టంలో "పబ్లిక్ ట్రస్ట్" సిద్ధాంతం ఈ కింది వాటిలో దేనిని సూచిస్తుంది ?
ఎ) ప్రభుత్వ వనరులు ప్రైవేట్ కార్పొరేషన్ల ఆధీనంలో ఉంటాయి
బి) సహజ వనరుల రక్షణకు ప్రభుత్వాలు బాధ్యత వహించవు
సి) ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాల కోసం కొన్ని సహజ వనరులను కాపాడాలి
డి) సహజ వనరులను ప్రైవేటీకరించాలి మరియు అత్యధిక బిడ్డర్‌కు విక్రయించాలి

14. సమగ్ర పర్యావరణ ప్రతిస్పందన, పరిహారం మరియు బాధ్యత చట్టం (CERCLA) ఇలా కూడా పిలుస్తారు ?
ఎ) క్లీన్ ఎయిర్ యాక్ట్
బి) సూపర్ ఫండ్ చట్టం
సి) స్వచ్ఛమైన నీటి చట్టం
డి) అంతరించిపోతున్న జాతుల చట్టం

15. పర్యావరణ చట్టంలో, "EIA" అనే పదం దేనిని సూచిస్తుంది?
ఎ) పర్యావరణ ప్రభావ అంచనా
బి) ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అలవెన్స్
సి) పర్యావరణ పెట్టుబడి ఒప్పందం
డి) పర్యావరణ సమాచార చట్టం

16. పర్యావరణ చట్టంలో "నో-హామ్ సూత్రం" భావన అంటే:
ఎ) పర్యావరణ హాని ఎల్లప్పుడూ ఆమోద యోగ్యమైనది.
బి) రాష్ట్రాలు తమ సరిహద్దులకు మించి జరిగే హానికి బాధ్యత వహించవు.
సి) రాష్ట్రాలు ఇతర రాష్ట్రాలకు పర్యావరణ హానిని నిరోధించాలి.
డి) పర్యావరణ హాని అనేది కేవలం దేశీయ సమస్య.



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

ప్రధాన భారతీయ పర్యావరణ చట్టాలు		
	పర్యావరణ చట్టాలు	సంవత్సరం
1	భారతీయ అటవీ చట్టం	1927
2	వన్యప్రాణుల రక్షణ చట్టం	1972
3	నీరు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం,	1974
4	నీరు (కాలుష్య నివారణ, నియంత్రణ) సెస్ చట్టం,	1977
5	అటవీ (సంరక్షణ) చట్టం	1980
6	వాయు (కాలుష్య నివారణ నియంత్రణ) చట్టం	1981
7	వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) (కేంద్రపాలిత ప్రాంతాలు) నియమాలు	1983
8	పర్యావరణ పరిరక్షణ చట్టం	1986
9	శక్తి పరిరక్షణ చట్టం	2001
10	జీవ వైవిధ్య చట్టం	2002
11	షెడ్యూల్డ్ తెగలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసులు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం	2006
12	నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం	2010

17. యునైటెడ్ స్టేట్స్‌లో, పురుగుమందుల వాడకం, పారవేయడాన్ని నియంత్రించడానికి ఏ ఫెడరల్ ఏజెన్సీ బాధ్యత వహిస్తుంది?
ఎ) ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (EPA)
బి) ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (FDA)
సి) వ్యవసాయ శాఖ (USDA)
డి) డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (DHS)

18. పర్యావరణ చట్టం సందర్భంలో " బ్రౌన్‌ఫీల్డ్స్ " అనే పదం దేనిని సూచిస్తుంది?
ఎ) కలుషితమైన పారిశ్రామిక ప్రదేశాలు
బి) రక్షిత అరణ్య ప్రాంతాలు
సి) నేల నాణ్యత తక్కువగా ఉన్న వ్యవసాయ భూములు
డి) ప్రమాదకర వ్యర్థాలను పారవేసే ప్రదేశాలు

19. గృహాల చెత్త వంటి ఘన వ్యర్థాలను పారవేయడాన్ని యునైటెడ్ స్టేట్స్‌లోని ఏ చట్టం నియంత్రిస్తుంది?
ఎ) క్లీన్ ఎయిర్ యాక్ట్
బి) స్వచ్ఛమైన నీటి చట్టం
సి) వనరుల సంరక్షణ మరియు పునరుద్ధరణ చట్టం (RCRA)
డి) అంతరించిపోతున్న జాతుల చట్టం

20. పర్యావరణ చట్టంలో, పర్యావరణ ప్రభావ అంచనా (EIA) ప్రయోజనం ఏమిటి?
ఎ) ప్రాజెక్ట్ ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేయడానికి
బి) ప్రాజెక్ట్ రాజకీయ చిక్కులను అంచనా వేయడానికి
సి) ప్రాజెక్ట్ సంభావ్య పర్యావరణ ప్రభావాలను అంచనా వేయడానికి
డి) ప్రాజెక్ట్ సాంస్కృతిక ప్రభావాన్ని అంచనా వేయడానికి

21. ఏ సంవత్సరంలో భారతదేశం జాతీయ అటవీ విధానం రెండవ ఎడిషన్‌ను ప్రారంభించింది ?
ఎ) 1986 బి) 1988
సి) 1989 డి) 2002

22. వాయు (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) చట్టం, 1981 ప్రకారం, పరిసర గాలి నాణ్యత కోసం ప్రమాణాలను నిర్ణయించే అధికారం ఏ సంస్థకు ఉంది ?
ఎ) భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ
బి) కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి
సి) రాష్ట్ర గృహ వ్యవహారాలు మంత్రిత్వ శాఖ
డి) కేంద్ర గృహ వ్యవహారాలు మంత్రిత్వ శాఖ

23. ఈ కింది వాటిలో అటవీ నివాస షెడ్యూల్డ్ తెగల అటవీ హక్కులు ఏవి ?
ఎ) అటవీ భూములలో జీవించే హక్కు
బి) చిన్నపాటి అటవీ ఉత్పత్తులను సేకరించడం, ఉపయోగించడం
సి) అటవీ భూములపై యాజమాన్య హక్కు కలిగిఉండటం డి) పైవన్నీ

24. వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం, 1981లో ధ్వని కాలుష్య నివారణని ఎప్పుడు చేర్చారు?
ఎ) 1983 బి) 1986
సి) 1987 డి) 1989

25. భారతదేశంలో గ్రీన్ అడ్వకేట్ గా ఎవరిని పిలుస్తారు ?
ఎ) ఎం.సి మెహతా బి) పి.సి మెహతా
సి) కులదీప్ సింగ్ డి) ఎం.సి సింగ్

సమాధానాలు

1. డి	2. బి	3. ఎ	4. బి	5. సి
6. డి	7. బి	8. సి	9. ఎ	10. సి
11. సి	12. బి	13. సి	14. బి	15. ఎ
16. సి	17. సి	18. ఎ	19. సి	20. సి
21. బి	22. బి	23. డి	24. సి	25. ఎ



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

శ్రీలంకలో ఎస్‌బిఐ శాఖను ప్రారంభించిన నిర్మలా సీతారామన్

మూడు రోజుల పర్యటన లో భాగంగా శ్రీలంకలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ట్రిం కోమలీలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కొత్త శాఖను ప్రారంభించారు. దీని ద్వారా శ్రీలంకకు ఇండియాకు మధ్య ఆర్థిక సంబంధాలు మరింత మెరుగు పడనున్నాయి.

పర్యాటక ప్రోత్సాహం కొరకు భారతీయులకు వీసా రహిత ప్రవేశం కల్పించిన థాయ్‌లాండ్




భారతదేశం, తైవాన్ పౌరులకు వీసా రహిత ప్రవేశాన్ని కల్పించడం ద్వారా థాయ్ లాండ్ తన పర్యాటక రంగాన్ని అభివృద్ధి పర్చ డానికి చర్యలు తీసుకొంది. దీని ద్వారా భారత దేశం, తైవాన్ పౌరులు వీసా లేకుండా థాయిలాండ్‌లో గరిష్ఠంగా 30 రోజులు ఉండగలరు.

హైదరాబాద్‌లో వాయుకాలుష్యం 18.6శాతం పెరుగుదల



రెస్పిరల్ రిపోర్ట్ ప్రకారం వాయు కాలుష్యం గత ఏడాదితో పోలిస్తే నాలుగు ప్రధాన నగరాలలో పెరిగిందని పేర్కొంది. ప్రధాన రాష్ట్ర రాజధానులలో 2019 మరియు 2023 మధ్య పి.ఎం 2.5 సాంద్రతలను అధ్యయనం విశ్లేషించింది. హైదరాబాద్‌లో పి.ఎం. 2.5 2019 మరియు 2020 మధ్య 59శాతం పెరిగింది. 2021లో 2.97 మరియు 2022లో గణనీయంగా 29.1శాతం పెరిగింది. అయితే 2023లో 18.6 శాతం మళ్ళీ పెరిగింది.

ప్రముఖ రచయిత టి.పద్మనాభన్‌కు ప్రతిష్టాత్మక కేరళ జ్యోతి అవార్డు



కేరళ ప్రభుత్వం ప్రఖ్యాత రచయిత టి.పద్మ నాభన్‌ను ప్రతిష్టాత్మక కేరళ జ్యోతి అవార్డు గ్రహీతగా ఎంపిక చేసింది. మలయాళ సాహిత్యానికి పద్మనాభన్ చేసిన విశేష సేవలకు గుర్తింపుగా రాష్ట్రంలో ఈ అత్యున్నత పౌర పురస్కారం లభించింది. సామాజిక జీవితంలో వివిధ అంశాలకు విశేషమైన కృషి చేసిన వ్యక్తులకు కేరళ పురస్కారాలు' అని పిలిచే అనేక ఇతర ప్రశంసలు కూడా కేరళ ప్రభుత్వం ప్రకటించింది.